Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ దశమి సా. 4.21 వరకు, అనంతరం ఏకాదశి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 9.31 వరకు, అనంతరం మూల; అమృతకాలం: ఉ. 11.45 నుండి 1.30 వరకు; వర్జ్యం: తె. 6.15 నుండి (మరుసటి ఉ. 8.07) వరకు; దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు; రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు; యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

సంపుటి:56 • సంచిక:300 • శనివారం 10 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

రాజ్యసభకు సంతోష్!?



- టీఆర్ఎస్ శ్రేణుల నుంచి ఒత్తిళ్ళు
- పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్ వెంటే
- పెద్దల సభకు పంపిస్తే పార్టీలో మరింత జోష్

సానుకూల అంశాలు :

- యువకుడు
- విశ్వసనీయుడు
- సీఎంకు కుడి భుజం
- పార్టీకి వెన్ను దన్ను
- కేడర్‌తో అనుబంధం
- 17 ఏళ్ళుగా కార్యకర్త
- చక్కని సమన్వయకర్త

> తొలిసారి.. పార్టీకి ఒకేసారి మూడు రాజ్యసభ స్థానాలు లభిస్తుండగా, ఈ కీలక సందర్భంలో సంతోష్ లాంటి నేతలకు ప్రాధాన్యం దక్కాలని పార్టీ కేడర్ కోరుకుంటోంది.

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోగినపల్లి సంతోష్‌కుమార్ పేరు రాజ్యసభ అభ్యర్థిత్వానికి ప్రముఖంగా వినిపిస్తోంది. రాష్ట్రానికి చెందిన మూడు రాజ్యసభ స్థానాలు ఏప్రిల్ 2న ఖాళీ కానుండగా, ఈ పదవుల భర్తీకి ఈనెలలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ నేపథ్యంలో రాజ్యసభకు ఎంపిక చేసే అభ్యర్థులకు పోటీ తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో ఖాళీ కానున్న మూడు స్థానాల్లో ఒక స్థానాన్ని యాదవులకు ఇస్తానని ముఖ్యమంత్రి కెసిఆర్ ఇదివరకే ప్రకటించగా, మిగతా రెండు స్థానాలకు సంబంధించి సిఎంపై ఒత్తిడి ఉంది. ప్రధానంగా టిఆర్ఎస్ పార్టీ సమన్వయ బాధ్యతలను అత్యంత చాకచక్యంగా నిర్వహిస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తల మన్ననలందుకుంటున్న సంతోష్ పేరు బలంగా వినిపిస్తోంది. టిఆర్ఎస్ ఆవిర్భావం నుండి.. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు వెన్నంటే ఉండి అనుక్షణం ఆయనను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న యువనేత సంతోష్‌ను ఎంపిక చేయాలని పార్టీ నేతలు, కేడర్ ముఖ్యమంత్రిపై వివిధ రూపాల్లో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. 2001 ఏప్రిల్ 27న టిఆర్ఎస్ ఆవిర్భవించగా, గత 17 ఏళ్ళుగా పార్టీకి సంబంధించిన అతి కీలక బాధ్యతలు.. అత్యంత నిబద్ధతతో ఎలాంటి మచ్చ కూడా లేకుండా నిర్వహించడం, అందరితో మర్యాద పూర్వక ➪ 2వ పేజీలో...



స్టార్టప్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు

ట్రెండ్ సెట్టర్

తెలంగాణ

- రెండేళ్లలో ఆరు వేల పరిశ్రమలు
- లక్షా 24 వేల కోట్లు పెట్టుబడులు
- ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఇండస్ట్రియల్ పాలసీ అమలు
- క్రెడాయ్ యూత్‌కాన్–2018 ప్రారంభ సదస్సులో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన 40 మాసాల్లోనే తెలంగాణ రాష్ట్రం ట్రెండ్ సెట్టర్‌గా మారిందని.. పలు అంశాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. డైనమిక్ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన అభివృద్ధి సాధిస్తూ... పురోగతి దిశగా పరుగులు తీస్తోందన్నారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం తెలంగాణ రాష్ట్రం కొత్తగా టీఎస్-ఐపాస్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ విధానాన్ని జూన్-2, 2015 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కేవలం రెండున్నర సంవత్సరాల వ్యవధిలో సుమారు ఆరువేల పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్నారు. శుక్రవారం హైటెక్స్‌లోని హెచ్ఐసీసీలో క్రెడాయ్ యూత్‌కాన్- 2018 కాన్ఫరెన్స్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ఇండస్ట్రియల్ పాలసీని తీసుకొచ్చామన్నారు. ఈ విధానంతో లక్షా 20వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించినట్లు తెలిపారు. 15 రోజుల్లోనే పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులు ఇస్తున్నామన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి చేయూత అందించేందుకు భవన నిర్మాణాలకు కూడా కేవలం పక్షం రోజుల్లోనే అనుమతులు జారీ చేస్తున్నామని వివరించారు. పదిహేను రోజుల్లో అనుమతులు రానిపక్షంలో సదరు దరఖాస్తుదారుడు అనుమతి ➪ 3వ పేజీలో...

రోగ నిర్ధారణ పరీక్షలు

ఉచితం



ఖర్చెంతైనా సరే వైద్యం తప్పనిసరి

బోదకాలు బాధితులకు రూ.1000 పింఛన్

- దేశానికే ఆదర్శంగా ప్రజారోగ్యం
- ఆశా వర్కర్లకు మళ్లీ వేతనాలు పెంపు
- రెండో ఏఎన్ఎంలకు పెంచుతాం
- కేసీఆర్ కిట్స్ ప్రైవేటు నో: సీఎం కేసీఆర్


తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యం తీరు మారింది. ప్రభుత్వ ఆస్పత్రులు కూడా ఎంతో మెరుగయ్యాయి. కేసీఆర్ కిట్స్ పథకం అద్భుతంగా అమలవుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్రం తీసుకున్న చర్యలను ప్రశంసించింది. వైద్య అధికారులు, సిబ్బంది తీరుపై సర్వత్రా సంతృప్తి, సంతోషం వ్యక్తమవుతున్నది. ఫలితంగా మలేరియా, డెంగ్యూ మరణాలు తగ్గాయి. ఈ ఒరవడి, స్ఫూర్తి కొనసాగాలి.

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రతీ ఒక్కరికీ ఉచిత రోగ నిర్ధారణ పరీక్షల నిర్వహణ, రోగమొస్తే ఉచితంగా వైద్యం అందజేత...ఎంత ఖర్చయినా సరే భరించేలా సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణులకు, నిరుపేదలకు మెరుగైన వైద్య సేవల కల్పనలో అద్భుత నిర్ణయం తీసుకుంది. పనిలోపనిగా బోదకాల బాధితులకూ పింఛన్ అందించి ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రెండు ప్రతిష్టాత్మక కీలక నిర్ణయాలపై సీఎం కేసీఆర్ ఆమోదముద్ర వేశారు. అదేవిధంగా ఆశ వర్కర్లకు మరోసారి వేతనాలు పెంచనున్నామని, సెకండ్ ఏఎన్ఎంలకు కూడా జీతాలు పెంచి సేవలను మరింతగా వినియోగించుకుంటామని ఆయన తెలిపారు. ఇకపై బోదకాల బాధితులకు ప్రతీ నెలా వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆదేశించారు. రాష్ట్రంలోని 47వేల మంది బోదకాల బాధితులకు వచ్చే ఆర్థిక ఏడాదినుంచి పెన్షన్ అందించేందుకు వీలుగా బడ్జెట్‌లో నిధులను కేటాయించనున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ప్రివెంటివ్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్ అనే నానుడిని ఆచరణలో పెట్టి తెలంగాణ వ్యాప్తంగా గ్రామం యూనిట్‌గా ప్రజలందరికీ ప్రభుత్వ ఖర్చుతోనే రోగ నిర్ధారక పరీక్షలు చేయించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. గ్రామస్థాయిలో ➪ 3వ పేజీలో...

పట్టాదారు పాస్‌బుక్

రైతు ఫొటో ఒక్కటే..!

తెలంగాణ ప్రభుత్వ ముద్ర చాలు ముదురు ఆకుపచ్చ రంగులో ఉండాలి: ముఖ్యమంత్రి 3



కొరియర్లో పులి పిల్ల!

మెక్సికోలోని జలిస్కో సెంట్రల్ బస్ స్టేషన్‌లో ఒక నీలిరంగు ప్లాస్టిక్ కంటెయినర్‌ని పోలీసు జాగిలం ఇట్టే పసిగట్టింది. అందులో రెండు నెలల బెంగాల్ టైగర్ పసికూన అమాయకంగా పడుకొని కనిపించింది. దానికి గాలి ఆడేందుకు వీలుగా కంటెయినర్‌కి చిల్లులు పెట్టారు.

ఔరా..!



శ్వేతపత్రంతో నిధుల నిగ్గు తేలాలి

సామాన్యుడి సందిగ్ధాన్ని తొలగించాలి

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

అసలేం జరిగింది.. ఎందుకు జరుగుతోంది.. సగటు తెలుగువాటికి ఈ విషయం అర్థం కావడం లేదు. ఒక్క తెలుగువాడికే కాదు.. దేశం యావత్తు ప్రజలందరికిదే సందేహం. బడ్జెట్ ప్రవేశపెట్టింది మొదలు పార్లమెంట్‌లో రోజూ ధర్నాలు, హర్తాళ్ళు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని.. దండిగా నిధులిచ్చి సంతృప్తిపర్చాలంటూ ఎంపీలు ప్లకార్డులతో పార్లమెంట్‌ను స్థంభింపజేస్తున్నారు. వీరికి టీఆర్ఎస్‌తో సహా మరికొన్ని పార్టీలు మద్దతు ప్రకటించాయి. మరోవైపు ప్రభుత్వం ఇప్పటికే అవసరమైనన్ని నిధులిచ్చేశాం.. ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేశాం.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌కే ఎక్కువగా సహకారం అందిస్తున్నామంటూ ప్రకటిస్తోంది. ఈ రెండు పక్షాల విభిన్నవాదనలు, వ్యాఖ్యలు సాధారణ ప్రజానీకానికి అర్థంకావడంలేదు. ఓ వైపు నిధులు రాలేదంటూ చెబుతున్నది ఏ ప్రతిపక్షమో కాదు.. ఈ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏలుతున్న తెలుగుదేశం. పైగా ఆ పార్టీ కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. తెలుగుదేశానికి చెందిన ఇద్దరు కేంద్రంలో మంత్రి పదవుల్ని కూడా ➪ 3వ పేజీలో...



పార్లమెంటు వెలుపల నిరసన తెలియజేస్తున్న ఏపీ ఎంపీలు

తెరాస పల్లె నిద్ర

- మార్చిలో శ్రీకారం
- మండలానికి ఇద్దరు ఇన్‌ఛార్జిలు
- హైదరాబాద్‌లోనే పార్టీ ప్లీనరీ
- నేడో రేపో షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ : టిఆర్ఎస్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ నెలలో నిర్వహించే టిఆర్ఎస్ ఎల్పీ సమావేశం సందర్భంగా పార్టీ కార్యక్రమాల క్యాలెండర్‌ను సిఎం కెసిఆర్ ప్రకటించ నున్నట్లు సమాచారం. పల్లెనిద్ర కార్యక్రమం విజయవంతం కోసం ప్రతి మండలానికి ఇద్దరు ముఖ్యనేతలను ఇన్‌చార్జిలుగా నియమించనున్నట్లు సమాచారం. ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికీ ప్రభుత్వ కార్యక్రమాలను తీసుకెళ్ళేలా, గ్రామాల్లో ఉండే సమస్యలను.. పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు సమాచారం. దీనితోపాటు కార్యకర్తలకు చేతినిండా పని ఉండేలా అనేక కార్యక్రమాలు రూపొందించినట్లు సమాచారం. పార్టీ ఆవిర్భావం వరకు కార్యక్రమాల క్యాలెండర్ ➪ 3వ పేజీలో...

దిగొచ్చిన కేంద్రం

- ఏపీ డిమాండ్లకు సూత్రప్రాయ అంగీకారం
- రెవెన్యూ లోటు భర్తీకి సానుకూలం
- కేంద్ర మంత్రులు జైట్లీ, పీయూష్, బీజేపీ చీఫ్ అమిత్ షాతో సుజనాచౌదరి భేటీ 10





సీఎం కేసీఆర్‌తో సంతోష్

రాజ్యసభకు సంతోష్!?

(మొదటి పేజీ తరువాయి)

పద్ధతిలో వ్యవహరించి పార్టీ అప్పగించిన బాధ్యతలను చక్కబెట్టడం సంతోష్‌కు ప్రధాన బలంగా పార్టీలో చర్చ జరుగుతోంది. టిఆర్ఎస్ రాష్ట్రప్రధానకార్యదర్శిగా రాష్ట్రంలోని నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలను సమన్వయం చేయడం.. పార్టీ పరిస్థితిని, కార్యక్రమాల తీరును ఎప్పటికపుడు ముఖ్యమంత్రికి నివేదిస్తూ పార్టీ వ్యవహారాల్లో సిఎంకు కుడిభుజంగా, తలలో నాలుకలా వ్యవహరిస్తున్నారన్న పేరుంది. తెలంగాణ రాష్ట్రసాధన కోసం ముఖ్యమంత్రి కెసిఆర్ దీక్ష చేసిన సందర్భంలోనూ.. జైల్లోనూ, ఆస్పత్రిలో ఉన్న సమయంలోనూ సంతోష్ అనుక్షణం ఆయనకు కంటికిరెప్పలా వ్యవహరించారని కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. కెసిఆర్ కేంద్రమంత్రిగా ఉన్న సమయంలోనూ వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న సంతోష్.. అధినేత కోసం నిరంతరం తపించేవారని, ఆయన అప్పగించిన బాధ్యతలు నిబద్దతతో మరొకరికి తెలియకుండా పూర్తిచేసేవారని చెబుతారు. ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కూడా ముఖ్యమంత్రి కెసిఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్నప్పటికీ.. అధికారపీఠానికి దగ్గరగా ఉన్నామనే భావన లేకుండా.. అందరితోనూ కలుపుగోలుగా వ్యవహరించడం, కీలక బాధ్యతలను సౌమ్యంగా పూర్తిచేయడం, చిన్న ఆరోపణ కూడా ఎదురు కాకుండా .. గౌరవానికి భంగం కలగకుండా వ్యవహరించడం.. ఎంత ఒత్తిడి ఉన్నా చెదరని చిరునవ్వుతోనే పని పూర్తిచేయడం సంతోష్‌కు మాత్రమే సాధ్యమైన విషయమని ఓ ముఖ్యనేత అన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పార్టీకి సంబంధించిన కార్యక్రమాల్లో నిర్విరామంగా పనిచేసే సంతోష్‌కు రాజ్యసభ ఇవ్వాల్సిందేనన్న ఒత్తిళ్ళు అధిష్టానంపై బలంగా ఉన్నాయి. ప్రస్తుతం టిఆర్ఎస్‌కు మూడు రాజ్యసభ స్థానాలుండగా.. సీనియర్లే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా లభించే స్థానాల్లో సంతోష్ లాంటి యువనేతను ఎంపికచేస్తే పార్టీకి ప్రయోజనకరమన్న డిమాండ్ యువత నుండి వినిపిస్తోంది. సంతోష్‌ను రాజ్యసభకు ఎంపికచేస్తే.. ఆది నుండీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు నీడలా పనిచేసిన నేతకు న్యాయం లభించడంతో పాటు జాతీయ స్థాయిలోనూ పార్టీకి.. ప్రభుత్వానికి మరింత ప్రయోజనం కలుగుతుందన్న చర్చ జరుగుతోంది. టిఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత తొలిసారి.. పార్టీకి ఒకేసారి మూడు రాజ్యసభ స్థానాలు లభిస్తుండగా, ఈ కీలక సందర్భంలో సంతోష్ లాంటి నేతలకు ప్రాధాన్యం దక్కాలని పార్టీ క్యాడర్ కోరుకుంటోంది. క్యాడర్, నాయకుల నుండి వస్తున్న ఒత్తిడిని పలువురు నేతలు ఇప్పటికే సిఎం దృష్టికి తీసుకెళ్ళినట్లు సమాచారం. తాజాగా టిఆర్ఎస్‌కు దక్కనున్న మూడు రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానాన్ని



ఉద్యమనేత కేసీఆర్‌తో సంతోష్

యాదవులకు ఇస్తానని సిఎం ప్రకటించగా.. దీనిపై హర్షం వ్యక్తమవుతోంది. యాదవుల నుండి జైపాల్‌యాదవ్, రాజయ్యయాదవ్, నోముల నర్సింహ్మయ్యల పేర్లు ఈ పదవికి బలంగా వినిపిస్తున్నాయి. మిగిలిన రెండు స్థానాల్లో ఒక స్థానాన్ని ముఖ్యమంత్రి కెసిఆరే శ్వాసగా పనిచేస్తున్న సంతోష్‌కు ఇవ్వాలన్న విజ్ఞప్తులు వినిపి స్తున్నాయి. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ళు కావస్తుండగా.. ఆదినుండీ ఆయన వెన్నంటి ఉన్న సంతోష్, శేరి సుభాష్‌రెడ్డి లాంటి నేతలకు అవకాశాలు ఇవ్వాలన్న వినతులు అందుతున్నాయి. ప్రస్తుతం కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న శేరి సుభాష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలన్న డిమాండ్ క్యాడర్ నుండి విని పిస్తోంది. ఇంకా ఆవిర్భావం నుండి కెసిఆరే శ్వాసగా పనిచేస్తున్న నేతలకు పార్టీకి లభించిన అవకాశాలు పంచాలని నేతల నుండి సూచనలు అందుతున్నాయి. టిఆర్ఎస్‌కు తొలిసారి మూడు రాజ్యసభ స్థానాలు దక్కుతుండగా.. ముఖ్యమంత్రి కెసిఆర్ మది లో ఏముందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈనెలలోనే రాజ్యసభ నోటిఫికేషన్ రానుండగా, మరో వారం, పదిరోజుల్లో అభ్యర్థులను ఖరారుచేసే అవకాశం కనబడుతోంది.

నేడు సెలవు లేదు

- జనవరి 1 బదులు నేడు వర్కింగ్ డే : ప్రభుత్వ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నేడు పనిదినంగా ప్రభుత్వం ప్రకటించింది. నేడు రెండో శనివారం ప్రభుత్వ సెలవు లేదని అధికారికంగా ప్రకటించింది. జనవరి 1న సెలవుగా ప్రకటించడంతో రెండో శనివారం సెలవును రద్దు చేసింది. జనవరి 1న సెలవు దినానికి బదులుగా నేడు ప్రభుత్వ కార్యలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పాఠశాలలు, ఇతర సంస్థలు పనిచేస్తాయని ప్రభుత్వం పేర్కొంది.

పేదలు సంతోషంగా ఉండాలి

- అదే సీఎం కేసీఆర్ కోరిక : మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్, ప్రభ న్యూస్ : పేదలు సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) కోరిక అని, కాంగ్రెస్ పార్టీ వుంటే పది సంవత్సరాలైనా కాళేశ్వరం నీళ్ళు వచ్చేవికావని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖామంత్రి తన్నీరు హరీష్‌రావు ఎద్దేవ చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ నగరపంచాయతీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఊరచెరువులో రూ.5.66 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మిషన్ కాకతీయ ఫేజ్-4 పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం నీటితో గజ్వేల్ నియోజకవర్గానికి ప్రతి ఎకరానికి సాగునీరు అందిస్తామన్నారు. రూ.157 కోట్లతో ఈ నియోజకవర్గంలో 647 చెరువులను ఫేజ్-3, ఫేజ్-4 కింద మరమ్మతులు పూర్తవుతున్నాయన్నారు. కాళేశ్వరం ద్వారా 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. అప్పుడు కరువు ప్రాంతంగా వుండే గజ్వేల్ కాళేశ్వరం నీళ్ళతో కళకళలాడబోతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ లేకపోతే గజ్వేల్‌కు నీరు వచ్చేదికాదన్నారు. అధునాతన సౌకర్యాలతో ఆసుపత్రి భవనం నిర్మించడం జరిగిందని, ఈనెలలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో డయాలసిస్, ఐసియులు ఏర్పాటు చేస్తామని, ప్రైవేట్ ఆసుపత్రిలో డెలివరీకి రూ.30వేలు ఖర్చయ్యేవని, టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రిలో డెలివరీ అయితే రూ.12వేలు అందించి, కెసిఆర్ కిట్‌ను అందిస్తుందన్నారు. కేసీఆర్ దొరకడం ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. ఒకనాడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు నేటి భారతం సినిమాలో పాట లాగా ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వంలో నేను పోత బిడ్డ సర్కారు దవాఖానకు అనే విధంగా కొత్త సినిమాలో పాట వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర హౌజింగ్ కార్పోరేషన్ చైర్మన్ మడుపు భూంరెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ తూంకుంట నర్సారెడ్డి, రాష్ట్ర ఆహార సంస్థ కార్పోరేషన్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, నగరపంచాయతీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్‌చైర్మన్ దుంబాల అరుణభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హస్తినలో సీఎం కేసీఆర్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు శుక్రవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. నేరుగా తుగ్లక్ రోడ్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. ఢిల్లీలో 3 నుంచి 4 రోజుల పాటు ఉంటారని తెలుస్తోంది. అయితే ఈ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమని, అందుకే అధికారులెవరినీ తన వెంట తీసుకురాలేదని తెలంగాణ భవన్ వర్గాల ద్వారా తెలిసింది. పంటి నొప్పికి చికిత్స చేయించుకునే క్రమంలోనే ఆయన ఢిల్లీకి వచ్చారని, ఇక్కడ రెండు, మూడు రోజులు విశ్రాంతి తీసుకుంటారని తెలుస్తోంది. అయితే ఒకవైపు కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం సైతం తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కింది. టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎంపీలు సైతం పార్లమెంటులో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటన చేపట్టిన రాష్ట్ర మంత్రి కే.టీ రామారావు సైతం బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఢిల్లీ చేరుకోవడం రాజకీయవర్గాల్లో చర్చకు తావిచ్చింది. అసంతృప్తిని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దృష్టికి తీసుకొచ్చేందుకు సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారన్న ఊహాగానాలు సైతం వినిపించాయి. అయితే ప్రధాని 3 దేశాల పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నమే బయల్దేరి వెళ్లడంతో ప్రధానిని కలిసే అవకాశం లేదని స్పష్టత వచ్చింది. అయితే కేంద్రంలోని ఇతర మంత్రులెవరినైనా కలుసే అవకాశంపై కూడా స్పష్టత లేదు. ఆయన వెంట అధికారులెవరూ రాకపోవడంతో ఈ పర్యటన అధికారిక పర్యటన కాదని, పూర్తిగా వ్యక్తిగత పర్యటన అని అర్థమవుతోంది.

వ్యవసాయ యాంత్రీకరణకు టెక్నాలజీ

- పరిశోధనకు 125 ఎకరాలు : టఫే ఎండీ కేశవన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల ప్రాజెక్టును నెలకొల్పనున్నట్లు టఫే ప్రెసిడెంట్ కెఆర్ కేశవన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ.200 కోట్ల పెట్టుబడి వ్యయం అవుతుందని, త్వరలో రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన చెప్పారు. అలాగే వ్యవసాయ ఆధునీకరణ, నూతన సేంద్రీయ పద్ధతులు, పరిశోధనలు, రైతాంగానికి శిక్షణ, ఎరువులు, నీటి వాడకంపై అవగాహన కల్పించేందుకు జెఫామ్‌ను నెలకొల్పనున్నట్లు ఆయన తెలిపారు. దీనికి అవసరమైన 50 హెక్టార్ల భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం సమ్మతించిందని, అనుకూలమైన పరిస్థితిని బట్టి ఏ ప్రాంతంలో పెట్టాలో నిర్ణయిస్తామని ఆయన చెప్పారు. టఫే సంస్థ సిఎస్ఆర్ కింద జెఫామ్ నిర్వహణ చేపడుతుందని, ఇది రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని లాభాపేక్ష లేకుండా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఇజ్రాయిల్ స్థాయిలో ఉత్పత్తులు ఉంటాయని, వీటి ద్వారా వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించడంతో పాటు రైతులకు ఆర్థికంగా లబ్ధి చేకూర్చేలా పరికరాలను ఉత్పత్తి చేస్తామని ఆయన చెప్పారు. అయితే దీనికి సంబంధించి ప్రభుత్వంతో చర్చలు జరిపామని, ఎంవోయూ కుదుర్చుకోగానే కంపెనీ నెలకొల్పే కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. తమిళనాడులో 200 ఎకరాలు, రాజస్థాన్‌లో 50 ఎకరాల తమ సంస్థ భూముల్లో జెఫామ్ వ్యవస్థను నడిపిస్తున్నామని ఆయన చెప్పారు. రైతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు కొత్త వంగడాలు అభివృద్ధిచేసి ఇస్తామని, మార్కెట్ పోకడలు, వాతావరణ పరిస్థితులనుబట్టి ఆ సీజన్‌లో ఏ పంట వేయాలో సలహాఇచ్చి రైతాంగాన్ని ఆర్థికంగా పరిపుష్టి చేయడమే తమ సంస్థ సామాజికసేవాలక్ష్యంగా పని చేస్తుందని కేశవన్ చెప్పారు. రాజస్థాన్‌లోని జెఫామ్‌ను రోజూ దాదాపు 300 మంది రైతులు సందర్శించి శిక్షణ పొందుతారని ఆయన తెలిపారు. జెఫామ్‌లో తాము అన్ని వసతులతో కూడిన ఒక అనువైన ప్లాట్‌ఫామ్‌ను అందిస్తామన్నారు.

డ్రోన్ టెక్నాలజీ కీలకం

- హ్యాకడ్రోన్ విజేతలుగా నగర విద్యార్థులు
- అభినందించిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రణాళికాబద్ధంగా పట్టణాల అభివృద్ధికి డ్రోన్స్‌లాంటి కొత్త టెక్నాలజీలు కీలకమైన వ్యవస్థలుగా ప్రధాన భూమిక పోషిస్తాయని రాష్ట్ర ఐటిశాఖ కేటీ రామారావు అన్నారు. భారత్ లాంటి దేశాల్లో ఈ కొత్త టెక్నాలజీలు సమాజంపై ఎంతో ప్రభావం చూపిస్తాయని, వీటి అన్వేషణలు మరింతగా విస్తరించాల్సి ఉందని ఆయన అన్నారు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ సియాంట్ నిర్వహించిన హ్యాకడ్రోన్ 2018లో విజేతలకు శుక్రవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. సియాంట్ సంస్థ నిర్వహించిన హ్యాకడ్రోన్‌లో 4,500 మంది రిజిస్టర్ చేసుకోగా, ఏడుగురు కాలేజీ విద్యార్థులు, టెక్నాలజీ నిపుణులు, డవలపర్లు ఫైనల్ పోటీకి నిలిచారు. మహిళలకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక యాప్‌తో అనుసంధానం చేసి రూపొందించిన డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేసిన కేశవ్ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు విజేతగా ప్రకటించారు. వీరికి కేటీఆర్ చేతుల మీదుగా సర్టిఫికెట్, రూ.3 లక్షల నగదు పారితోషకం అందించారు.

సియాంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బివిఆర్ మోహ న్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు, స్టార్టప్ కంపెనీలు అన్వేషణలపై మక్కువ పెంచుకుంటున్నారని అన్నారు. వ్యవసాయం, జాతీయ భద్రత, ప్రజారక్షణ తదితర సామాజిక అంశాలకు టెక్నాలజీ ఎంతగానో దోహద పడుతుందని, ఆ కోణంలో డ్రోన్ అప్లికేషన్స్ విస్తరించాలని ఆయన అన్నారు. సియాంట్ సీఈఈవో కృష్ణ బోడనపు మాట్లాడుతూ, హ్యాకథాన్స్ ఇమాజినేషన్, ఎకోసిస్టమ్ రూపకల్పన అమలులో కీలకంగా ఉన్నాయని అన్నారు. విద్యార్థులు, టెక్నాలజీ యువ నిపుణుల్లో అన్వేషణపట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పేందుకు తమ సంస్థ నిర్వహించిన హ్యాకథాన్ అద్దం పడుతోందన్నారు.

ఎయిమ్స్‌కు బడ్జెట్‌లో నిధులివ్వండి

- కేంద్ర ఆర్థికమంత్రి జైట్లీకి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాలో ఏర్పాటు చేస్తున్న ఎయిమ్స్‌కు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఎంపీలు జితేందర్ రెడ్డి, సీతారాం నాయక్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నగేష్, ఢిల్లీలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, మంత్రి ఓఎస్డీ గంగాధర్ తాడూరిలతో కలిసి శుక్రవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి అరుణ్ జైట్లీ, కేంద్ర, ఆరోగ్య శాఖా మంత్రి జేపీ నడ్డాలను ఆయన కలిశారు. గత బడ్జెట్‌లో తెలంగాణాకు ఎయిమ్స్ కేటాయించిన నేపథ్యంలో ఈసారి ఎయిమ్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని లక్ష్మారెడ్డి కేంద్ర మంత్రులను కోరారు. తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ హెల్త్ హబ్‌గా మారినందున ఎయిమ్స్ అవసరాన్ని ఆయన కేంద్ర మంత్రుల దృషికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య శాఖ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించారని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కేంద్ర మంత్రుల్ని కలిసి ఏయిమ్స్ నిధులపై చర్చించామని లక్ష్మారెడ్డి విలేకరులకు తెలిపారు. ఎయిమ్స్ ఏర్పాటుకు కావాల్సిన స్థలం, ఇతర సదుపాయలను కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారికి వివరించారు. అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతి సుధన్‌తో సమావేశమైన లక్ష్మారెడ్డి, ఎయిమ్స్ నిర్మాణానికి సంబంధించి సత్వరమే నిర్ణయం తీసుకోవడంతో పాటు సాధ్యమైనంత త్వరగా నిధులను కేటాయించాలని కోరారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ, కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జె.పి నడ్డా ను రాష్ట్ర మంత్రి సి. లక్ష్మా రెడ్డితో పాటు పార్లమెంట్ సభ్యులు ఏపి జితేందర్‌రెడ్డి, నగేశ్, సీతారాంనాయక్, కొండా విశ్వేశ్వరరెడ్డి, ఢిల్లీలోని ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాల చారి, మంత్రి ఓ.ఎస్.డి, గంగాధర్ తాడురి తదితరులు పాల్గొన్నారు.

భగీరథకు బ్యాంకర్ల ప్రోత్సాహం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఇంటింటికి నల్లా నీటిని అందించాలన్న లక్ష్యంతో టీఆర్ఎస్ సర్కారు చేపట్టిన మిషన్ భగీరథ పథకానికి తమ వంతు సహకారం అందించి ప్రోత్సహించనున్నట్టు బ్యాంకర్లు వెల్లడించారు. శుక్రవారం వివిధ బ్యాంకుల అధికారులు కరీంనగర్ , సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించి మిషన్ భగీరథ పనులు పరిశీలించారు. కరీంనగర్ ఎల్ఎండీ దగ్గర నిర్మిస్తున్న రా వాటర్ వెల్ , ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు పరిశీంచారు. సిరిసిల్ల జిల్లాలో రుద్రవరం దగ్గర నిర్మిస్తున్న ఇంటెక్ వెల్‌తోపాటు అగ్రహారం నీటిశుద్ధి కేంద్రం, రామప్పగుట్ట జీఎబీఆర్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథ పనులు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. ప్రభుత్వం వేలకోట్లు అప్పు తెచ్చి మంచినీటిని అందిస్తోందని , నీటిని వృధాచేయకుండా వాడుకోవా లన్నారు. తాము ఇచ్చిన రుణానికి మిషన్ భగీరథ వంద శాతం న్యాయం చేస్తోందన్నారు. ఈ పర్యట నలో ఆంధ్రాబ్యాంక్ ఎప్ఎం మహ్మద్ తాహ్ సీన్, ఇండియన్ బ్యాంక్ ఏజీఎం ప్రభాకర్ రెడ్డి, అలహాబాద్ బ్యాంక్ ఏజీఎం డిఎస్ మూర్తి, పంజాబ్ సింధ్ బ్యాంక్ ఏజీఎం ప్రసాదరావు, మహారాష్ట్ర బ్యాంక్ సీజీఎం దేవానంద రెడ్డి, దేనా బ్యాంక్ మేనేజర్ అంకేశ్ సిండి కెట్ బ్యాంక్ సీజీఎం కృష్ణమాచారి, ఓరియంటల్ బ్యాంక్ మేనేజర్ అరుణ్ పండిట్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్‌ను రెగ్యులర్ చేస్తాం

- హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి
- గ్రంథాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి : స్వామిగౌడ్



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు త్వరలో మంచికబురు వింటారని, వారి ఉద్యోగాలను కూడా రెగ్యులరైజ్ చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర జిల్లా గ్రంథాలయాల సమితి (ఎన్జీఓ సెంట్రల్ ఫోరమ్) ఆధ్వర్యంలో సాగంటి అయోధ్య అధ్యక్షతన ఇందిరాప్రి యదర్శిని ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన సభలో నాయిని పాల్గొని మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం ఉద్యోగులతో ప్రేమతో మాట్లాడాలని తమకు సూచించారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం ముందు ఉందన్నారు. మొదటినుంచి ఉద్యోగుల పక్షపాతిగానే ఈ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇప్పటివరకు చాలా సమస్యలను పరిష్కరించామని, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి ఉద్యోగ సంఘాల నాయకులు సైతం సీఎంతో మాట్లాడాలని ఆయన సూచిం చారు. శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లా డుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల సంస్థ ఉద్యోగుల వేతనాలు 010 కింద అందడం లేదని దీనివల్ల వారు చాలా కోల్పో తున్నా రన్నారు. ఈ సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లడానికి తాను సిద్ధమన్నారు. కానీ తనతో పాటు మిగతా ఉద్యోగ సంఘాల నాయకులు వచ్చి సీఎంకు గ్రంథాలయాల ఉద్యోగుల సమ స్యను వివరిస్తే కచ్చితంగా అది పరిష్కార మవు తుందన్నారు. సీఎంకు చెప్పే విధంగా చెప్పక పోవడం వల్లే ఇన్ని రోజులుగా సమస్య పెండిం గ్‌లో ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా గ్రంథా లయాల చైర్మన్లకు కనీస వసతులు లేవని వాటి గురించి కూడా సీఎంతో చర్చిస్తానని స్వామిగౌడ్ హామీనిచ్చారు. టీఎన్జీఓ అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కా ర దిశగా అడుగులు వేస్తుందన్నారు. ఎలాంటి సమస్య అయి నా ప్రభుత్వంతో మాట్లాడడానికి తాను ముందుం టాన న్నారు. బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీ ప్రసాద్ రావు మాట్లా డుతూ గ్రంథాలయాల ఉద్యోగుల సమ స్యల పరిష్కారానికి తామం తా ముందుండి సీఎంతో మాట్లా డతా మన్నారు. ఈ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు తమ సమ స్యలను పరిష్క రించాలని అయోధ్య, కె.దేవేందర్ ఆధ్వ ర్యంలో మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాల యాల సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, అన్ని జిల్లాల చైర్మన్లు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ క్యాలండర్‌ను ఆవిష్కరించారు.

హైబ్రిడ్ విండ్ పాలసీ సిద్ధం

- మార్చిలో ఈ-వెహికిల్ విడుదల : అజయ్ మిశ్రా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధిని సాధించి రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి పథాన నడిపించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో హైబ్రిడ్ విండ్ పాలసీ ముసాయిదాను సిద్ధం చేసినట్టు రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా వెల్లడించారు. బ్రిటీష్ హైకమీసనర్ , స్వీడన్ కమర్శియల్ ఆఫ్ ఎంబసీ , తెలంగాణ ఇంధన శాఖ , పునరుద్ధరనీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఎలిట్స్ నేతృత్వంలో శుక్రవారం నేషనల్ పవర్ సమ్మిట్ జరిగింది. ఈ కర్యాక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న అజయ్ మిశ్రా మాట్లాడుతూ థర్మల్ సెక్టార్ రంగంలో ఇప్పటికే పదివేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని జత చేసామన్నారు. రాష్ట్రంలో హైబ్రిడ్ విండ్ పాలసీ ముసాయిదాను సిద్ధం చేసి ఉంచామని ప్రభుత్వం నుంచి ఆమోదం లభించగానే ప్రకటిస్తామన్నారు. పారిశ్రామిక , వ్యాపార వర్గాల నుంచి ఈ పాలసీపై ఫీడ్‌బ్యాక్ తీసుకుంటామన్నారు. మార్చిలో ఈ-వెహికిల్ పాలసీని విడుదల చేస్తామని మెల్లడించారు. రాష్ట్రంలో ప్రధాన రోడ్ల వెంట వాహనాలకు విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు కూడా నెలకొల్పనున్నట్టు తెలిపారు. తెలంగాణ ట్రాన్స్‌కో, జన్‌కో సంస్థల జేఎండీ శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ కొత్తల్లో రాష్ట్ర విద్యుత్ రంగం ఎన్నో సమస్యలు , సవాళ్లు ఎదుర్కొందన్నారు.

24నుంచి అడవుల్లో నీటివసతిపై సర్వే



హైదరాబాద్, ఆంధ్రప్రభ : అటవీ సంపదను, భూమిని ప్రతి అంగుళం కాపాడాలని, అందుకోసం శాఖ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని అటవీ శాఖ ఉన్నతాధి కారులు ఆదేశించారు. అటవీ భూమి రక్షణలో భాగంగా అన్ని రిజర్వు అటవీ భూముల చుట్టు కందకాలు తవ్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో రక్షిత అటవీ ప్రాంతానికి సుమారు 24 కిలో మీటర్ల సరిహద్దు పరిధి ఉందని, సాధ్యమైనం వరకు కందకాల తవ్వకం పూర్తి చేయాలన్నారు. అలాగే వన్యప్రాణులు అడవి దాటకుండా చూడడంతో పాటు, ఆక్రమణలను అడ్డుకోవాలన్నారు. శుక్రవారం అన్ని జిల్లా అటవీ అధికారులతో సచి వాలయం నుంచి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అడవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వన్య ప్రాణులకు నీటి వసతి, అగ్ని ప్రమాదాల నివారణపై సమీక్షించారు. ఈ నెల24 నుంచి 26 వరకు అడవుల్లో నీటి వనరుల లభ్యతపై సర్వే చేయనున్నట్లు అటవీ, సంరక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి పీకే.ఝూ ప్రకటించారు.

పురుషోత్తంరెడ్డిపై ఉచ్చు బిగిస్తున్న ఏసీబీ

- బినామీలతో రియల్ వ్యాపారం
- తప్పించుకునే దారులను మూసివేస్తున్న ఏసీబీ అధికారులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హెచ్ఎండిఎ అధికారి పురుషోత్తంరెడ్డి అవినీతి సంపాదన, కూడబెట్టిన వైనంపై ఎసిబి అధికారులు ఆశ్చర్యపోతున్నారు. అక్రమ సంపాదనపై ఎప్పటికైనా ఇబ్బందు లుంటాయని ముందుగానే పసిగట్టిన పురుషోత్తం రెడ్డి కుటుంబసభ్యులతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపా రులనూ బినామీలుగా పెట్టుకున్నాడు. సాధారణంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ తదితర శాఖల అనుమతుల కోసం కన్సల్టెంట్‌లను నియమించుకుంటారు. పురుషోత్తంరెడ్డి కన్సల్టెంట్లను దగ్గరకు రానివ్వకుండా తాను చెప్పిన వ్యక్తి ద్వారా వస్తేనే ఫైల్‌ను తీసుకునే వాడని తేలింది. కన్సల్టెంట్‌ల ద్వారా తనకు వచ్చే మామూళ్ళు ఎలాగూ వస్తాయి, కానీ వారికిచ్చే మొత్తాలు పోతాయన్నది పురుషోత్తంరెడ్డి ఆలోచన అని ఎసిబి అధికారులు గుర్తించారు. తన పేరిట, భార్య పేరిట సరిపోయేంత ఆస్తులను రిజిస్టర్ చేయించుకున్న సదరు అధికారి ఆ తర్వాత బావమరిది శ్రీని వాస్‌రెడ్డి, అత్త సుదేశ్నల పేరిట కొన్ని ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయిం చాడని గుర్తించిన ఎసిబి వాటిని సీజ్ చేసింది. అంతే కాకుండా ఆత్త, బావమరిది పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా ప్రారంభించాడని, నగర శివార్లలోని మంచిరేవుల ప్రాంతంలో అత్యంత ఖరీదైన విల్లాలను నిర్మించి విక్రయాలను ప్రారంభించారని ఎసిబి దర్యాప్తులో వెల్లడైంది. హెచ్ఎండిఎలో ఏ పని కావాలన్నా బావమరిది శ్రీనివాస్‌రెడ్డిని సంప్రదిస్తే జరిగిపోతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు పలువురు ఎసిబికి ఇచ్చిన ఫిర్యా దులో పేర్కొన్నారు. మాజీ ఎంఎల్ఎ ఒకరు మంచి రేవుల ప్రాంతంలో విల్లాల కోసం వెంచర్‌కు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విల్లాలకు వెళ్ళేందుకు దారి లేకపోవడంతో అనుమతి నిరాకరించిన పురుషోత్తంరెడ్డి తర్వాత సదరు వెంచర్‌ను తన అత్త పేరున బదలాయింపు చేసుకున్నాడని ఎసిబి గుర్తించింది. వెంచర్‌కు కావాల్సిన రహదారి కోసం స్థానిక రైతుపై బెదరింపులకు పాల్పడి సాధించుకున్నట్లు తేలింది. ఈ మొత్తం వ్యవహారంలో దాదాపు రూ. 10 కోట్లు చేతులు మారినట్లు ఎసిబి అధికారులు భావిస్తున్నారు. కొన్నిచోట్ల భూస్వాములనే బినామీలుగా పెట్టుకున్న పురుషోత్తంరెడ్డి వందల సంఖ్యలో ప్లాట్లను విక్రయించినట్లు ఎసిబి గుర్తించింది. పురపాలక శాఖలో విధులలో చేరినప్పటికీ ఎప్పుడూ అక్కడ పని చేయలేదని, పైరవీలు చేసుకుని హెచ్ ఎండిఎలోనే ఎక్కువ కాలం పని చేసినట్లు ఎసిబి తేల్చింది.

పురుషోత్తంరెడ్డిపై లుక్‌అవుట్ నోటీస్!

- ఇంటర్‌పోల్ అధికారులకు ఏసీబీ విజ్ఞప్తి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హెచ్ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి కేసు దర్యాప్తును ఏసీబీ అధికారులు వేగవంతం చేశారు. పురుషోత్తంరెడ్డి ఆచూకీ ఇంతవరకూ లభ్యం కాలేదు. దీంతో పురుషోత్తంరెడ్డి ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసును ఏసీబీ జారీ చేసింది. ఇదే సందర్భంలో పురుషోత్తంరెడ్డికి ఎవరూ ఆచూకీ ఇచ్చినా వారు శిక్షార్హులేనని ఏసీబీ హెచ్చరించింది. పురుషోత్తంరెడ్డి విదేశాలకు వెళ్లిపోయి వుండవచ్చని ఏసీబీ భావి స్తోంది. దీంతో, పురుషోత్తంరెడ్డి ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీ చేయా లని ఇంటర్‌పోల్ అధికారులను ఏసీబీ అభ్యర్థించింది. ఇదిలా ఉండగా, ఈ కేసులో ముగ్గురు బినామాలను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. పురుషోత్తంరెడ్డికి చెందిన రూ.30 కోట్ల విలువైన ఆస్తులను బినామీ యాదవ్‌రెడ్డి పేరిట బదిలీ చేసినట్లు ఏసీబీ గుర్తించిది. సాయి హరిహర రియల్ ఎస్టేట్ కంపెనీలో రూ.30 కోట్లు పురుషోత్తంరెడ్డి పెట్టుబడి పెట్టాడని, బావమరిది శ్రీనివాస్‌రెడ్డి ద్వారా నిధులు బదిలీ చేసినట్లు విచారణలో వెల్లడైందని అధికారులు తెలిపారు. అల్లుడు నిషాంత్‌రెడ్డికి చెందిన కంపెనీలోనూ మరో రూ.30 కోట్లు పెట్టుబడిని పురుషోత్తంరెడ్డి పెట్టినట్లుగా ఏసీబీ అధికారులు గుర్తించారు. యాదవ్‌రెడ్డి, నిషాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలను ఏసీబీ అధికారులు కోర్టులో హాజరుపర్చారు. మరోవైపు మంచిర్యాల రేవులో విల్లాల పేరుతో బిజినెస్ చేసి రూ.100 కోట్లు అక్రమార్జనకు పురుషోత్తంరెడ్డి యత్నించాడని తెలుస్తోంది.

శ్వేతపత్రంతో నిధుల నిగ్గు తేలాలి

(మొదటిపేజీ తరువాయి)

అనుభవిస్తున్నారు. కానీ నిధుల విడుదల విషయంలో మాత్రం బీజేపీ తమను మోసం చేసిందంటూ తెలుగుదేశం రోడ్డెక్కింది. అలాగని బీజేపీ తక్కువ తినలేదు. ఇప్పటికే ఇచ్చిన నిధుల విషయం పక్కనపెట్టి కొత్తగా ఘర్షణలకు దిగడం తగదంటూ ఆ పార్టీ వాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామిగా ఉంది. ఇక్కడా ఆ పార్టీకి ఇద్దరు మంత్రులు ఉన్నారు. ఈ రెండు పార్టీల మధ్య స్నేహం సహృద్భావాలు ఎక్కడికి పోలేదు. అవలాగే కొనసాగుతున్నాయి. కానీ నిధుల విషయానికి వచ్చేసరికి మాత్రం పరస్పర విరుద్ధ ప్రకటనలు ఇస్తున్నాయి.

వారం రోజులుగా లోక్‌సభ వాయిదాలకే పరిమితమైంది. గట్టిగా ఓ గంట కూడా సమావేశాలు నిర్విఘ్నంగా జరగలేదు. తెలుగుదేశం సభ్యులు నినాదాలతో పార్లమెంట్ ప్రతిధ్వనిస్తోంది. దేశం యావత్ ఈ వివాదాన్ని విస్మయంగా పరికిస్తోంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య నిధుల కేటాయింపు చట్టబద్ధమైన విధానంలోనే సాగుతుంది. ఇచ్చిన నిధులకు ఖచ్చితమైన ఆధారాలు, వివరాలు ఉంటాయి. ఇదేమీ దొంగచాటుగా జరిగే అవకాశంలేదు. కానీ ఇరుపక్షాలు తమ వాదనకే కట్టుబడి ఉన్నాయి. ఇందులో ఏది యదార్థమన్నది సగటు ప్రజలకు అంతుచిక్కడం లేదు. ఇంతవరకు కేంద్రం ఇచ్చినట్లు చెబుతున్న నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు చట్టబద్ధంగా పంపిణీ అయ్యే సాధారణ నిధులేనా.. ఇతర రాష్ట్రాలతో సమానంగానే జాతీయ రహదార్లు, పోర్టులు, రైల్వేలకు కేటాయించిన నిధులేనా.. లేక ఆంధ్రప్రదేశ్‌కు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ కింద అదనపు నిధులేవైనా ఇచ్చారా అన్న మీమాంశ తొలగడంలేదు. ఇప్పటికైనా విభజన హామీలు, ఎన్నికలకు ముందు మోడీ చేసిన ప్రకటనలు, గత నాలుగేళ్ళుగా ఆంధ్రప్రదేశ్‌కు విడుదల చేసిన నిధులపై శ్వేతపత్రం జారీ చేస్తే తప్ప ఈ వివాదంపై సాధారణ ప్రజల్లో స్పష్టత చేకూరదు. లేనిపక్షంలో ఇది తమ తమ రాజకీయ ప్రయోజనాల కోసమే ఇరుపక్షాలు చేస్తున్న ఆందోళనగానే జనం పరిగణిస్తారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితం



(మొదటిపేజీ తరువాయి)

పనిచేసే వైద్య అధికారులు, సిబ్బంది సేవలను మరింత ప్రభావవంతంగా వినియోగించుకునేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆయన ఆదేశించారు. ఆశ వర్కర్లకు మరోసారి జీతాలు పెంచనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రజారోగ్యం విషయంలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

వైద్య ఆరోగ్యశాఖపై సీఎం కేసీఆర్ శుక్రవారం ప్రగతి భవన్‌లో సమీక్షించారు. కాగా తాము ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో బోదకాల బాధితులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి పరిస్థితి దయనీయంగా ఉందని కోరుతూ ఇటీవలే మంత్రి తుమ్మలనాగేశ్వరరావు, నిజామాబాద్ ఎంపి కల్వకుంట్ల కవిత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించారు. ప్రభుత్వం వారికి అండగా నిలవాలని, సరైన వైద్యం అందించాలని, వ్యాధి ప్రబలకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులపై కూడా ఒత్తిడి తెచ్చారు. వారి చొరవతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. తెలంగాణ వ్యాప్తంగా బోదకాల బాధితుల సమగ్ర సర్వే నిర్వహించాలని, గ్రామాల్లో వారి వివరాలు తీసుకోవాలని సీఎంకేసీఆర్ ఆదేశించారు.

అందరికీ ఉచిత పరీక్షలు...

అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతీ ఒక్కరూ ఎప్పటికప్పుడు రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటారని, తెలంగాణ రాష్ట్రంలో కూడా ప్రతీ ఒక్కరికి అలాంటి ఆరోగ్య అవగాహన అలవాటు చేయించాలని సీఎం కేసీఆర్ చెప్పారు. అవగాహన ఉన్నవాళ్లు, స్థోమత కల్గినవాళ్లు పరీక్షలు చేయించుకుంటున్నారు, కానీ గ్రామీణ ప్రాంతాల్లో, మారుమూల ప్రాంతాల్లో ఉన్నవాళ్లు, ముఖ్యంగా పేదలు రోగమొచ్చినప్పుడు తప్ప ఆస్పత్రులకు వెళ్లరు. వైద్య పరీక్షలు చేయించుకోరు. దీనివల్ల వ్యాధులను ప్రాథమిక స్థాయిలో గుర్తించలేకపోతున్నారు. వ్యాధి మొదటి దశలోనే గుర్తిస్తే నయం చేయడం తేలిక అవుతుంది. ముదిరిన తర్వాత నయం చేయడం కష్టంతో కూడుకున్నది. బోదకాలు కూడా అలాంటిదే. ప్రారంభంలోనే గుర్తించక ఇబ్బంది అవుతోంది. చాలా రోగాల విషయాల్లో ఇలాగే జరుగుతోంది. ఇకపై అలా జరగడానికి వీలు లేదు. ప్రతీ గ్రామంలో ప్రతీ ఒక్కరికి ప్రభుత్వమే క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయిస్తుంది. రక్త నమూనాలు సేకరించి, అన్ని రకాల రోగ నిర్ధారక పరీక్షలు చేయించాలి. రోగం గుర్తించిన వెంటనే ప్రభుత్వ పరంగానే చికిత్స చేయించాలి. మందులు ఇవ్వాలి. దీనికి ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదు. పేద ప్రజల ఆరోగ్యం కాపాడటం కన్నా మించిన ప్రాధాన్యత ప్రభుత్వానికి ఏదీ లేదు. ముందస్తు పరీక్షలు చేయడంతోపాటు వివిధ రోగాలు ప్రబలకుండా ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు చేపట్టాలి అని ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్ప డిన తర్వాత ప్రభుత్వ వైద్యం తీరు మారింది. ప్రభుత్వ ఆస్పత్రులు కూడా ఎంతో మెరుగయ్యాయి. కేసీఆర్ కిట్స్ పథకం అద్భుతంగా అమలవుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్రం తీసుకున్న చర్యలను ప్రశంసించింది. వైద్య అధికారులు, సిబ్బంది తీరుపై సర్వత్రా సంతృప్తి, సంతోషం వ్యక్తమవుతున్నది. ఫలితంగా మలేరియా, డెంగ్యూ మరణాలు తగ్గాయి. ఈ ఒరవడి, స్ఫూర్తి కొనసాగాలి. గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదల ముంగిట్లోకే వైద్యం చేరాలి.

జిల్లాల వారీగా బోధకాల వ్యాధి బాధితుల వివరాలు

జిల్లా	బాధితులు
జగిత్యాల-	6463
సిద్దిపేట-	5199
సూర్యాపేట-	4587
కామారెడ్డి-	3342
ఖమ్మం-	2886
సిరిసిల్ల-	2350
జనగాం-	2189
కరీంనగర్-	1892
నిజామాబాద్-	1847
వికారాబాద్-	1823
వరంగల్ (రూరల్)-	1777
మహబూబాబాద్-	1682
నల్లగొండ-	1567
సంగారెడ్డి-	1464
యాదాద్రి-	1410
వరంగల్ అర్బన్-	1051
మెదక్-	1047
పెద్దపల్లి-	913
ఆదిలాబాద్-	673
మహబూబ్‌నగర్-	644
ఆసిఫాబాద్-	479
నిర్మల్-	292
మంచిర్యాల-	274
జయశంకర్-	174
కొత్తగూడెం-	142
నాగర్‌కర్నూల్-	112
మేడ్చల్-	71
రంగారెడ్డి-	55
గద్వాల్-	39
వనపర్తి-	32
హైదరాబాద్-	నిల్

స్థానికంగానే వారికి వైద్య సేవలు అందాలి. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పలువిధాలైన వైద్య అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారు. వారందరినీ సమన్వయం చేసుకుంటూ, గ్రామా ల్లో ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలి. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి అని ఆయన అభిప్రా యప డ్డారు. ఆశ వర్కర్లకు ఒకసారి జీతాలు పెంచాం...మరోసారి కూడా జీతాలు పెంచేందుకు సిద్దంగా ఉన్నాం...వర్కర్లను విలేజ్ హెల్త్ అసిస్టెంట్లుగా గుర్తిస్తాం...సెకండ్ ఏఎన్ఎంల జీతాలనూ పెంచుతాం...వారి సేవలను మరింతగా వినియోగించుకుంటాం..పిహెచ్‌సీలలో సౌకర్యాలు పెంచి తెలంగాణ రాష్ట్రం ప్రజారోగ్యం విషయంలో దేశానికి దారి చూపేలా తయారు కావాలన్నది లక్ష్యం అని ఆయన తన మనోగతాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు. కేసీఆర్ కిట్స్ పథకం అద్భుతంగా అమలవుతున్నది...పేదలకు ఎంతో మేలు కలుఉతున్నది. అనవసర ఆపేరేషన్లు కోతలు తగ్గాయి. అదనపు భారం పడినా సరే వైద్యులు, సిబ్బంది ఓపికగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ఇన్సెంటివ్ ఇస్తాం..ప్రైవేటు ఆస్పత్రులకు కూడా కేసీఆర్ కిట్స్ పథకం వర్తింపజేయాలని వినతులు వస్తున్నాయి. కానీ ప్రభుత్వం అందుకు సిద్దంగా లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సౌకర్యాలు, సిబ్బందిని పెంచుతాం. ప్రభుత్వ ఆస్పత్రులను బాగు చేసుకుంటాం తప్ప, ప్రైవేటు ఆస్పత్రులకు ఈ పథకం వర్తింపజేసే ఆలోచన ప్రభుత్వానికి లేదు అని ఆయన నిర్మోహమాటంగా తేల్చి చెప్పారు.

స్టార్టప్ నుంచి రియల్ ఎస్టేట్ వరకు

ట్రెండ్ సెట్టర్



(మొదటిపేజీ తరువాయి)

లభించినట్లుగానే భావించే విధంగా నిబంధనలు తీసుకొచ్చామన్నారు. సదరు అధికారికి రోజుకు వెయ్యి రూపాయల చొప్పున పెనాల్టీ విధిస్తున్నామన్నారు. ఇలాంటి విధానం దేశంలో ఎక్కడా లేదన్నారు. చివరకు గుజరాత్‌లో ఇలాంటి నిబంధనలు లేవని కేటీఆర్ గుర్తు చేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు.

హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే ప్రతి అంతర్జాతీయ సదస్సు విజయవంతం అవుతోందని, యూత్‌కాన్-2018 కూడా సక్సెస్ అవుతుందని కేటీఆర్ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి ఈ సదస్సు దోహదపడాలని ఆకాంక్షించారు. భారత దేశంలో యువశక్తి ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం దేశాన్ని యువత శాసిస్తోందన్నారు. రియాల్టీ రంగాన్ని కేంద్రం మరింత ప్రొత్సహించాలన్నారు. ముఖ్యంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే రియల్ ఎస్టేట్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అన్ని రంగాల్లో ఎత్తు.. పల్లాలు ఉన్నట్లే బిల్డింగ్ రంగంలోనూ ఉన్నాయన్నారు. అలాంటి సమస్యలను అధిగమించేందుకు క్రెడాయ్ ప్రతినిధులంతా పరస్పరం సహకరించుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మాత్రం రియల్ ఎస్టేట్ రంగానికి ఏమాత్రం ప్రాధాన్యత తగ్గకపోగా... రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందన్నారు. రాజకీయ రంగమైనా, సినిమా రంగమైనా, వ్యాపార రంగమైనా సరే... వారసత్వం అన్నది కొంతవరకే ఉపయోగపడుతుందని కేటీఆర్ అన్నారు. ఎంచుకున్న రంగంలో నిత్యం ప్రజలతో మమేకమై ఉన్నప్పుడే భవిష్యత్తు సాఫీగా ఉంటుందన్నారు. రాజకీయ రంగానికి ఇది మరింత అవసరమన్నారు. ముఖ్యంగా అధికారంలో ఉన్న రాజకీయ నేతలు ఏ మాత్రం తప్పులు చేసినా ఐదేళ్ళ తరువాత ప్రజల మార్పు కోరుకుంటారన్నారు. అందుకే ప్రజల పక్షాన నిలబడేందుకు అధికార పక్షం నిత్యం పరితపిస్తుందన్నారు.

అంతకుముందు కాంగ్రెస్ పార్టీ యువనేత సచిన్ పైలెట్ మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థకు భవన నిర్మాణ రంగం వెన్నెముకగా నిలవాలన్నారు. దేశంలో పెద్దఎత్తున మార్పులు సంభవిస్తున్నాయని.... వాటికి అనుగుణంగా అనేక సవాళ్లు కూడా ఉత్పన్నం అవుతున్నాయన్నారు. యువతకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించే విధంగా క్రెడాయ్ సంస్థ ఎదగాలన్నారు. బిల్డర్లపై ప్రజల్లో ఒకరకమైన అభిప్రాయం ఉందని... దానిని తొలగించుకునేందుకు యత్నించాలని సూచించారు. ఏ రంగంలో ఉన్నాసరే.... నిబద్ధతతో పనిచేయాలన్నారు. అప్పుడే ప్రజల మన్ననలు పొందగలుగుతామన్నారు. దేశంలో సుమారు 300 రాజకీయ పార్టీలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో పార్టీల మధ్య... నాయకుల మధ్య ఆలోచనల్లో అనేక వ్యత్యాసాలు, రాజకీయ విభేదాలు ఉంటాయన్నారు. అయితే ఇవి ఎన్ని ఉన్నా.... అందరి అంతిమ లక్ష్యం దేశాభివృద్ధికి దోహదపడే విధంగా ఉండాలన్నారు. తాను ఎంపీగా ఉన్న నాలుగు సంవత్సరాల్లో ఏ రోజు కూడా ఇతర నాయకులను టార్గెట్‌గా చేసుకుని మాట్లాడిన సందర్భాలు లేవన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వేధించిన దాఖలాలు లేవన్నారు. కానీ ప్రస్తుతం రాజకీయాల్లో అణిచివేసే దోరణి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీకీ వ్యతిరేకంగా గొంతు వినిపిస్తే... సీబీఐ దాడులు, ఈడీ అధికారులతో దాడులు చేయిస్తోందన్నారు. ఇది ప్రజాస్వామ్యానికే చేటని వ్యాఖ్యానించారు.

మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగం పరిస్థితి స్టాక్ మార్కెట్ వలే తయారైందన్నారు. ఎప్పుడు పైకి వస్తుతుందో... ఎప్పుడు తగ్గుతోందో తెలియని విధంగా నిర్మాణరంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నదన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి క్రెడాయ్ ప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థకు చెందిన జాతీయ రాష్ట్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రపతితో కేటీఆర్ భేటీ

- ప్రపంచ ఐటీ కాంగ్రెస్ సదస్సుకు ఆహ్వానం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్ -2018 సదస్సు ముగింపు సభకు రావాలని రాష్ట్ర ఐటీ, పంచాయతీ రాజ్ శాఖల మంత్రి కె. తారకరామారావు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానించారు. రెండు రోజుల ఢిల్లీ చేపట్టిన ఆయన గురువారం పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. శుక్రవారం ఉదయం రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రధానమంత్రి వీడియో లింక్ ద్వారా ప్రారంభించినున్న వరల్డ్ ఐటీ కాంగ్రెస్ సదస్సు రావాల్సిందిగా ఆయనను కేటీఆర్ కోరారు. ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 150 మందికి పైగా పారిశ్రామిక వేత్తలు హాజరుకానున్నారు. 30 దేశాల నుంచి ఆహ్వానితులు రానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశం 50 సేషన్లలో నిర్వహించనున్నట్టు కేటీఆర్ రామ్‌నాథ్ కోవింద్‌కు వివరించారు.

తెరాస పల్లె నిద్ర

(మొదటిపేజీ తరువాయి)


ప్రకటిస్తున్నట్లు తెలుస్తోంది. రైతుకు పెట్టుబడి పథకం, పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ కూడా ఈ మధ్యలోనే జరగనుంది.

హైదరాబాద్‌లో పార్టీ ప్లీనరీ..

హైదరాబాద్‌లోనే పార్టీ ప్లీనరీ నిర్వహించాలని టిఆర్ఎస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. గత ఏడాది కొంపల్లిలో ప్లీనరీ నిర్వహించగా, ఈ సారి కొంపల్లిలో నిర్వహిస్తారా.. లేక సిటీలో నిర్వహిస్తారా అన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే పార్టీ ఆవిర్భావ వేడుక సందర్భంగా ఈసారి బహిరంగసభ నిర్వహించే అవకాశం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. రైతుసభతో పాటు పలు కార్యక్రమాలను, సభలను నిర్వహించబోతున్నందున బహిరంగసభ జోలికి వెళ్లడం లేదని తెలిసింది.

సోషల్ మీడియాలో..

మిలియన్ క్లబ్‌లో కేటీఆర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ఐటిశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఏ కార్యక్రమం చేపట్టినా విలక్షణంగానే ఉంటుంది. మంత్రిగా వివిధ శాఖలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై స్పందించడంలో కూడా ఆయన విశిష్టశైలి అవలంబిస్తుంటారు. ప్రతి అంశాన్ని కూలంకషంగా పరిశీలించి దానిపై సరైన తన అభిప్రాయం ప్రకటించడంలో ఆయన విశిష్టతను చాటుకుంటున్నారు. సోషల్ మీడియా ద్వారా అనేక అంశాల్లో తన అభిప్రాయాలు పాలుపంచుకుంటూ మిలియన్ క్లబ్‌లో చేరారు. దేశ రాజకీయాల్లో సోషల్ మీడియా క్లబ్‌లో చేరిన వారిలో కేటీఆర్ కూడా ఒకరిగా నిలిచారు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే కేటీఆర్ శుక్రవారం మిలియన్ జాబితాలో చేరారు. ప్రస్తుతం కేటీఆర్ ట్విట్టర్ ఖాతాను అనుసరిస్తున్న వారి సంఖ్య పదిలక్షలు దాటింది. తన కార్యక్రమాలు, పర్యటనలకు సంబంధించిన వివరాలతో పాటు ప్రభుత్వానికి సంబంధించిన పథకాలు, వాటి ప్రభావం తదితర విషయాలను కేటీఆర్ ఎప్పటికప్పుడు ట్విట్టర్ పంచుకుంటూ ఉంటారు. పలు సందర్భాల్లో వినతులు, ఫిర్యాదులను ట్విట్టర్ వేదిక ద్వారానే నెటిజన్లు ఆయన దృష్టికి తెస్తున్నారు. అనారోగ్యంతో ఉన్నవారు, ప్రభుత్వ సహాయం కోరేవారు ట్విట్టర్‌లో పొందుపరచడం, వాటిపై కేటీఆర్ స్పందించి ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తున్నారు. తనను అనుసరిస్తున్న వారి సంఖ్య 10 లక్షలకు చేరిన సందర్భంగా 'లెటజ్ స్టే కనెక్టెడ్' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

టీఆర్ఎస్ మెగా సర్వే

- ప్రతి నియోజకవర్గానికి 3వేల శాంపిల్స్
- నెలాఖరులో ఎమ్మెల్యేలకు జాబితాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సర్వేలతో పార్టీ ఎమ్మెల్యేలలో జోష్ నింపుతున్న ముఖ్యమంత్రి కెసిఆర్.. టిఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యేల తాజా స్థితిపై మూడు వేర్వేరు ఏజెన్సీల ద్వారా సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు సర్వే ఏజెన్సీల నివేదికలు అందగా, మరో ఏజెన్సీ సర్వే నివేదిక మూడు, నాలుగు రోజుల్లో అందుతుందని పార్టీవర్గాలు తెలిపాయి. సర్వేల వివరాలను నియోజకవర్గాల వారీగా ముఖ్యమంత్రి కెసిఆర్ స్వయంగా ఎమ్మెల్యేలకు అందజేయనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి 3వేల శాంపిల్స్‌ను సేకరిస్తుండగా.. గతానికి భిన్నంగా అన్నిమండలాల్లో పని స్థలాల వద్దకు, ఇళ్లవద్దకు వెళ్ళి వివరాలు సేకరిస్తున్నట్లు పార్టీ నేత ఒకరు తెలిపారు. మీ నియోజకవర్గంలో టిఆర్ఎస్ పనితీరు ఎలా ఉంది? వచ్చే ఎన్నికల్లో ఎవరికి ఓటేస్తారు? మీ స్థానిక ఎమ్మెల్యే పనితీరు ఎలా ఉంది? ఈ పథకం వల్ల మీకు మేలు జరిగిందా అంటూ పది ప్రభుత్వ పథకాలపై అభిప్రాయం కూడా సర్వేలలో తీసుకుంటున్నారు.. ఎంఐఎం ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లోనూ సర్వే జరిగిందని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి ఆంధ్రప్రభకు తెలిపారు. తొలిసర్వేలో 103, రెండో సర్వేలో 105స్థానాలు టిఆర్ఎస్‌కు లభిస్తాయని సర్వే నివేదిక వెల్లడించిందన్నారు. బిజెపికి మొదటిసర్వేలో ఒక స్థానం, రెండో సర్వేలో ఒక్క సీటు కూడా రాదని తేలిందన్నారు. కాంగ్రెస్‌కు తమ సర్వే ప్రకారం 6నుండి 8స్థానాలు వస్తున్నాయని టిఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. మిగతా పార్టీల ఉనికి లేదని పేర్కొంటున్నారు.

ఏప్రిల్ 1నుంచి 'పెట్టుబడి రాయితీ'

- మార్చి 11న పట్టాపాస్‌పుస్తకాల పంపిణీ : అగ్రిటెక్ సౌత్ సదస్సులో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతులకు ఎకరాకు రూ.4 వేలు పెట్టుబడి రాయితీ పథకం కింద ఏప్రిల్ 1 నుంచి మే 15వ తేదీవరకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. రైతుల జీవో అకౌంట్స్‌లో ఏ బ్యాంకులోనైనా ఆ డబ్బును డిపాజిట్ చేస్తామని ఆయన చెప్పారు. 40 రోజులపాటు అన్ని గ్రామాలు తిరిగి రూ.4వేలు రైతు ఖాతాల్లో వేసే కార్యక్రమం విస్తృతంగా చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. రూ.4వేల ప్రోత్సాహానికి ప్రభుత్వానికి రూ.6వేలు ఖర్చవుతుందని ఆయన తెలిపారు. సిఐఐ దక్షిణాది రీజియన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అగ్రిటెక్ సౌత్ సదస్సును శుక్రవారం ఆయన ప్రారం భించారు. ఈ సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ పనిముట్లు, పురుగు మందులు, ఎరు వులు, సేద్యపు కిట్స్ తదితర ఉత్పత్తులకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. ఈసదస్సులో దాదాపు మూడువేల మంది రైతులు ఈ స్టాల్స్‌ను సందర్శించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రుణాలపై ఆధార పడకుండా సొంత నిధులతో సేద్యం చేసిన రోజే రైతులకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని అన్నారు. రాష్ట్రంలో కోటి ఎకరాలను సేద్యంలోకి తెచ్చి రెండు పంటలకు సమృద్ధిగా సాగు నీరు అందించేందుకు ప్రభుత్వం భారీగా ప్రాజెక్టులను చేపడుతోందని ఆయన చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి 11న 72 లక్షల మంది రైతులకు పట్టాపాసు పుస్తకాలు అందజేయనుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 4 లక్షల టన్నుల ధాన్యం నిల్వల గోదాములు ఉన్నాయని, దీన్ని 18 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యానికి పెంచుతున్నామని చెప్పారు. రైతులకు అత్యధికంగా సబ్సిడీ ఇవ్వడంలో దేశంలోనే తెలం గాణ అగ్రస్థానంలో నిలువనుందని ఆయన చెప్పారు. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ప్రవీణ్‌రావు మాట్లాడుతూ, తమ విశ్వవిద్యాలయం 13 కొత్త వంగడాలను అభివృద్ధి చేసిందని, వీటిని రైతాంగం సద్వినియోగం చేసుకుంటోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 450 మంది వ్యవ సాయ విస్తరణ అధికారులకు శిక్షణ ఇచ్చి వ్యవసాయ క్షేత్రాలను రైతు ప్రదర్శనలకు అందుబాటులోకి ఉంచుతున్నామని ఆయన చెప్పారు. సిఐఐ జలవ నరుల జాతీయ కమిటీ చైర్మన్ రమేష్ దాట్ల మాట్లాడుతూ, 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడగా, జాతీయ సంపదలో 18 శాతం ఈ రంగం నుంచే వస్తుందన్నారు. రైతు ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఎంతో ఉందని, పంటలకు అదనపు విలువలు అందేలా ఫుడ్ ప్రాసెసింగ్ పెంచాలని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ రంగంలో పరిశోధనలు, యాంత్రీకరణ మరింత విస్తరించాలని, అధిక దిగుబడి వంగడాలను రూపొందించాలని అగ్రిటెక్ సౌత్ చైర్మన్ అనిల్ ఏపూర్ చెప్పారు. పంటల రవాణాకు మౌలిక సదుపాయాలు, రవాణా అభి వృద్ధిపై దృష్టి సారించాలని రోడ్లు, నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తుల శీతలీకరణ, పంట నూర్పిడి తర్వాత ప్రాసెసింగ్ లేనందున పెద్దఎత్తున నష్టపోతున్నారని అనిల్ చెప్పారు.

పట్టాదార్ పాస్‌బుక్

రైతు ఫొటో ఒక్కటే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎట్టకేలకు పట్టాదార్ పాస్ పుస్తకాలపై ప్రభుత్వం అంచనాకు వచ్చింది. టెండర్లకు బిడ్స్ రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ మింట్‌కు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు శుక్రవారం సీఎం కేసీఆర్ కొత్త పాస్ పుస్తకాల డిజైన్లను, రంగును ఖరారు చేశారు. ఆకుపచ్చ రంగులో పాస్ పుస్తకాల ముద్రణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రెండో పేజీలో రైతు ఫోటోను పాస్ పుస్తకంలో అంటించాలని నిర్ణయించారు. అయితే పాస్ పుస్తకాలపై తన ఫోటోను ముద్రించవద్దని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఇవ్వనున్న పాస్ పుస్తకాల డిజైన్లు, రంగులపై ప్రగతి భవన్‌లో సమీక్షించారు. పచ్చని పంటలకు గుర్తుగా ముదురు ఆకుపచ్చరంగులో పాస్ పుస్తకాలను ముద్రించాలని నిర్ణయంతీసుకున్నారు. అయితే పాస్ పుస్తకంలో ముఖ్యమంత్రి ఫోటో ఉన్న నమూనాను కూడా అధికారులు ఆయనకు సూచించారు. దీనిపై స్పందించిన ఆయన పాస్ పుస్తకంపై రైతు ఫోటో తప్ప మరెవ్వరి ఫోటో వద్దు. రాజకీయ నాయకుల ఫోటోలు అవసరం లేదు. కూవలం రైతు ఫోటో, తెలంగాణ ప్రభుత్వ ముద్ర మాత్రమే పాస్ పుస్తకంపైఉండాలి అని స్పష్టంగా తేల్చి చెప్పారు.

పాస్ పుస్తకాల ముద్రణకు ఇచ్చిన టెండర్ గడువును మూడు దఫాలుగా పొడిగించారు. పెద్దగా స్పందన రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మింట్‌కు ఈ బాధ్యతలు కట్టబెట్టాలని నిర్ణయించారు. మార్చి 11 నాటికి రాష్ట్రమంతటా ఏకకాలంలో 71 లక్షల పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. వారం రోజులకు ముందే పనులు పూర్తికావాలని సీఎం కేసీఆర్ ఇదివరకే ఆదేశించారు. ప్రస్తుత డిజైన్‌తో సుళువుగా ముద్రించి 21 రోజుల్లో పనిపూర్తిచేసేలా ప్రభుత్వం పరిశీలన చేస్తోంది. మొత్తం 23 కీలక, కఠినమైన భద్రతా ప్రమాణాలను సూచించింది. ప్రింటింగ్‌లో నాణ్యత పర్యవేక్షణకు హైదరాబాద్‌లోనే ప్రింటింగ్ చేయనున్నారు.

కాళేశ్వరం వందరెట్లు అద్భుతం

- ఇరిగేషన్ శాఖ బ్రాండ్ అంబాసిడర్ నెహాల్
- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నేపల్లి పంపుహౌస్ సందర్శన



మహదేవ్‌పూర్, ప్రభన్యూస్ : నేను ఊహించిన దానికంటే కాళేశ్వరం ప్రాజెక్టు వంద రెట్లు అద్భుతంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ బ్రాండ్ అంబాసిడర్ నేహాల్ అన్నారు. శుక్రవారం కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ అన్నారం బ్యారేజి, కన్నెపల్లి పంపు హౌస్‌లను సందర్శించారు. డీఇ ప్రకాష్ ప్రాజెక్టు పురోగతిపై వివరించారు. ప్రాజెక్టు పనులను చూసి నేహాల్ ఆశ్చర్యపోయారు. నేహాల్ ప్రాజెక్టు గురించి చెప్తుంటే ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులే అవాక్కయ్యారు. నేను వివరించిన ప్రాజెక్టు పనులు ఇంత అద్భుతంగా నిర్మాణం జరుగుతుందా అంటూ ఆశ్చర్యపోయారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల నెరవేని తరువాత మళ్లీ ఈ ప్రాజెక్టును కేసీఆర్ తాతాతో కలిసి సందర్శిస్తానని అన్నారు. నేహాల్ తల్లి రజినీ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ఇంత అద్భుతంగా ఉంటుందని కలలో కూడా ఊహించలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి టీవీ చానెల్ డిబైటు వస్తుంటే మా అబ్బాయి తరుచూ నన్ను అడుగుతుండే వాడు కాళేశ్వరం ప్రాజెక్టు గురించి తెలుసుకోవడానికి నేను చాల ప్రయత్నం చేశాను. గోగుల్ సెర్చ్ పత్రికలలో వచ్చిన వార్తల ద్వారా తెలుసుకున్నాను. మా అబ్బాయిని ఇరిగేషన్ శాఖ బ్రాండ్ అంబాసిడర్ గా నియమించటం ఇంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు.

దక్షణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఇరిగేషన్ శాఖ బ్రాండ్ అంబాసిడర్ నిహాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రివేణి సంగమగోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, గోదావరి మాతకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం స్వామి ఆలయానికి చేరుకొని ఆలయ మర్యాదలతో అర్చకులు వారికి స్వాగతం పలికారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
శనివారం 10 ఫిబ్రవరి 2018

సరిహద్దు తెగని కాల్పులు

కాశ్మీర్‌ను అడ్డుపెట్టుకుని దాయాది పాకిస్తాన్ తరచూ కయ్యానికి కాలుదువ్వుతోంది. కాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమన్న వాస్తవాన్ని ఆ రాష్ట్రానికి చెందిన నాయకులు పదేపదే స్పష్టం చేస్తున్నా, కాశ్మీర్‌లో మానవ హక్కుల హననం జరుగుతోందంటూ పాక్ నాయకులు గోబెల్స్ ప్రచారానికి ఒడిగడుతున్నారు. సార్క్ వంటి ప్రాంతీయ వేదికలపైనే కాకుండా, ఐక్యరాజ్యసమితిలో కూడా ఈ అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నారు. పొరుగుదేశంతో వైరం మంచిది కాదన్న ఉద్దేశంతో, ఈ సమస్యపై మన దేశం సంయమనాన్ని పాటిస్తోంది. పాక్‌తో చర్చలకు భారత్ ఎప్పటికప్పుడుసిద్ధమవుతున్నా, అసలు సమస్యను వదిలేసి కొసరు పట్టుకుని వేళ్లాడినట్టు కాశ్మీర్‌లో మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తున్నారు. హిజ్‌బుల్ నాయకుడు బుర్హాన్ వనీ ఎన్‌కౌంటర్ తర్వాత ఈ అసత్య ప్రచారాన్ని ఉధృతం చేసింది. నిజానికి బుర్హాన్ వనీ పాక్ ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తోయిబాకు ఏజెంట్‌గా పని చేస్తూ యువకులకు సాయుధ శిక్షణ ఇచ్చేవాడు. పౌరులపైకి ఉగ్రవాదుల్ని ఉసిగొల్పేవాడు. రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించే క్రమంలోనే బుర్హాన్ వనీని ఎన్‌కౌంటర్ చేశారు. అతడిని ప్రాణాలతో పట్టుకోవడానికి భద్రతాదళాలు తీవ్రంగా ప్రయత్నించాయి. భద్రతా దళాల వైపు కూడ ప్రాణనష్టం సంభవించింది. వాస్తవం ఇదైతే పాక్ ప్రతిసారీ అబద్ధాలను వల్లిస్తూ, బుర్హాన్ వనీని కాశ్మీర్ స్వాతంత్ర్యయోధునిగా, అమరజీవిగా కీర్తిస్తూ భారత్‌పై బురద జల్లుతోంది. 2003లో ప్రధానులు వాజ్‌పేయి, నవాజ్ షరీఫ్ కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఒక్కరోజు కూడా పాక్ గౌరవించలేదు. ఈ మధ్య కాలంలో ఆ ఒప్పందాన్ని నిరవధికంగా ఉల్లంఘిస్తోంది. ఈ నేపథ్యంలోనే పాకిస్తాన్‌కి ఇక మాటల్లో కాకుండా చేతల్లోనే తగిన సమాధానమివ్వాలంటూ మన దేశం ఘాటైన హెచ్చరిక చేసింది. ఏదేలా ఉన్నా సరిహద్దుల్లో కాల్పులు ఆగడం లేదు.



హర్షవాక్కు

-వేటూరి శ్రీహర్ష(న్యూఢిల్లీ)

స్వాతంత్ర్యంవచ్చిన నాటి నుంచి రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. భారత్‌లో అశాంతికి కారణం అవుతూనే ఉంది.కాశ్మీర్ లోయలోనూ, వాస్తవాధీన రేఖ పొడవునా పెరుగుతున్న హింస ఆందోళన కలిగిస్తున్నది.గత నెలారంభం నుంచి వాస్తవాధీన రేఖ వద్ద ఆవలి వైపు నుంచి పాక్ సైనికులు ఒక్క రోజు కూడా విరామం లేకుండా కాల్పులు జరుపుతూనే ఉన్నారు. కాల్పుల విరమణపై 2003లో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని పాకిస్తాన్ ఏ ఒక్క రోజూ గౌరవించలేదు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అనుసరిస్తున్న అణచివేత విధానం వల్ల పరిస్థితిమరింత క్షీణించింది. సరిహద్దులలో ఇరుదేశాల దళాలూ హోరాహోరీగా జరుపుతున్న ఎదురెదురు కాల్పుల్లో భారత సైనికులు ఎంత మంది మరణించారో ప్రకటించేందుకు భారత్ ఎన్నడూ వెనుకాడలేదు. అలాంటి సమాచారాన్ని పాకిస్తాన్ మొదటి నుంచి దాస్తూనే ఉంది.సరిహద్దుల్లో పరిస్థితిఅంతా బాగానే ఉందని ప్రజలను నమ్మించడమే ముఖ్యోద్దేశ్యం కావచ్చు. పూర్వపు యూపీఏ ప్రభుత్వం అనుసరించిన మెతక వైఖరి వల్ల కాశ్మీర్‌లోనూ, సరిహద్దుల్లోనూ ఉగ్రవాదులు చెలరేగిపోవడం మొదలు పెట్టారు. కాశ్మీర్‌లో బుర్హాన్ వనీ అనే హిజ్ బుల్ కమాండర్ ఎదురు కాల్పుల్లో మరణించడంతో లోయలోని యువకులంతా అతడిని ఆదర్శంగా తీసుకుని ఉగ్రవాద మార్గం పట్టారు.అతడి ఎన్‌కౌంటర్‌కి నిరసనగా శ్రీనగర్‌లోనూ, కాశ్మీర్ లోయలోనూ జరిగిన ఆందోళనలు హింసకు దారి తీశాయి. యువకులే కాదు, స్థానికులు కూడా ఉగ్రవాదానికి ఊతం ఇచ్చారు.

విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి కన్వల్ సిబాల్ పేర్కొన్నట్టు పాకిస్తాన్ ఈ రోజు వరకూ కూడా 2016 సెప్టెంబర్‌లో భారత సైనికులు మెరుపుదాడులు చేశారన్న విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడం లేదు. సరిహద్దుల్లోనే కాకుండా, రాష్ట్ర రాజధానిలోనూ ఉగ్రవాదులు చెలరేగుతూనే ఉన్నారు. ఇందుకు మంగళ వారం నాటి సంఘటనే నిదర్శనం. ఎంతో కట్టుదిట్టమైన బందోబస్తు ఉన్న ఆస్పత్రి నుంచి లష్కర్ ఎ తోయిబాకి చెందిన హమీద్ అనే ఉగ్రవాదిని తప్పించేందుకు ఆ సంస్థ సభ్యులు పోలీసు బృందంపై పొంచి ఉండి దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులు మరణించారు.ఈ ఘటన నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని సమీక్ష చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనిపిస్తోంది. పదిహేను సంవత్సరాల క్రితం ఇస్లామాబాద్‌లో జరిగిన సార్క్ సమావేశాల సందర్భంగా అంతర్జాతీయ సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందం ఇరుదేశాల మధ్య కుదిరింది.అయితే, ఈ ఒప్పందాన్ని పాకిస్తాన్ ఈరోజుకీ గౌరవించడం లేదు. జనవరిలో పాక్ సైనికులు ఆవలి వైపు నుంచి యధేచ్ఛగా కాల్పులు జరుపుతూనే ఉన్నారు. పాక్ సైనికుల కాల్పుల్లో 11మంది భారత జవాన్లు ఇటీవల ప్రాణాలు కోల్పోయారు.రాజౌరీ జిల్లాలో ఇరు దేశాలసైనికుల మధ్య తాజాగా జరిగిన కాల్పుల్లో నలుగురు భారత జవాన్లు మరణించారు.వీరిలో ఒక కెప్టెన్ కూడా ఉన్నారు. మన దళాలు పాక్ సైనికుల కాల్పులను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నారంటూ సైనికదళాల ప్రధానాధికారి జనరల్ బిపిన్ రావత్ ప్రకటించారు. పాక్‌సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని మన దళాలు కాల్పులకు దిగుతున్నాయని అన్నారు.

వాస్తవాధీన రేఖ వద్ద మన సైనికుల మరణాలు పెరగడం అక్కడి పరిస్థితి తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఒక్క జనవరి నెలలోనే ఏడుగురు భారత సైనికులు మరణించారు. ఒక్క జూలైలోనే భారత సైనికులు 8మంది మరణించారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితా ప్రకారం 2017 ఆరు మాసాల్లో 29 మంది భారత సైనికులు మరణించారు. గత సంవత్సరంఇదే కాలంలో కన్నా బాగా ఎక్కువ. 2017లో 860 చొరబాటు సంఘటనలు జరిగినట్టు ప్రభుత్వం పేర్కొంది. 2016లో జరిగిన చొరబాట్లు 221 మాత్రమే.

వాస్తవా ధీన రేఖ 776 కిలో మీటర్ల పొడవునా పర్వతాలు, గుట్టలు ఉన్నాయి. అయినప్పటికీ, మన సైనికులు కంటిపై రెప్ప వాలకుండా గస్తీ కాస్తూనే ఉన్నారు. పాకిస్తాన్ సైన్యం అత్యంత ఆధునికమైన ఆయుధాలు ఉపయోగిస్తోంది. పాక్ ఆయుధాల్లో 80 ఎంఎం మోటార్లు కూడా ఉన్నాయి. రాజౌరీ జిల్లాలోని నౌషారా సెక్టార్‌లో జనావాస ప్రాంతాలపై కూడా పాక్‌సైన్యం కాల్పులు జరుపుతోంది. సరిహద్దు గ్రామాల ప్రజలు కంటిపై కునుకు లేకుండా గడుపుతున్నారు. కేంద్ర హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాక్ భారత్‌తో స్నేహపూరితంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.అదే సందర్భంలో భారత్-పాకిస్తాన్ సరిహద్దులలో ఫెన్సింగ్ నిర్మాణం చురుకుగా సాగుతోందని ప్రకటించారు.

జమ్మూ-కాశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో ఉన్న డజనుకు పైగా గ్రామాలపై ఈ జనవరిలో మోర్టార్లతో దాడి చేశారు. మొత్తం 300 మోర్టార్ షెల్స్ ఈ గ్రామాల్లో పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. మంగళవారం తెల్లవారుఝామునుంచి సరిహద్దుల్లోని ప్రజల్లో భయం గూడు కట్టుకుంది. హిజ్‌బుల్ ముజాహిదీన్‌కు చెందిన బుర్హాన్ వాణిని 2016 జూలై 8న ఎన్‌కౌంటర్ చేసిన దగ్గర్నుంచి తీవ్రవాద కార్యక్రమాల్లో స్థానికులు పాల్గొనడం ఎక్కువైంది. ఈ ప్రాంతంలోని రైతులు సైతం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. వారు కనీసం తమ పొలాలకు వెళ్ళలేకపోతున్నారు. సరిహద్దుల్లో కాల్పులు దీనికి ప్రధాన కారణం. గడిచిన మూడు సంవత్సరాలలో 280మందికి పైగా యువకులు జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులతో చేతులు కలిపారు. పిడిపి-బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కండబలం వ్యూహం ఫలితాన్నిస్తున్నట్లే కనిపిస్తోంది. మిలిటెంట్ల పట్ల ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ అనుసరిస్తున్న ఉదార వైఖరిపై బీజేపీ మంత్రులు అసంతృప్తిగా ఉన్నారు. స్వీయరక్షణకు రాళ్ళు రువ్విన ప్రజలపై కాల్పులకు దిగిన సైనికులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశిస్తూ ముఫ్తీ ఉపయోగించిన కఠిన పదజాలంపై కూడా మంత్రులు ఆగ్రహంగా ఉన్నారు. కాశ్మీర్ లోయలో తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ, మావోయిస్టుల ఏరివేతలోనూ మూడేళ్ళలో 400మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారని పార్లమెంటుకు తెలిపిన అంశం జమ్మూ కాశ్మీర్‌లోని హింస తీవ్రతను తెలియజేస్తుంది. జమ్మూ, కాశ్మీర్‌లో 72మంది పౌరులు, 201మంది రక్షణ సిబ్బంది తీవ్రవాద చర్యల్లో కన్నుమూశారు. 2017లో ఇక్కడ 342 తీవ్రవాద ఘటనలు చోటుచేసుకున్నాయి. 80మంది రక్షణ సిబ్బంది మరణించారు. రాళ్ళు రువ్విన ఘటనలలో 11వేల 566మంది గాయపడ్డారు. మొత్తం 4వేల 736 రాళ్ళు రువ్విన ఘటనలున్నాయి. ఈ ఏడాది ఒక్క జనవరిలోనే 28 హింసాత్మక ఘటనలు జరిగాయి. ఇందులో నలుగురు రక్షణ సిబ్బంది, ఎనిమిదిమంది మిలిటెంట్లు మరణించారు. 2002 ఒప్పందం ప్రకారం సరిహద్దు రేఖ వెంబడి కాల్పుల విరమణను ఉల్లంఘిస్తున్న దాయాది పట్ల కఠిన వైఖరి అవలంబించాలి. దానికి పెద్ద మూల్యాన్ని చూపాలి. నరేంద్రమోడీ ప్రధాన మంత్రి అయిన వెంటనే పాకిస్థాన్‌తో సత్సంబంధాలను నెలకొల్పాలని అనేక మార్లు ప్రయత్నించారు. ఇటీవలే నిర్వహించిన రెండు దేశాల జాతీయ రక్షణ సలహాదారుల సమావేశం దీనికొక ఉదాహరణ. తీవ్రవాదంపై పాకిస్థాన్ బొంకుతోందనీ, తమను మోసం చేస్తోందనీ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ కూడా ప్రకటించిన సంగతి ఈ సందర్భంగా గమనార్హం. ఇదే నేపథ్యంలో భారత్ కొన్ని సాహసోపేతమైన చర్యలను తీసుకోవాలి. సరిహద్దుల్లో ఉల్లంఘనల అదుపునకు ఇలాంటి చర్యలు తప్పవు. తమ సాహస వీరులను భారత్ ఇకపై కోల్పోరాదు. కపిల్ కుందు మరణం భారత ప్రభుత్వానికి కనువిప్పు కావాలి. దీన్ని చూసైనా పాకిస్తాన్ పట్ల కఠిన వైఖరిని అనుసరించాలి. అదే కపిల్ కుందుకు సరైన నివాళి కాగలదు.

స(అ)యోధ్య యత్నాలు!

ఏ సమస్యనైనా కాలమే పరిష్కరిస్తుందన్న నానుడి అయోధ్య విషయంలో నిజం కావాలని కోరుకుందాం.అయోధ్య లో వివాదాస్పద స్థలానికి సంబంధించిన కేసును భూ వివాదంగానే పరిగణించి విచారిస్తామంటూ సుప్రీంకోర్టు స్పష్టీకరించడంపై ముస్లిం వర్గాల ప్రతినిధులతో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీరవిశంకర్ చర్చించడం ఈ వివాదం పరిష్కారంలో మరో ముందడుగు.అయోధ్యలో 2.7 ఎకరాల స్థలంపై నిర్మోహీ అఖాడా, సున్నీ వక్ఫ్ బోర్డు, ప్రతినిధులు, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను మార్చి 14వ తేదీకి వాయిదా వేస్తూ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా కవితాత్మకంగా చేసిన వ్యాఖ్యలు వాస్తవానికి అద్దం పట్టే రీతిలో ఉన్నాయి. ప్రతిపాదనలు కావాలని తాము అడగలేదని, ప్రతిపాదనలు వస్తే ఊహాగానాలు వస్తాయని, వాటి వల్ల విపరీత అనర్థం వస్తుందన్న వ్యాఖ్యల్లో ఎంతో నిజముంది.ఈ కేసు విచారణను స్థల వివాదంగానే పరిగణిస్తామన్న సర్వోన్నత న్యాయ స్థానం ప్రకటన హేతుబద్ధంగానే ఉంది. ఎనిమిదేళ్ళ క్రితం అలహాబాద్ హైకోర్టు అయోధ్య స్థలాన్ని సున్నీ వక్ఫ్ బోర్డ్, నిర్మోహీ అఖాడా, రామ్‌లల్లాలకు సమానంగా పంచాలని ఇచ్చిన తీర్పుపై మొత్తం 14పిటిషన్లు దాఖలయ్యాయి. వీటి తో సంబంధించిన పత్రాలు, అఫిడవిట్లు, ఆధారాలన్నీ హిందీలోనే ఉన్నాయి. వీటిని ఆంగ్లంలోకి తర్జుమా చేసి ఇవ్వాలని ఆదేశిస్తూ, కోర్టు రెండు వారాల గడువిచ్చింది. ప్రతిపాదనలను బట్టి సాగే విచారణ ఊహాగానాలకూ, వివాదాలకూ దారి తీస్తుందన్న జస్టిస్ మిశ్రా వ్యాఖ్య ముమ్మాటికీ నిజం. ఊహాగానాల వల్లనే వివాదాలు చెలరేగుతున్నాయి. ఆ వివాదాలు ఎడతెగని సమస్యల్లో, చిక్కుముడు లతో కూడి ఉంటున్నాయి. ఇందువల్ల కాలహరణం, న్యాయం జరగకపోవడం అనుభవంలో చూస్తున్నాం. ఈ కేసును రోజువారీ విచారించాలన్న అభ్యర్థన ఆచరణ సాధ్యం కాదని, కోర్టు ముందు అనేక కేసులున్నాయని జస్టిస్ మిశ్రా చేసిన వ్యాఖ్య కూడా వాస్తవమే. అయోధ్య కేసు చాలా సున్నితమైంది. దేశంలో వివిధ వర్గాల మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం ప్రమాద హేతువవుతాయి. అయోధ్య వివాదం దశాబ్దా లుగా రగులుతూనే ఉంది. రెండున్నర దశాబ్దాల క్రితం చోటు చేసుకున్న ఘటనలు ఇప్పటికీ పీడకలగా వెంటాడుతున్నాయి. ప్రజల మధ్య సామరస్య సాధన కోసం కృషి చేయాల్సిన పార్టీలు ఈ సమస్య ను అడ్డుపెట్టుకుని తమ ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించిన సందర్భాలూ మనకు తెలుసు. ఏ సమస్యను ఆ కోణంలోనే చూడాలి. ప్రధానంగా ఇది స్థల వివాదం. దీనిని ఆ కోణంలోనే లోతుగా పరిశీ లించి నిర్ణయాలు తీసుకోవడం సబబైన విధానం. దీనికి మరి దేనితో ముడిపెట్టినా ప్రమాదమే. అయోధ్య విషయంలో ఇంతవరకూ జరిగింది అదే. పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు మారాయి. ప్రజల ఆలోచనా ధోరణిలో కూడా మార్పును స్పష్టంగా చూస్తున్నాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధికారాన్ని చేపట్టిన నాటి నుంచి అభివృద్ధి అజెండాతో పని చేస్తున్న మాటను ఎవరూ కాదనలేరు. దేశంలో అక్కడక్కడ అసహన ధోరణులు కనిపిస్తున్నా, మొత్తం మీద అభివృద్ధి వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. సాంఘిక న్యాయం,లైంగిక న్యాయం వంటి డిమాండ్లు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వీటి నేపథ్యంలోనే ముమ్మారు తలాక్ పద్ధతిని కూడా మార్చేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారు. ఇందుకు సంబంధిం చిన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. దీనిని మతపరమైన సమస్య గా కాకుండా, స్త్రీ, పురుషుల మధ్య సమానత్వ కోణంలో పరిష్కరిం చేందుకు చేస్తున్న ప్రయత్నాలను అధిక సంఖ్యాకులు ఆహ్వానిస్తు న్నారు. అయోధ్య అంశాన్ని కూడా స్థల వివాదం కోణం నుంచే విచారించి పరిష్కరించు కోవడం ఉత్తమం. కోర్టు వెలుపల అయోధ్య వివాదం పరిష్కారానికి గతంలోనూ ప్రయత్నాలు సాగాయి. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి కూడా ఇందుకు ప్రయత్నించారు. కోర్టు వెలుపల పరిష్కారానికి ఇప్పుడు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ కృషి చేస్తున్నారు. ఆయనను గురువారంనాడు షియా వక్ఫ్ బోర్డు, సున్నీ పర్సనల్ లా బోర్డు ప్రతినిధులు కలుసుకుని చర్చిం చడంఆహ్వానించదగిన పరిణామం. ఆయన ఏర్పాటు చేసిన సమావే శంలో 16 మంది ముస్లిం నేతలు, విద్యావేత్తలు, మేధావులు పాల్గొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి వీరంతా చూపుతున్న ఆసక్తిని చూస్తుం టే ఆశలు చిగురిస్తున్నాయి. చర్చల్లో పాల్గొంటున్న వారంతా ఆధునిక కాలానికి చెందిన వారే కావడం వల్ల వారి ఆలోచనలు ఆధునికంగానే ఉండే అవకాశంఉంది. ఈ నేపథ్యం నుంచి పరిశీలిస్తే, సమస్యకు పరి ష్కారం దొరకడం కష్టమేమీ కాదు. ఈ కేసులో బయట వారి జోక్యం వద్దని హిందూ, ముస్లిం సంస్థలు కోరినా, ప్రయత్నాలు మాత్రం ఆగలేదు. ఈ సంస్థలు ఇంతవరకూ 524 ఆధారాలను సమర్పిం చాయి. ఇందులో 502 పత్రాలున్నాయి. సమస్య పరిష్కారా నికి ఇటు న్యాయస్థానంలోనూ, అటు కోర్టు వెలుపల చేస్తున్న ప్రయ త్నాలు సానుకూల ధోరణిలోనే సాగుతున్నాయి. అవి ఫలించాలని ఆశిద్దాం.

పాఠకీయం

యధేచ్ఛగా వన్యప్రాణుల వేట?

అడవులలో స్వేచ్ఛగా సంచరించాల్సిన వన్యప్రాణులు వేటగాళ్ళ బారిన పడి మాంసాహార ప్రియులకు విందుభోజనంగా మారుతున్నాయి. వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి మహబూబాబాద్ జిల్లాలలో దట్టమైన అటవీ సంపద ఉంది. సరిహద్దు గ్రామాల వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని ఆటోలు, ఇతర మార్గాల ద్వారా నగరాలు, పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాలలో ముఠాలుగా ఏర్పడి పెద్దఎత్తున వన్యప్రాణులను వేటాడుతూ కార్పొరేట్ హోటళ్లు, రెస్టారెంట్లకు తరలిస్తున్నారు. కుందేళ్లు, దుప్పులు, అడవి పందులు, కొండగొర్రెలు, నెమళ్లు, జింకలు వేటగాళ్ల వలలో పడి తనువు చాలిస్తున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం కేవలం కాగితాలకే పరిమితమవుతోంది. వీటిని రక్షించాల్సిన అటవీ అధికారులు వేటగాళ్లతో చేతులు కలిపి వారి కనుసన్నలలో ఈ బాగోతం సాగుతోంది. ఒకవైపు పోడు వ్యవసాయం మూలంగా అడవులు అంతరించిపోతుండడం, మరోవైపు వేటగాళ్ల దాష్టీకానికి వన్యప్రాణుల సంఖ్య తగ్గుతుండడం కలవరానికి గురిచేస్తున్నాయి. కొత్తగూడ, పాకాల అడవులు, మహాదేవపూర్, పలిమెల, వాజేడు, మహాముత్తారం, కాటారం, గూడూరు, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, ఏటూరు నాగారం మండలాల పరిధిలో ఈ వేట నిరాటంకంగా సాగుతోంది. ప్రభుత్వం అటవీ అధికారులు వేటగాళ్లను గుర్తించి శిక్షించాలి. వన్యప్రాణులను సంరక్షించాలి.

● కామిడి సతీష్ రెడ్డి, జడలపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

జైట్లీ పద్దుపై పెదవి విరుపు

ఈ ఏడాదిలో ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలు, వచ్చే ఏడాదిలో జరగనున్న సాధారణ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని 2018- 19కి సంబంధించిన బడ్జెట్‌ను రూపకల్పన చేసేందుకు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రయత్నం చేశారు. ప్రపంచంలో ఏడో ఆర్థిక శక్తిగా ఎదిగినట్లు త్వరలోనే ఐదో ఆర్థిక శక్తిగా అవతరించనున్నట్లు బడ్జెట్ సందర్భంగా అరుణ్‌జైట్లీ వెల్లడించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పట్ల మొన్నటివరకు ప్రశంసించిన అనేక వర్గాలు నేడు పెదవి విరుస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో కోతల కంటే వాతలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. పెద్ద నోట్లరద్దు, జిఎస్‌టి లాంటి విప్లవాత్మకమైన చర్యలు తీసుకున్నట్లు ఇప్పటివరకు పదేపదే చెప్పిన పాలకులు ఆ సంస్కరణల వల్ల ఏం ప్రయోజనాలు ఒనగూరినాయో స్పష్టంగా వివరించలేకపోయారు. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగినట్లు మాత్రమే చెప్పుకున్నారు. ఒక పక్క పెరిగిన ధరలతో సామాన్యుని జీవితం అతలాకుతలమవుతుంటే మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులు అల్లాడుతుంటే ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంపిల వేతనం ఐదేళ్లకోసారి పెంచాలని నిర్ణయించడం ఎంతవరకూ సమంజసమన్న ప్రశ్న ఉదయిస్తున్నది. రాష్ట్రపతి గౌరవ వేతనం ఐదు లక్షలు, ఉప-రాష్ట్రపతి గౌరవ వేతనం నాలుగు లక్షలు, గవర్నర్ల గౌరవ వేతనం మూడున్నర లక్షలకు పెంచారు. దీనిపై సాధారణ ఉద్యోగులను పట్టించుకోకుండా పెద్దలకు పెంచడంపై విమర్శలు పెల్లుబుకుతున్నాయి. బడ్జెట్ అంచనా రూ.21.57 లక్షల కోట్లు కాగా, ద్రవ్యలోటు 3.3 శాతం ఉంటుందని అంచనా వేశారు. అటు నిరుద్యోగులను, ఇటు ఉద్యోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. బడ్జెట్ కేటాయింపును పరిశీలిస్తే తెలుగు రాష్ట్రాలకు మాత్రం ఈసారి మొండిచెయ్యే చూపెట్టారు. విద్యారంగం విషయంలో కూడా కొంతమేరకు శ్రద్ధ పెట్టినా ఆ నిధులు సరిపోవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మౌలిక సౌకర్యాలకోసం లక్ష కోట్లు ఇచ్చారు. సైనిక సంపత్తి ఆయుధాల తయారీలో స్వావలంబనకు, విదేశీ పెట్టుబడులకు కూడా ప్రోత్సాహం ఇవ్వనున్నారు. మొత్తం మీద తాజా బడ్జెట్ అధిక శాతం ప్రజలకు నిరాశే మిగిల్చింది. ఈ ఏడాదిలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు కొంత ప్రాధాన్యత ఇచ్చినట్లే కనిపిస్తోంది. కర్ణాటక రాష్ట్రానికి నిధుల కేటాయింపులో కొంతమేరకు ప్రాధాన్యత నిచ్చారు. బెంగళూరు మెట్రో అభివృద్ధికి ఏకంగా పదిహేడు వేల కోట్ల రూపాయలు ఈ బడ్జెట్‌లో కేటాయించారు. ఆ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణాకు, ఆంధ్రప్రదేశ్‌కు సవతి తల్లి ప్రేమను చూపించారని చెప్పొచ్చు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం విషయం ప్రస్తావన లేకుండా పోయింది. తెలంగాణాలో హైదరాబాద్ ఐఐటికీ రూ.75 కోట్లు, నల్గొండ, లింగంపేట విద్యుదీకరణకు 129 కోట్లు, పెద్దపల్లి లింగంపేటకు రూ.83 కోట్లు, సింగరేణికి మరో రెండు వేల కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితిలో మార్పు లేకపోవడంతో కోట్లాది మందికి నిరాశే మిగిలింది.

● కీర్తి నాగరాజు, 9652404611

ప్రేమ పార్టీ.. జిందాబాద్!

(ఫిబ్రవరి-14 ప్రేమికుల దినం)



సుత్తి మెత్తంగా...

కర్లపాలెం హనుమంతరావు
8142283676

'ప్రేమే దైవం. యువతే లక్ష్యం'

'ఇదివరకు సేవే లక్ష్యం అన్నట్లు గుర్తు?'

'అది ముగిసిపోయిన పార్టీ పొట్టి కేప్షన్ బాబాయ్! ఇది ముందుకు దూసుకొస్తోన్న పార్టీ కొత్త స్లోగన్. మాది దక్షిణాది రాష్ట్రాల మార్కు యాక్షన్ పార్టీ! అదేమో ఉత్తరాది రాష్ట్రాల మార్కు ప్రేమ పార్టీ! మాధుర్ నాథ్ చౌధురి గుర్తున్నాడా?'

'మర్చిపోదగ్గ మహాను భావుడా బాబూ? పాఠాలు చెప్పమని ఉద్యోగమిస్తే.. ప్రేమ పాఠాలు వల్లించి మరీ ఓ పిల్ల శిష్యురాలిని ఏకంగా పెళ్లి పీటల మీదకు ఎక్కించిన మన్మథుడు! అప్పట్లో అదో సంచలనం. చాలా ఘన సన్మానాలు కూడా జరిగినట్లు గుర్తు .. పాత చెప్పులు వగైరా గజమాలలతో!'

'చెప్పు పడ్డంత మాత్రాన గొప్పతనమేమన్నా తరిగిపోతుందా? ఆ మాటకొస్తే ఇప్పుడున్న గొప్ప నేతల్లో చెప్పు మీదపడని వారెవరున్నారో చెప్పు?'

'సర్సరే! ఇప్పుడీ పాత పురాణాలన్నీ ఎందుగ్గానీ.. నువ్ చెప్పాలనుకొన్న కొత్త కహానీ ఏదో చప్పున చెప్పెయ్ రా నాయనా!'

'ఆ మాధుర్ చౌధురి అప్పట్లో ప్రేమ పార్టీ ఓటి పెట్టేసి హృదయం గుర్తుతో బరిలోకి దిగినట్లే.. వచ్చే ఎన్నికల్లో మేమూ మరో ప్రేమ పార్టీతో దడదడలాడించబోతున్నాం బాబాయ్! ఇప్పట్నుంచే దేశమంతా టూర్లతో హెూరెత్తించే ప్రయత్నాల్లో ఉన్నాం'

'ఎన్నికల జాతర్లు. కనుచూపు మేరలో ఉండె. ఇట్లాంటి గారడీలు ఇంకెన్ని చూడాల్రో! ఇన్నాళ్ల బట్టి జనాల గోడు అసలు పట్టించుకోకుండా.. ఇవాళ పరగడుపునే పక్క దిగేసొచ్చేసి జడి వానలా ఇలా ప్రేమలు కురిపించేస్తానంటే తడిసి ముద్దయేందుకు జనాలేమన్నా చిన్నబడి కెళ్లే బుడతకాయలట్రా? బడా బడా నేతలు.. బడబడవాగే అధినేతలకే చుక్కలు చూపించే తెలివి తేటలు వాళ్లవి'

'బాబోయ్! టీవీ చర్చా కార్యక్రమాల్లోలా ఆ భాషేంటి బాబాయ్! ఈ వయస్సులో కూడా నీకే వంట్లో ఇంత పులుసుంటే.. ఇహ ఈడు మీదున్నోళ్లం.. మా నోళ్లెలా మూసుక్కూర్చుంటాం?'

'నా సంగతులు ఇప్పుడెందుగ్గానీ.. నీ ప్రేమ పార్టీ చేసే ఘనకార్యాలేంటో కొద్దిగా విప్పి చెప్పు బాబూ.. విని తరిస్తాం!'

'దేశాన్నిప్పుడు పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యలేంటీ?'

'ఇంకేముంటాయ్? ఏడు దశాబ్దాల బట్టీ రెండే ప్రారబ్దాలు. కూడూ.. నీడా'

'ఒక్క ఓటుతో ఆ రెండు ప్రారబ్ధాలనీ పటాపంచలు చేయబోతోంది మా ప్రేమ పార్టీ! ప్రేమకు ఆకలీ దప్పికలుండవు కదా! తిండి తిప్పలు ఇహ ఒహ సమస్యగానే ఉండబోవు, రూపాయిక్కిలో బియ్యంలాంటి గారడీలు ఇంకేమీ చెయ్యాల్సిన ఖర్మ పట్టదు. తాగునీరో,, రబీ సీజనో.. అంటూ నీటి వాటాల కోసం కొట్టుకు చచ్చే దౌర్భాగ్యాలిక ముందు మా పాలనలో రాబోవు. ప్రేమలో పడ్డవాళ్లంతా ఎదుటి వాళ్ల గుండెల్లో కాస్తింత చోటు దక్కితే 'అదే.. పది వేల'ను కుంటారు గదా బాబాయ్! ఇంకే డబుల్ బెడ్రూంలు, ఆవాస యోజనాల్లాంటి ప్రయోజనాల్లేని పథకాల కోసం వీసమెత్తైనా ఆందోళనలు అసలు చేయవలసిన అవసరమే ఉండదు. ప్రేమికులకు మన మామూలు భాషతో పనే పడదు బాబాయ్! వాళ్లవన్నీ మూగ సైగలు! సైగలు కాలం నాటి బొంగురు గొంతు పాటలు. భాషాసమస్యలన్నీ ఇట్టే సమసిపోతాయ్. ప్రేమ త్యాగాన్ని తప్ప మరేదీ కోరుకోదు కదా! కొడుకులకు, కూతుళ్లకు కూడబెట్టివ్వాలన్న తాపత్రయం తగ్గిపోక తప్పదు. కుంభకోణాల ఊసే జనం శాశ్వతంగా మర్చిపోవచ్చింక హాయిగా! వారసులే దేశాన్నేలి తీరాలన్న పెద్దల వరస వల్లనే కదా ఇప్పుడిన్ని రాజకీయాలు.. రాద్ధాంతాలు! ఆ అరాచకాల జోలికింకే నేతకూ, అధినేతకూ వెళ్లబుద్ధికాదు. కుంభకోణాలు, కుమ్ములాటలు, వెన్నుపోట్లు, వెన్న రాయడాల్లాంటివన్నీ ఇహ గత పాలకుల ఖాతాల్లోనుంచి హఠాత్తుగా నిద్ర లేచొచ్చే పిశాచాలు కాబోవు. ప్రేమ పార్టీ విస్తరించే కొద్దీ 'అది కావాలి.. ఇది కావాలి' అనే డిమాండ్లు వాటంతటవే అణిగిపోతాయి. పై పెచ్చు 'ఇదిచ్చేస్తాం.. అదిచ్చేస్తాం! పుచ్చుకోకుంటే చంపి పాతరేస్తాం' లాంటి త్యాగనినాదాలే కర్ణ భేరులదిరి పోయేటట్లు మిన్ను ముట్టేది. ఇప్పుడు జరిగే హక్కుల పోరాటాలన్నీ తక్కువని ఒక్కసారే మూతబడితే.. ఆ శాంతి భద్రతల్ని చూసి నీ లాంటి సీనియర్ సీజనల్ పొలిటీషియన్సు పాపం.. తట్టుకుంటారో .. లేదో! వుపిటీ యూ బాబాయ్!'

'గురజాడగారి గిర్రాయి టైపు లెచ్చర్ల తంతుగా ఉందిరా నీ వాగుడంతా! ఇన్నేసి న్యూసు పేపర్లు, న్యూసెన్సు టీవీ ఛానల్సు క్రమం తప్పకుండా చూసే నాకే గుండె బేజారయేట్లుందే నీ భావి భారత రాజకీయ ఊహా చిత్రం! ఇహ కామ్ గా పోయే మామూలు ఆమ్ ఆద్మీ మీ బోటి ప్రేమ మాయగాళ్ల ధాటికి ఎట్లా తట్టుకుంటాడో.. పాపం! మీ మాధుర్ చౌధురీ మాజీ ప్రేమ పార్టీయే పెద్ద గూడుపుఠాణీరా బాబూ? ఆ మాయల మరాఠీనా మీకు మూవింగ్ ఇన్స్పిరేషన్? మూవీ, టీవీ మార్కెట్ల కంటే 'కాదల్' ఓ.కే.. మా బాగా అమ్ముడయ్యే మంచి సరుకే! మూడు పూటలా మెక్కి,, మంచమెక్కి తెల్లారే దాకా తొంగునే నీడుంటే తప్ప.. బతుగ్గడవని బక్కోళ్లకు ఈ ప్రేమలూ, దోమల్తో పార్టీలేంట్రా.. పిచ్చిగాకపోతే!'

'ఏళ్ల బట్టీ బూర్జువా పార్టీల తత్వం వంటబట్టిన నీ బోటి ముసలి డొక్కులకి ప్రేమంటే ముందులో కాస్తంత డోకే వస్తుందిలే! వుయ్ డోంట్ కేర్! బోల్డుగా చెబుతున్నా.. నిజానికి జనాలకి మా ప్రేమ పార్టీ వల్ల కలిగే ప్రయోజనాలు బోలెడు. ఓపిగ్గా వింటానంటే ఓపెన్ చేసి మరీ వినిపిస్తా మా 'ది బెస్ట్' మ్యానిఫెస్టో'

'ఓటేసే జనాలం. వద్దంటే మాత్రం వదిలేస్తార్రా! ఊ.. బాదేయ్!'


'ఇప్పుడు నడిచేవన్నీ కుల రాజకీయాలే కదా బాబాయ్! మత ప్రాతిపదికనేదే లేకుండా మంత్రాంగం నడవని రాజకీయాలు మనవి. ప్రేమ జీవులకసలు కుల మతాలతో ప్రమేయమే ఉండదు. జాతి పురోగతికి అందుకే మా ప్రేమ పార్టీనే చివరికి గతి. ఎవరెవరితోనో పొత్తులంటూ తొత్తులుగా మారే కన్నా మా ప్రేమ పార్టీతో చేతులు కలిపమనండి! ఏడాదిలోగానే అధికారం దోరమగ్గిన పండులా వళ్లోకొచ్చి వాలకుంటే అప్పుడడగండి. మా లక్ష్యాలు నెరవేరడానికి మేం ఎవరితోనైనా ఖత్తు కలపేందుకు ఎవ్రెడీ'

'ఏంటి బాబూ అంతలా మీ లక్ష్యాలు?'

'ప్రేమ కోసం జీవితాలను ఫణం పెట్టిన అమర జీవులు దేవదాసు, ఏంటొనీ క్లియోపాత్రా. వారి భారీ విగ్రహాలని పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిష్ఠించాలి. పసివగ్గులక్కూడా ప్రేమకథలను గూర్చి ఉగ్గుపాలతో మరీ రంగరించి పోయాలి. సిగ్గు ఎగ్గుల్లేకుండా ప్రేమించుకోవాలంటే ప్రాథమిక దశ నుంచే లైలా మజ్నూల్లాంట్టి లవ్ బర్డ్స్ చరిత్రలు పాఠ్యప్రణాళికల్లో చేర్చి తీరాలి. ప్రేమ కథా చిత్రాలను మాత్రమే నిర్మించే విధంగా సినిమాటోగ్రఫీ చట్టాలలో సవరణలు చేపట్టాలి. ప్రేమను కించపరిచే ఏ కళారూపాన్నైనా పర్మినెంటుగా బహిష్కరించే సెక్షన్లు ఐ పి సి కోడుల్లో చేర్పించాలి. ప్రేమ విరోధులకు విధించే శిక్షలు తతిమ్మా ప్రణయద్వేషులకు వణుకు పుట్టించేటంత తీవ్రంగా ఉండి తీరాలి. ప్రేమ వివాహాలను ప్రభుత్వాలే స్వంత ఖర్చుతో భారీగా ప్రతి ప్రేమికుల దినం రోజు జరిపించాలి.

ప్రేమపక్షుల విహారానికి అనుకూలమైన స్థలాలను ప్రభుత్వాలే సేకరించాలి. పార్కులుగా అభివృద్ధి పరచాలి. విఫల ప్రేమికులకు సరికొత్త ప్రేమికులు దొరికే వరకు ప్రభుత్వాలే 'వియోగ భత్యం' కింద మందూ.. మాకులకు నెల నెలా ఇంతని చెల్లించాలి. ఫ్లాపైన ప్రేమ చిత్ర నిర్మాతలకు ఉద్దీపన పథకాలు.. రేంటింగు తగ్గిన ప్రేమ సోపులకు భారీ సబ్సిడీలు.. బడ్జెట్లల్లో కేటాయించాలి. విఫల ప్రేమికులు పునఃప్రేమకు తాము చేసే సర్వ ప్రయత్నాలు పునః విఫలమై, పూర్తి విరక్తితో ఆత్మాహుతి తలపదితే .. దూకి చచ్చేందుకు సరిపడా లోతైన కాలువలు తవ్వించాలి. తల పెట్టుకుని పడుకునేందుకు ప్రత్యేక రైలు పట్టాలు ఏర్పాటు చేసి, వేళకు రైళ్లు ఆ ట్రాకుల మీదుగా పోయే ఏర్పాట్లు చేసితీరాలి. ప్రేమికుల చేత పళ్లు రాలగొట్టించుకొనే ఔత్సాహిక ప్రేమికులకు 'ప్రేమశ్రీ' పథకం కింద ఉచిత చికిత్సలు, దంత వైద్యశాలలు తక్షణమే ఏర్పాటు చేయాల్సుంది. అన్నట్లు నూతన ప్రేమికులకు పరిమితి లేని ఉచిత సెల్ ఫోన్‌కాల్స్ సౌకర్యం విధిగా ప్రభుత్వాలే కల్పిస్తే మరీ మంచిది.'

'అసల్ది మరిచావురా భడవా ప్రేమ మైకంలో పడి. ప్రేమ గుడ్డిది. మీది కళ్లు లేని కబోదుల పార్టీ కదా! పిచ్చాసుపత్రుల్లో బెడ్లు కూడా మరిన్ని పెంచాలని డిమాండు పెట్టడం మర్చి పోయావ్!'



15వ ఆర్థిక సంఘం రాక

● ఆరు రాష్ట్రాలతో భేటీ ● నేడు కాళేశ్వరం సందర్శన ● కేంద్ర ప్రాధాన్యతల వివరణ ● రాష్ట్రాల వివరాల సేకరణ

హైదరాబాద్ ఆంధ్రప్రభ: కేంద్ర, రాష్ట్రాల మధ్య ఫెడరల్ స్ఫూర్తిని పెంచి పన్నుల పంపిణీ మరింత పెంచేలా 15వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి చేరుకుంది. రాష్ట్రంలో రెండు రోజుల పర్యటనకుగానూ ఆర్థిక సంఘం కార్యదర్శి అర్విండ్ మెహతా, ఆయన భార్యతో కలిసి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజులపాటు 15వ ఆర్థిక సంఘం బృందం రాష్ట్రంలో పర్యటించనుంది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో దక్షిణాదికి చెందిన ఆరు రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శులతో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన ఆర్థిక శాఖ కార్యదర్శులతో సమావేశమయ్యారు.

2020-21 ఆర్థిక ఏడాదినుంచి 15వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేసేందుకు కేంద్రం రాష్ట్రాలకు అనుగుణంగా నిధులు ఇవ్వనుంది. వనరుల పంపిణీ, నిధుల పంపకాలు, రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నేపథ్యంలో కేంద్ర మాజీ రెవెన్యూ కార్యదర్శి ఎన్‌కె సింగ్ చైర్మన్‌గా 15వ ఆర్థిక సంఘం ఏర్పాటు చేసింది. అక్టోబర్ 2019 నాటికి రికమండేషన్స్ చేయాలని నిర్దేశించారు. ఏప్రిల్ 2020 నుంచి మార్చి 2025 వరకు ఈ సంఘం ప్రతిపాదనలు అమలులో ఉంటాయి. అన్ని పరిపాలనా స్థాయిలు, పెట్టుబడీ వర్గాలు, రాష్ట్రాలతో సమావేశమై విస్తృత సంప్రదింపుల ద్వారా సిఫార్సులను రూపొందించాలని 15వ ఆర్థిక సంఘం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర పన్నుల్లో 42 శాతం కేంద్ర పన్నులనుంచి వాటా రూపంలో అందించాలని ప్రధాని మోడీ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ వాటా గతంలో 32 శాతంగా ఉండగా, రాష్ట్రాల ఆర్థిక ప్రగతిని మరింత ద్విగుణీకృతం చేసేలా ఆయన ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. న్యూ ఇండియా 2022, జాతీయ అభివృద్ధి కార్యక్రమం కింద రాష్ట్రాల అభివృద్ధి స్ఫూర్తిగా కేంద్రం కీలక నిర్ణయాలకు 15వ ఆర్థిక సంఘం ప్రతిపాదనలు కీలకం కానున్నాయి.

అన్ని రాష్ట్రాలు తమ ప్రతిపాదనలను ఈ ఏడాది ఏప్రిల్ 15లోగా ఆర్థిక సంఘానికి అందజేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలతో ఈ సంఘం హైదరాబాద్‌లో భేటీ అయింది. 15వ ఆర్థిక సంఘం అనుసరించబోయే విధానాలు, రాష్ట్రాలనుంచి రావాల్సిన సమాచారంపైఈ భేటీలో చర్చించారు.

రాష్ట్రాల పనితీరు ఆధారంగా ఈ ఏడాది కొన్ని నిధులను కేటాయించాలని కేంద్రం భావిస్తోంది. వీటి వివరాలను ఈ భేటీలో ఆయా రాష్ట్రాలకు వివరించారు. అదేవిధంగా శనివారం 15వ ఆర్థిక సంఘం బృందం కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనుంది. ప్రాజెక్టుల నిర్మాణంలో భాగంగా జరుగుతున్న ఆనకట్టలు, సొరంగాలు, పంప్ హౌజ్, కాల్వలను పరిశీలించనుంది. జీఎస్టీ అమలుతో రాష్ట్రాలు కోల్పోతున్న రాబడి వివరాలను, ఇతర భారాలను పరిశీలిస్తామని ఈ సంఘం పేర్కొంది.

మేడారం జాతర ఆదాయం రూ.9.06 కోట్లు

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో: మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర హుండీల ఆదాయం రికార్డు సృష్టించింది. శుక్రవారం నాటికే హుండీల ద్వారా ఆదాయం రూ. 9.06 కోట్లకు చేరింది. ఇంకా 53 హుండీలు లెక్కించాల్సి ఉంది. జాతరలో మొత్తం 452 హుండీలు ఏర్పాటు చేశారు. హన్మకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మంటపంలో ఈ నెల 7వ తేది నుంచి లెక్కింపు ప్రారభించారు. ఇప్పటి వరకు 399 హుండీలను మాత్రమే లెక్కించారు. 2016 జాతరలో రూ.8.91 కోట్ల ఆదాయం వచ్చింది.

పార్టీరహితంగా పంచాయతీ ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న నాగిరెడ్డి

వరంగల్, ప్రభన్యూస్ బ్యూరో: రానున్న పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా బ్యాలెట్ పద్దతిలో ఉంటాయని రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం వరంగల్‌లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల ఆధారంగా బ్యాలెట్ పత్రాలతో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జిల్లాల వారీగా అవసరమున్న బ్యాలెట్ బాక్సులను కర్నాటక, మహారాష్ట్ర నుండి తెప్పిస్తామన్నారు.

ఈసీ పదవికి మూడు పేర్లు

● ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నియామకం కోసం రాష్ట్రప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా మూడు పేర్లను కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేసింది. జీఈవో పోస్టుకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో కూడిన జాబితాను ఆమోదం కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించగా, కేంద్ర ఎన్నికల సంఘం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇందులో అటవీ శాఖ అధికారిగా ఉన్న రజత్ కుమార్, కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్, కార్మిక శాఖ అధికారి శశాంక్ గోయల్ పేర్లను ప్రతిపాదించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఈ పేర్లను పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనుంది. ఆ తర్వాత రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది.

స్వామినాథన్ సిఫార్సుల అమలుకు అన్నాహజారే సత్యాగ్రహ దీక్ష

● 17న హైదరాబాద్‌లో బహిరంగ సభ

● మార్చి 23న ఢిల్లీలో..: ఎర్రబెల్లి రజనీకాంత్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైతుల సమస్యలపై స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్నా హజారే మార్చి 23న ఢిల్లీలో సత్యాగ్రహ దీక్షను చేపడుతున్నారని ఆయనకు సంఘీభావంగా హైదరాబాద్‌లో ఫిబ్రవరి 17న బహిరంగ సభను నిర్వహిస్తున్నట్టు అన్నా హజారే సందేశ సభ నిర్వహకులు ఎర్రబెల్లి రజనీకాంత్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన శుక్రవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు తెలిపారు. ఆయనతోపాటు ఎస్ చంద్రశేఖర్, ఎం విజయ్‌కుమార్, పల్నాటి రాజేందర్, తోట పవన్, రమాకాంత్, మారసాని విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో సభను సోషల్ పోస్టు, ఇండియా ఎగైనెస్ట్ కరప్షన్ వాలంటీర్స్ అసోసియేషన్ నిర్వహిస్తోందని రజనీకాంత్ తెలిపారు. దేశంలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్తను వెంటనే ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అప్పుడు మాత్రమే అవినీతి భరతం పట్టడానికి మార్గ సుగమం అవుతుందని తెలిపారు. పంట దిగుబడికి రైతు పెట్టిన ఖర్చుకు అదనంగా 50 శాతంతో కనీస మద్ధతు ధర ఉండాలన్నారు. 60 సంవత్సరాలు నిండిన రైతుకు కిసాన్ పెన్షన్ స్కీమ్ పేరుతో నెలకు రూ. 5000 పెన్షన్ ఇవ్వాలన్నారు. వ్యవసాయ పనిముట్లపై ఉన్న జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. పంటరుణంపై చక్రవడ్డీని రద్దు చేయాలన్నారు. ఎన్నికల బ్యాలెట్‌లో పార్టీల గుర్తు కాకుండా పోటీ చేసే అభ్యర్థుల ఫోటోలు ఉండేలా చూడాలన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్టు

● ఆర్థిక శాఖ చీఫ్ సెక్రటరీ పేరిట నకిలీ సిగ్నేచర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆర్థిక శాఖ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు పేరిట నకిలీ, ఫోర్జ్‌డ్ సిగ్నచర్స్ లెటర్స్‌తో కూడిన లెటర్‌హ్యాడ్‌ను రూపొందించి తద్వారా ఓ ఫార్మాస్యూటికల్ కంపెనీని బురిడీ కొట్టించిన ఘరానా మోసగాడి గుట్టును సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. నిందితుడు ఏపీ తూర్పుగోదావరి జిల్లా మారుతీనగర్ నడకుదురుకు చెందిన కనుకురుత్తి రామకృష్ణచంద్రశేఖర్(27) కాకినాడలో బీ. ఫార్మసీ పూర్తి చేశాడు. కాలేజీ రోజుల్లోనుంచే రామ కృష్ణ మంచి వక్త. కాకినాడలో మంత్రులు, ఎంఎల్ ఎలు, ఇతర రాజకీయ నేతలతో తిరిగేవాడు. చాలా మంది రాజకీయ నేతలు అతడి ఫ్యామిలీ ఫంక్షన్స్‌కు అటెండయ్యేవారు. ఆ సందర్భంలో వారితో ఫోటోలు దిగి అవి ఫేస్‌బుక్‌లో.. వాట్సాప్‌లో షేర్ చేసేవాడు. ఇక అక్కడ్నుంచి అసలు కథ మొద లయ్యేది.

ఆయా పిక్చర్స్‌ను వివిధ వ్యాపారాలు చేసుకునే వ్యక్తులకు చూపుతూ తాను మంత్రుల పీఏనని ఫోజిచ్చేవాడు. ఇదే క్రమంలో ప్రభుత్వ టెండర్లు, ప్రభుత్వ ఉద్యోగుల ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగ్‌లతో పాటు సెక్ర టేరియేట్‌లో ఏదైనా ఇతర వర్కులు చేసి పెడతానంటూ పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేసేవాడు. ఆ క్రమంలోనే కలకత్తాకు చెందిన కౌశిక్‌తో స్నేహం పెంచుకున్నాడు. అతడి వద్ద నుంచి రూ.50వేలు వసూలు చేశాడు. తెలంగాణ, ఏపీలలో ప్రింటింగ్‌కు సంబందించిన టెండర్లను ఇప్పిస్తానని మోసం చేశాడు. ఇందుకు సంబంధించిన కేసు హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైంది. ఇదే క్రమంలో చంద్రశేఖర్ మామ కురుమేటి సుధాకర్.. చంద్రశేఖర్‌కు అతడి స్నేహితుడు తార్నాకలోని మెస్సర్స్ పల్స్ ఫార్మాస్యూటికల్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ సురేష్‌బాబును పరిచయం చేశాడు. సురేష్‌బాబును ముగ్గులోకి దింపేందుకు తన పరిచయాలకు సంబంధించిన ఫోటోలను సురేష్‌బాబుకు చూపాడు. చంద్రశేఖర్ ఇటు తెలంగాణ, అటు ఏపీలో హైయ్యర్ అఫీషియల్‌తో పరిచయాలున్న వ్యక్తి అని సురేష్ బాబు నమ్మాడు. దీంతో అతడ్ని కంపెనీ అనుసంధాన అధికారి / మేనేజింగ్ డైరెక్టర్‌గా చంద్రశేఖర్‌ను నియమించుకున్నారు. తెలంగాణ, ఏపీలనుంచి మందుల కొనుగోలు ఆర్డర్స్ కోసమని జనవరి 8, 2018న 9 కోట్ల విలువైన రెండు నకిలీ పర్జేజ్ ఆర్డర్స్‌ను క్రియేట్ చేశాడు. ఆఫీస్ ఆఫ్ ది డైరెక్టర్, ఇన్సూరెన్స్ అండ్ మెడికల్ సర్వీసెస్ (ఈఎస్ఐ) గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ పేరుతో ఆ పర్చేజ్ ఆర్డర్స్‌ను క్రియేట్ చేశాడు సదరు పర్చేజ్ ఆర్డర్స్ పొందేందుకు గానూ మేనేజ్‌మెంట్ రూ.12,75,000 అడ్వాన్స్‌గా ఇచ్చింది. ఫిబ్రవరి 2, 2018న ఆర్థిక శాఖ చీఫ్ సెక్రటరీ, తెలంగాణ పేరుతో 7,72.50.000 ఆంధ్రాబ్యాంక్, మల్లాపూర్‌లో అడ్వాన్స్ జమ చేయాలని ఆథరైజేషన్ లెటర్ వచ్చింది. అయితే, ఇది కనఫర్మ్ చేసుకునేందుకు సదరు కంపెనీ ఆంధ్రాబ్యాంకు, మల్లాపూర్‌ని సంప్రదించిన సమయంలో నిందితుడి బండారం బయటపడింది. దీంతో కంపెనీ సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. అదే క్రమంలో సదరు కంపెనీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న నిందితుడు చంద్రశేఖర్‌ను కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నించారు. నిందితుడు చంద్రశేఖర్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్దనుంచి నకిలీ, ఫోర్జరీ సంతకాలతో కూడిన లెటర్‌హ్యాడ్‌లు ఇతరత్రా స్వాధీనం చేసుకున్నారు. గతంలో జీహెచ్‌ఎంసీలో అసిస్టెంట్ ఉద్యోగాల పేరుతో పలువురిని మోసగించిన కేసులో ఇద్దరు అన్నదమ్ములు రాసా రాజశేఖర్(29), రాసా రమాకాంత్(25)లను సైఫాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు దారూరి రోహిత్‌కుమార్(23), తల్లా కశీశ్వర్‌రెడ్డి(24)లు ఇటీవల అరెస్టయ్యారు. ఇటువంటి మోసాలకు ప్రజలు గురి కావొద్దని, ప్రభుత్వాలలో ఎలాంటి సీనియర్ అధికారి ఇలాంటి ఆర్డర్స్ ఇచ్చే అవ కాశం ఉండదని, ఎవరైనా ఇలా వచ్చిన క్రమంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వి.వి. శ్రీనివాసరావు తెలిపారు

15లోగా వేతన పెంపు ఉత్తర్వులివ్వాలి

● టీ ఆక్టా డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు పెంచిన వేతనంపై ఉత్తర్వులను 15లోపు ఇవ్వాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్(టి-ఆక్టా) డిమాండ్ చేసింది. శుక్రవారం టి- ఆక్టా అసోసియేషన్ అధ్యక్షులు ఎం రామేశ్వరరావు నేతృత్వంలో కమిటీ సభ్యులు శుక్రవారం తెలం గాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఓయుసీటీఏ అధ్యక్షులు ఎం తిరుపతి, ఎస్ఎఫ్‌టీఏ అధ్యక్షులు సీహెచ్ రాజు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ లెక్చరర్లుగా పనిచేస్తున్న వేలాది మందికి ఉద్యోగ భద్రత కల్పిస్తూ, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2017లో ఉద్యోగ భద్రత కోసం నిరవధిక సమ్మె చేపట్టిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి బేసిక్, డిఏ ఇస్తూ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామి ఇచ్చారని గుర్తు చేశారు. హామి ఇచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు దానిపై ఎలాంటి ఉత్తర్వులు లేవని మండిపడ్డారు. వేతన పెంపుకు సంబంధించిన ఉత్తర్వులను 15లోగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా తాము చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

Andhraprabha business 2018

బిజినెస్

BUSINESS

ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

రూ.6.95లక్షల కోట్లు

● ఏప్రిల్–జనవరిలో 19శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి కాలానికి ప్రత్యక్షపన్నుల వసూళ్లు 19.3 శాతం పెరిగి రూ. 6.95 లక్షల కోట్లకు చేరాయి. ఈ ఆర్థిక సంవత్సరం 2017-18 బడ్జెట్‌లో సవరించిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.10.05 లక్షల కోట్లలో ఇప్పటికే 69.2 శాతం పన్నులు వసూలు అయ్యాయి. జనవరి 2018 చివరి నాటికి చూస్తే క్రితం ఏడాదితో పోల్చుకుంటే ప్రత్యక్ష పన్నులు 19.5 శాతం పెరిగాయని ఆర్థికమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వివరాల్లోకి వెళితే కార్పొరేట్ ఆదాయపు పన్ను (సీఐటి)లో 19.2 శాతం వృద్ధి కనిపిస్తే.. వ్యక్తిగత ఆదాయం పన్ను (పీఐటి)లో 18.6 శాతం వృద్ధి కనిపించిందని ఆర్థికమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వివరించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి పది నెలల కాలంలో రూ.1.26 లక్షల కోట్ల రీఫండ్‌లు చేయడం జరిగిందని తెలియజేసింది.



నగదు డిపాజిట్ల పై

వివరణ ఇవ్వండి

● సవరించిన ఐటీఆర్ సమర్పించండి

● మార్చి31 వరకు గడువు

న్యూఢిల్లీ : పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకు ఖాతాల్లో పెద్దమొత్తంలో డిపాజిట్లు చేసిన వారు మార్చి 31, 2018 లోగా ఆదాయపు పన్ను శాఖకు వివరణ ఇవ్వాలని ఐటి శాఖ కోరింది. తాజాగా విడుదల చేసిన అడ్వర్టయిజ్‌మెంట్లలో పన్ను చెల్లింపుదారులు మార్చి 31వ తేదీలోగా 2015-16, 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఐటి రిటర్న్స్ దాఖలు చేయాలని కోరింది. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ నవంబర్8, 2016న రూ.500, రూ.1,000 కరెన్సీ నోట్లను రద్దుచేసింది. ప్రజలు తమ వద్ద ఉన్న రూ.500, రూ.1,000 నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయడానికి గడువు ఇచ్చింది. ఈ సమయంలో బ్యాంకుల్లో పెద్దమొత్తంలో డిపాజిట్లు చేసిన వారు తమకు ఈ డబ్బు ఎలా వచ్చిందో ఐటిఆర్‌లో వీటి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. తాజాగా ఐటి శాఖ శుక్రవారం నాడు ఇచ్చిన పత్రికా ప్రకటనలో పెద్దనోట్ల రద్దు తర్వాత పెద్దమొత్తంలో డిపాజిట్లు చేసిన వారు మార్చి 31, 2018లోగా సవరించిన ఐటిఆర్‌ను ఫైల్ చేయాలని కోరింది. సెక్షన్ 234ఏ కింది 1 శాతం వడ్డీ వసూలు చేస్తామని తెలిపింది. పన్ను చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పన్ను నిపుణులు కూడా సూచిస్తున్నారు. ప్రస్తుతం పన్ను చట్టం ప్రకారం 60 ఏళ్ల కంటే తక్కువ వయసు కలిగిన వారికి రూ.2.5 లక్షల వరకు పన్ను మినహాయింపు ఉంది. అదే 60 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు వారికి రూ.3 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటే 80 సంవత్సరాలు దాటిన వారికి రూ.5 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది.



ఈఎంఐలకు రెక్కలు!



త్వరలోనే బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లు పెంచబోతున్నాయి. ఆర్‌బీఐ రెపోరేటును యథాతథంగా కొనసాగించడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఇప్పటికే రుణాలపై 0.10 శాతం వడ్డీరేటును పెంచాయి. త్వరలోనే మిగిలిన ప్రైవేట్ బ్యాంకులు కూడా అదే దారిలో పయనించే అవకాశాలున్నాయి. ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ, సీఈవో చందా కొచ్చార్ కూడా ఇక నుంచి వడ్డీరేట్ల తగ్గింపు ఉండదని క్రమంగా పెరుగుతాయని చూచాయిగా చెప్పారు. పెద్దనోట్ల రద్దు తర్వాత బ్యాంకుల్లో పెద్దమొత్తంలో డిపాజిట్లు వచ్చినా.. అటు తర్వాత అదే జోరుతో విత్‌డ్రాలు జరిగాయి. ప్రభుత్వం తాజాగా ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు తీసుకువస్తామని ప్రకటించడంతో ప్రజలు బెంబేలెత్తి డిపాజిట్లను విత్‌డ్రా చేయడం మొదలుపెట్టారు. మొత్తానికి బ్యాంకింగ్ వ్యవస్థలో సరిపడేంత ద్రవ్యం లేదు. దీంతో బ్యాంకులు డిపాజిట్లు సేకరించి నిధులు సేకరించుకోవాలనుకుంటున్నాయి. కాబట్టి త్వరలోనే డిపాజిట్లపై వడ్డీరేట్లు పెరుగుతాయి. అదే సమయంలో రుణాలపై వడ్డీరేట్లు కూడా పెరుగుతాయి.

న్యూఢిల్లీ: రిజర్వుబ్యాంకు బుధవారం నాడు జరిగిన ద్రవ్యపరపతి సమీక్షలో కీలకవడ్డీరేట్ల పెంపు జోలికి పోలేదు. వడ్డీరేట్లను యధాతథంగా కొనసాగించడానికి నిర్ణయించింది. దీంతో బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లు పెంచాలనే ఆలోచనలో ఉన్నాయి.

ఆర్‌బీఐ కీలకవడ్డీరేట్లను పెంచకపోయినా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రం రుణాలపై వడ్డీరేట్లను పది బేసిస్‌పాయింట్లు పెంచేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎంసీఎల్‌ఆర్ ఆరు నెలల కాలానికి, ఒకటి నుంచి రెండు సంవత్సరాల కాలానికి వరుసగా 8.00 శాతం, 8.20 శాతం, 8.30 శాతం చొప్పున పెంచేసింది. ఇతర ప్రైవేట్ బ్యాంకులు యాక్సిస్ బ్యాంకు, కొటక్ మహీంద్రా, ఇండస్‌ఇండ్, ఎస్‌బ్యాంకులు కూడా ఎంసీఎల్‌ఆర్‌లు 5-10 బేసిస్ పాయింట్ల వరకు పెంచాయి. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ లేదా (ఎంసీఎల్‌ఆర్)అంటే బ్యాంకు అంత కంటే తక్కువ వడ్డీరేటుకు రుణాలు ఇచ్చే అవకాశం లేదని గుర్తించాలి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ పరేశ్ సుక్తాన్‌కర్ మాట్లాడుతూ.. గత నెలలో మూడవ త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన వెంటనే బ్యాంకు రుణాలపై వడ్డీరేట్లను పెంచిందని చెప్పారు. ఇటీవల కాలంలో డిపాజిట్‌ల కంటే రుణాల డిమాండ్ గణనీయంగా పెరిగిందని తెలిపారు. పరిస్థితులు ఇలా ఉంటే రాబోయే రోజుల్లో డిపాజిట్లపై వడ్డీరేట్లు పెరగడంతో పాటు రుణాలపై కూడా వడ్డీరేట్లు పెరుగుతాయని ఆయన అన్నారు. అయితే ఇక్కడ ఆశ్చర్యకలిగించే అంశం ఏమిటంటే ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకు ఆఫ్ బరోడా (బీఓబీ) ఎంసీఎల్‌ఆర్‌ను ఒక సంవత్సరం కంటే తక్కువ కాలపరిమితిపై 10-25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. గృహ రుణాలపై ఒక సంవత్సర కాలం ఎంసీఎల్‌ఆర్‌పై 8.30 శాతం వడ్డీ వసూలు చేస్తోంది. ప్రస్తుతం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న వారు (ఏప్రిల్ 2016) కంటే ముందు రుణాలు తీసుకున్న వారిని ఏప్రిల్1, 2018 నుంచి ఎంసీఎల్‌ఆర్ రేటుతో అనుసంధానం చేయాలని ఆర్‌బీఐ బ్యాంకులను కోరింది.

బ్యాం కింగ్ రంగానికి చెందిన నిపుణుల అంచనా ప్రకారం ఇప్ప టికి 30-40 శాతం రుణాలు బేస్‌రేటుతో అనుసం ధానం చేయబడ్డాయని చెబుతున్నారు. ప్రస్తుతం బ్యాంకు లు మొండిబకాయిలతో సతమతమవుతున్నాయి. దీనికి గాను పెద్దమొత్తంలో కేటాయింపులు జరుపుతున్నాయి. అదే సమయంలో బ్యాంకు రుణాలకు డిమాండ్ అంతంతమాత్రంగానే ఉంది. బ్యాంకులు మూలధనం కోసం ఎదురుచూస్తున్నాయి. మరో వైపు బాసిల్-3 నిబంధనలు పాటించాల్సి ఉంది. మొత్తానికి బ్యాంకులు మాత్రం ప్రస్తుతం గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి.

డిపాజిట్లపై వడ్డీరేట్ల పెంపు:

బ్యాంకులు పెద్ద మొత్తంలో నిధులు సేకరిం చుకోడానికి డిపాజిట్లపై వడ్డీరేట్లు పెంచబోతున్నాయి. త్వరలోనే డిపాజిట్‌లపై వడ్డీరేట్లతో పాటు రుణాలపై వడ్డీరేట్లు పెరుగుతాయి. ఇప్పటికే బ్యాంకులు బల్క్ డిపాజిట్ రేట్లను రూ.1 కోటి కంటే ఎక్కువ మొత్తం డిపాజిట్లపై రెండు శాతం పెంచి 6.25 శాతానికి సవరించింది. జనవరి 2015 నుంచి రిజర్వుబ్యాంకు రెపో రేటును 200 బేసిస్ పాయింట్ల వరకు కోత విధించింది. అయితే బ్యాంకులు మాత్రం వాటిని కస్టమర్లకు బదలీ చేయడంలో విఫలం అయ్యాయి. దీనిపై ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ పలుమార్లు బ్యాంకులపై మం డిపడ్డారు. ఆర్‌బీఐ వడ్డీరేట్లు తగ్గిస్తుంటే దీనికి వ్యతిరేకంగా వాణిజ్యబ్యాంకులు వడ్డీరేట్లు తగ్గించడం లేదని పలు మార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌బీఐ ఆగ్రహాన్ని గమనించిన ఎస్‌బీఐతో పాటు పలు బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయి. అయితే బేస్‌రేటు మాత్రం యధావిధిగా స్థిరంగా ... ఎంసీఎల్‌ఆర్ కంటే కాస్తా ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఒక సంవత్సరం ఎంసీఎల్‌ఆర్ స్టాండర్డ్ రేటు 7.95శాతం అయితే బేస్ రేటు మాత్రం 8.65 శాతం గా ఉంది. జనవరిలో 30 బేసిస్ పా యింట్లు తగ్గించినా ఇంకా 70 బేసిస్ పాయింట్ల వ్యత్యాసం కనిపిస్తోంది. ఇటీవలే ఐసీఐసీఐ బ్యాంకు ఎండీ సీఈవో చందా కొచ్చార్ రుణాలపై వడ్డీరేట్ల తగ్గింపు ఉండదని స్పష్టం చేశారు.

నైపుణ్యానికి పెద్దపీట

● ఉద్యోగాల్లో వారికే అవకాశాలెక్కువ ● ఈ ఏడాది 45.60 శాతం వృద్ధి ● స్కిల్ ఇండియా నివేదిక



న్యూఢిల్లీ : గతంలో మాదిరగా కాకుండా కంపెనీలు నైపుణ్యం కలిగి న వారికి ఎర్ర తివాచీ పరిచి ఉద్యోగాల్లో తీసుకుంటున్నాయి. గత రెం డేళ్ల నుంచి గమనిస్తే పరిస్థి తుల్లో గణనీయమైన మార్పులు కనిపి స్తున్నాయి. ముఖ్యంగా ఇంజి నీరింగ్, బిఫార్మా, ఎంసీఏ విద్యార్థులకు అవకాశాలు మెరుగుపడ్డాయి. ఈ ఏడాది 45.60 శాతం వృద్ధి కనిపించింది. తాజాగా ఇండియా సిల్క్ నివేదిక 2018లో ఈ అంశాలు వివరించింది. నైపుణ్యం కలిగిన వారి విషయానికి వస్తే 2014లో 33 శాతం ఉద్యోగాలు లభిస్తే ఈ ఏడాది వారి సంఖ్య 45.60 శాతానికి చేరింది. అయితే వృత్తి విద్యాకోర్సుల చదివిన వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా వస్తున్నాయని నివేదిక తెలియజేసింది. వృత్తి విద్యాకోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్ అనుభవాలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం జాబ్‌మార్కెట్ స్తబ్దుగా ఉన్న సమయంలో కంపెనీలు కూడా వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలిస్తున్నాయని పీపుల్ స్ట్రాంగ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పంకజ్ బన్సల్ చెప్పా రు.కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) నేతృత్వంలో హెచ్‌ఆర్ సొల్యూ షన్స్ అండ్ టెక్నాలజీ కంపెనీ, పీపుల్ స్ట్రాంగ్, టాలెంట్ అసెస్‌మెంట్ సంస్థ వీబాక్స్‌లు కలిసి నివేదికను రూపొందించాయి. అయితే ఇక్కడ ఆసక్తి కలిగించే అంశం ఏమిటంటే ఎంబీఏ కోర్సు చదవిన విద్యార్థులకు ఉద్యోగాలు తగ్గముఖం పట్టాయని స్పష్టం చేసింది. ఎందుకంటే ఎంబీఏ కాలేజీలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డంతో నాణ్యత తగ్గిందని చెబుతున్నారు. ప్రభుత్వం స్కిల్ డెవలెప్‌మెంట్‌ను ప్రోత్సహించడంతో కంపెనీలతో పాటు ప్రభుత్వం కూడా నైపుణ్యం కలవారిని మాత్రమే ఎంపిక చేస్తున్నాయనవ వీబాక్స్ సీఈవో వ్యవస్థాపకుడు నిర్మల్ సింగ్ చెప్పారు. ఈ నివేదిక తయారు చేయడానికి పియర్‌సన్, యునైటెడ్ నేషన్స్ డెవలెప్‌మెంట్ ప్రోగ్రాం, ఏఐసీటీఈ, ఏఐయులతో పాటు వివిధ రాష్ట్రప్రభుత్వాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 5,200 విశ్వవిద్యాలయాలు నిపుణులతో చర్చించి నివేదిక తయారు చేశారు.

సీబీఐ,ఐఓబీ ర్యాంకు పెంచిన మూడీస్



ముంబై: సంక్షోభంలో చిక్కుకున్న ప్రభుత్వరంగానికి చెందిన రెండు బ్యాంకులు సెంట్రల్ బ్యాంకు, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులకు కాలం కలిసొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం పీఎస్‌యు బ్యాంకులకు మూలధనం సమకూరుస్తామని ప్రకటించడంతో ఈ బ్యాంకులు గాడినపడే అవకాశా లున్నాయని రేటింగ్ కంపెనీ మూడీస్ ప్రకటించింది. ప్రస్తుతం ఈ బ్యాంకుల రేటింగ్ నిలకడ నుంచి అనుకూలానికి మార్చింది. దీంతో ఈ రెండు బ్యాంకు షేర్ల ధరలు స్టాక్ మార్కెట్లు ఒకశాతం వరకు పుంజుకున్నాయి. వచ్చే 12-18 నెలల కాలంలో ఈ రెండు బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని మూడీసీ శుక్రవారం నాడు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

పౌర విమానయాన రంగంలో

ఏపీకి ఎమిరేట్స్ గ్రూపు చేయూత

● అవగాహన పత్రాలపై సంతకాలు



ముంబై : ఆంధ్రప్రదేశ్ పౌరవిమానయాన రంగంలో మౌలికవసతుల అభివృద్ధి కోసంఎమిరేట్స్ గ్రూపు ఆంధ్ర ప్రదేశ్‌తో ఒప్పందం కుదర్చుకుంది. అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిన ఈ కంపెనీ ఏపీ ప్రభుత్వంతో పాటు దాని అనుబంధ సంస్థలతో ఒప్పందం కుదర్చుకుంది. ఒప్పం దం ప్రకారంగ్రూపు విమానయాన రంగానికి చెందిన ని పుణులతో కలిసి ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడ విమానాశ్రయాలు ఏర్పాటు చేయడానికి అవకాశాలున్నాయి...ఎంత పెట్టు బడులు పెట్టాలి తదితర అంశాలు చూసుకుంటుందని కం పెనీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. అవగాహన ఒ ప్పందం (ఎంఓయూ)పై ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి బోర్డు (ఏపీఈడీబీ) ఎమిరెట్స్ గ్రూపు సంతకాలు చేశాయి. ఈ రెండు గ్రూపులు కలిసి రాష్ట్రంలో విమానాశ్రయాలు అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఎక్కడ ఎక్కువగా ఉన్నాయో అధ్యయనంచేస్తాయి. కాగా గురువారం నాడు ఎమిరేట్స్ పేరు బదులు ఎథిహాద్ గ్రూపుగా ప్రకటించంది. ఎంఓ యూపై ఎమిరేట్స్ గ్రూపు చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ షేక్ అహ్మద్ బిన్ సాయీద్ అల్ ముక్తాం, ఏపీ ఈబీడీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కృష్ణ కిశోర్‌లు వారి వారి ప్రతినిధుల సమక్షంలో సంతకాలు చేశారు. ఎమిరేట్స్ గ్రూపు భార త్‌తో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెడుతోంది. ఎందు కంటే 2020 నాటికి ప్రపంచంలోనే అతి పెద్ద విమానాయాన మార్కెట్లో భారత్ మూడవ స్థానానికి చేరుకుంటుందన్న అంచనాతో ఈ పెట్టుబడులు పెడుతోంది. దేశ ఆర్థి కంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలంటే ఎయిర్‌లైన్స్ కీల కపాత్ర పోషిస్‌యని అల్ యుక్తాం ఎస్ అన్నారు. కిశోర్ మాట్లాడుతూ.. ఎమిరెట్స్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ పౌరవి మానయాన రంగం మరింత బలోపేతం అవుతుందన్నారు. ఏపీ ఆర్థిక అభివృద్ధికి ఎమిరేట్స్‌కు కూడా తన వంతు చేయూతనిస్తుందన్నారు.

రూ.13వేలకోట్ల డివిడెండ్‌కు డిమాండ్

● నేడు ఆర్‌బీఐ, సెబితో జైట్లీ భేటీ



న్యూఢిల్లీ : ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ శనివారం నాడు రిజర్వు బ్యాంకు బోర్డుతో పాటు మార్కెట్ నియంత్రణా సంస్థ సెబిని ఉద్దేశించి ప్రసంగిస్తారు. 2018-19 బడ్జెట్‌లో ఆర్థికరంగంలో తీసుకొచ్చిన పలు సంస్కరణల గురించి వారికి వివరిస్తారు. ఇదే సమావేశంలో ఆయన రిజర్వు బ్యాంకును అదనంగా రూ.13వేల కోట్ల డివిడెండ్‌ను ప్రభు త్వానికి ఇవ్వాలని కోరే అవకాశాలున్నాయి. సాధారణంగా బడ్జెట్ సమావేశాల తర్వాత ఆర్థికమంత్రి ఆర్‌బీఐ, సెబిలతో సమావేశం అవుతారు. ఈ సారిమాత్రం బాండ్ ఈల్డింగ్ పెరగడంతో పాటు వడ్డీరేట్లు పెంచుతారన్న నేపథ్యంలో జరుగుతున్న సమావేశం కాబట్టి దీనికి ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్లో ముడి చమురు క్రమంగా పెరుగుతున్నాయి. అదే సమయంలో స్టాక్ మార్కెట్లు ప్రపంచవ్యాప్తంగా కుప్పకూలుతున్నాయి. ఈ సమయంలో ఆర్థిక మంత్రి దీర్ఘకాలిక మూలధనం పెట్టుబడుల లాభాలపై పన్ను విధించడం మార్కెట్లకు రుచించలేదు. దీంతో దేశీయ మార్కెట్లకు కూడా కుప్పకూలుతున్నాయి. ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీ 3.2 శాతానికి పరిమితం చేస్తామని ప్రకటించి తర్వాత కాస్తా ఊదారత చాటి 3.5 శాతానికి పెంచడం కూడా మార్కెట్లపై వ్యతిరేక ప్రభావం పడింది. సెబిబోర్డు సమావేశంలో కేంద్రబడ్జెట్‌తో పాటు బడ్జెట్లో ప్రతిపాదించిన ఇతర అంశాల గురించి కూడా చర్చిస్తా మని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సెక్యూరిటి మార్కెట్‌కు చెందిన ప్రతిపాదనల విషయానికి వస్తే .. లిస్టెడ్ కంపెనీలు తమకు కావాల్సిన నిధులను బాండ్ల ద్వారా సేకరిం చుకోవాలనే ప్రతిపాదన ఉంది. జైట్లీ కూడా ఇదే అంశాన్ని తన బడ్జెట్ ప్రసం గంలో పేర్కొన్నారు. ఆర్థిక బిల్లు -2018 లో సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా యాక్ట్ సెక్యూరిటీ కాం ట్రాక్ట్స్ (సవరణ) చట్టం డిపాజిటరీ చట్టాన్ని ప్రతిపాదించే అవకా శాలున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.1 కోట్ల వరకు జరిమాని ఇన్వెస్టమెంట్ సలహాదారుపై రద్దే అవకాశాలున్నాయి. అలాగే స్టాక్ మార్కెట్ నిబం ధనలు పాటించని కార్పొరేట్లపై జరిమా నా రూ.5 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు విధించే అవకాశాలున్నాయి.

హెచ్‌పీసీఎల్ లాభం

రూ.1950 కోట్లు



న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసానికి స్టాండ్ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం 22 శాతం వృద్ధితో రూ.1,950 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1,590 కోట్లు. రిఫై నరీ మార్జిన్ పెరగడంతో పాటు ముడిచ మురు నిల్వల విలువ పెరగడం కంపెనీకి బాగా కలిసొచ్చిందని కంపెనీ సీఎండీ ముఖేష్‌సురానా మీడియాతో చెప్పారు. కంపెనీ వద్ద ఉన్న ముడిచమురు నిల్వల ద్వారా రూ.1,477 కోట్లు ఆదాయం సమ కూరింది. ధరలు బాగా తక్కువగా ఉన్నప్పుడు పెద్దమొత్తంలో ముడిచమురు కొనుగోలు చేయడం, ప్రస్తుతం ధరలు పెరగడంతో ఆయాచితంగా లాభాలను మూటగట్టుకుంది. టర్నోవర్ విషయానికి వస్తే రూ.62,832 కోట్లకు చేరగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.55,471 కోట్లని సురానా తెలియజేశారు.

మరో 407పాయింట్లు హరి!

● నిఫ్టీ 10,500 దిగువకు ● గ్లోబల్ మార్కెట్ల ప్రభావం



ముంబై: స్టాక్ మార్కెట్లకు శుక్రవారం ఎలాంటి ఊరట దక్కలేదు. రోజు ఏదో కారణంతో వందలకు వంద పాయిట్లు పడిపోతున్నాయి. మదుపరుల సొమ్ము వేలాది కోట్లు ఆవిరవుతోంది. ఈ వారానికి చివరి రోజైన శుక్రవారం ట్రేడింగ్‌లో ఇదే వరుస కనిపించింది. వడ్డీరేట్లు పెరుగుతాయన్న అందోళన ఒకవైపు, మరో వైపు గ్లోబల్ మార్కెట్లకు కుప్పకూలడంతో సెంటిమెంట్ ప్రకారం దాని ప్రభావం దేశీయ మార్కెట్లపై పడింది. మొత్తానికి నిఫ్టీ నెల కనిష్ఠానికి 10,500 మార్కుకు దిగివచ్చింది. సెన్సెక్స్ 407.40 పాయింట్లు క్షీణించి 34,005.76 పాయింట్ల ముగిసింది. చివరగా జనవరి 4 నాటి స్థాయి 33, 969.64 వద్ద స్థిరపడింది. మొత్తానికి చూస్తే సెన్సెక్స్ ఈ వారం 1,060.99 పాయింట్లు, నిఫ్టీ 305.65 పాయింట్ల వరకు నష్టపోయింది. ఆగస్టు తర్వాత మార్కెట్లు ఈ స్థాయిలో నష్టపోవడం ఇదే మొదటిసారి. మార్కెట్ నిపుణుల అంచనా ప్రకారం గ్లోబల్ మార్కెట్లో వడ్డీరేట్లు పెరగడం... దీంతో పాటు ద్రవ్యోల్బణం పెరగడం, ప్రపంచవృద్ధిరేటుపై అనుమానాలు.. దీర్ఘకాలిక మూలధనంపై జైట్లీ పన్ను విధించడంతో విదేశీ పెట్టుబడులు వస్తాయో రావో అనే అనుమానాలు కలిసి ఈ వారం మార్కెట్లను ముంచేశాయని చెబుతున్నారు. వరుసగా రెండో వారం అమెరికా నిరుద్యోగుల సంఖ్య పెరిగింది. అదే సమయంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని పేర్కొంటోంది. ఇవన్నీ కలసి ద్రవ్యోల్బణం పెరగడానికి దారి తీస్తాయని..దీంతో పాటు అమెరికాలో వడ్డీరేట్లు పెరుగుతాయన్న ఆందోళన కనాడా ఉంది. ఒక వేళ అమెరికాలో వడ్డీరేట్లు పెరిగితే అభివృద్ధి చెందుతున్న మార్కెట్లనుంచిపెట్టుబడులు అమెరికాకు తరలిపోవడం గ్యారంటీ! గ్లోబల్ మార్కెట్లో వడ్డీరేట్లు పెరిగితే మాత్రం భారతీయ మార్కెట్లే కాకుండా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లవైపు ఇన్వెస్టర్లు కన్నెత్తి చూడరని మార్కెట్ నిపుణులు స్పష్టంగా చెబుతున్నారు. బాండ్లపై ఈల్డింగ్ పెరగడంతో బ్యాంకు వడ్డీరేట్లు పెరుగుతాయన్న అంచనాతోబ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు బాగా క్షీణించాయి. ఎస్‌బ్యాంకు, ఐసీఐసీఐ బ్యాంకులు వరుసగా 2.84 శాతం, 2.33 శాతం వరకు నష్టపోయాయి. ఇతర బ్యాంకుల విషయానికి వస్తే హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు, కొటక్ బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ, విప్రో, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, అదానీపోర్ట్స్, ఎల్ అండ్‌టి, ఇండస్‌ఇండ్ బ్యాంకు, హీరోమోటోకార్ప్, మారుతి సుజుకి, బజాజ్‌ఆటో, ఐటీసీ, లిమిటెడ్, రిల్, ఎంఅండ్‌ఎం, ఒఎన్‌జీసీ, ఎన్‌టీపీసీలు 2.13 శాతం వరకు నష్టపోయాయి. దీనికి వ్యతిరేకంగా టాటాస్టీల్, ఏషియన్ పెయింట్, డాక్టర్‌రెడ్డీస్, టీసీఎస్, హిందుస్తాన్ యూనీలీవర్, కోల్ ఇండియాలు 1.83 శాతం వరకు లాభపడ్డాయి. ఇక గ్లోబల్‌మార్కెట్ల విషయానికి వస్తే ఆసియా మార్కెట్లతో మిశ్రమ స్పందన కనిపించింది.

ఎస్‌బీఐ మొండిబకాయిలు

రూ.1.99 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్ ఎలోన్ ప్రాతిపదికన నికరనష్టం రూ. 2,416.37 కోట్లు నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమా సికంలో రూ.2,610 కోట్లు చూపిం చింది. సంవత్సరం ప్రాతపదికన మొండి బకాయిలకు కేటా యిం పులు రూ.18,876.21కోట్లు కేటా యిస్తే.. అంతకు ముందుఏడాది ఇదే కాలంలో రూ.8,942.73కోట్లు కేటాయించింది. గరిష్టంగా మొండిబకాయిలు రూ.1.99 లక్షలకోట్లు అయితే క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1.86 లక్షల కోట్లుగా ఉంది.

ఐదు రెట్లు పెరిగిన టాటాస్టీల్ లాభం

న్యూఢిల్లీ : టాటాస్టీల్ లాభం క్యూ3లో ఐదు రెట్లు పెరిగి రూ. 1136 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.232 కోట్లు మాత్రమే. కాగా రెవెన్యూ రూ. 33,477 కోట్లకు చేరగా.. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 15 శాతం వృద్ధి కనిపించింది.

యమహా కొత్త బైక్ వైజెడ్ఎఫ్ ఆర్–3

● ధర రూ.3.84లక్షలు



గ్రేటర్‌నోయిడా : ఇండియా య మహా మోటార్ (ఐవూఎం) శుక్ర వారం నాడు కొత్త స్పోర్ట్స్‌బైక్ వైజెడ్ఎఫ్ -ఆర్3ని మార్కెట్లో విడుదల చేసింది. దీని ప్రారంభం ధర రూ.3.48 లక్షలు (ఎక్స్ షోరూం ఢిల్లీ). ఈ బైక్‌కు డ్యూయెల్ చానల్ యాంటీ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చింది. అయితే ఈ బైక్ ఎంపిక చేసిన యమహా డీలర్ల వద్ద మాత్రమే లభిస్తుంది. ఈ బైక్‌ను ఇక్కడ జరుగుతున్న ఆటోఎక్స్‌పోలో బాలీవుడ్ స్టార్, యమహా బ్రాండ్ అంబాసిడర్ జాన్ అబ్రహాం ముందు ఆవిష్కరించారు. కంపెనీ చైర్మన్ మోటోఫుమి షిటారా మాట్లాడుతూ.. కొత్త మోడల్ బైక్‌లకు డ్యూయెల్ ఏబీఎస్‌ను అందుబాటులోకి తెచ్చి కస్టమర్లకు బైక్ నడపడంలో సరికొత్త అనుభూతిని తీసుకువస్తామన్నారు. డ్యూయెల్ ఏబీఎస్ టెక్నాలజీ ద్వారా చిత్తడిరోడ్లపై బైక్ స్కిడ్ కాకుండా ఆపుతుందని ఆయన వివరించారు. ఈ బైక్ 4 స్ట్రోక్ ఇంజిన్, 321 సీసీ ఫ్యూయెల్ ఇంజెక్టెడ్ ఇంజిన్ అని చెప్పారు. రెట్టింపు వాటాకు హోండా కసరత్తుజపాన్‌కు చెందిన కార్ల తయారీ కంపెనీ హోండామోటార్ కంపెనీ వచ్చే కొన్ని సంవత్సరాల్లో మార్కెట్ వాటాను రెట్టింపు చేసుకో వాలని ప్రణాళికలు రూపుదిద్దుతోంది. భారతీయ మార్కెట్లో కీలక పాత్రపోషించాలంటే పదిశాతం వాటాను దక్కించుకోవాల్సి ఉంటుందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ యుచిరో యూనో ఇక్కడ జరుగుతున్న ఆటో షోలో మాట్లాడుతూ చెప్పారు. భార తీయ మార్కెట్లో సిటి సెడాన్, సీఆర్-వీ స్పోర్ట్ యుటిలిటి వాహ నాలను విక్రయిస్తోంది. 2017 చివరి నాటికి భారత్ మార్కెట్లో వాటా 5 శాతానికి పడిపోయింది. అంతకు ముందు ఏడాది ఏడు శాతంగా ఉంది. దీనికి ప్రధాన కారణం దీనికి పోటీ కంపెనీలైన మారుతి సుజుకితో పాటు హ్యుందాయ్ మోటార్‌లు కొత్త కొత్త మోడల్స్‌ను తీసుకువచ్చి కస్టమర్లను ఆకర్షించాయి. గతేడాది భారత్‌లో 30 లక్షల కార్లు విక్రయించబడ్డాయి. 2020 నా టికి ప్రపంచంలో అత్యధి కంగా కార్లు అమ్ముడుపోయే మార్కె ట్లో భారత్ మూడవ స్థానానికి చేరు తుంది. ప్రస్తుతం అమెరికా, చైనాలు అగ్రస్థానాల్లో ఉన్నాయి.

గ్రీన్‌కార్ల హవా!

ఇక్కడ జరుగుతున్న ఆటోఎక్స్‌పో -2018లో ఎలక్ట్రిక్ కార్ల హవా కనిపిస్తోంది. మహీంద్రా ఎలక్ట్రిక్ ప్రభుత్వం ఎలక్ట్రిక్ కార్ల ప్రకటనకు ముందే రూ.482 కోట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. దీంతో పాటు వచ్చే మూడు సంవత్సరాల కాలంలో రూ.550 కోట్ల వరకు పెట్టుబడులు పెడతామని మహీంద్రా ఎలక్ట్రిక్ సీఈవో మహేశ్‌బాబు చెప్పారు. మారుతి సుజుకి, టాటామోటార్స్‌లు కూడా ఎలక్ట్రిక్ కార్ల రంగంలో ఎంట్రీ ఇవ్వాలనుకుంటున్నాయి.



నర్సులు వైద్యం చేయవచ్చు!

● వృత్తి నైపుణ్యం పెంచేందుకు శిక్షణ ● త్వరలో మార్గదర్శకాలు ● ఆచరణకు కేంద్రం సంసిద్ధత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నర్సులకు మంచిరోజులొచ్చాయి. వైద్యులకు పనిభారం తగ్గించడంతో పాటు రోగులకు వెంటనే సత్వర చికిత్స అందించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన మార్పును తీసుకురావాలని నిర్ణయించింది. నర్సింగ్ విద్యలో మౌలిక మార్పునకు కేంద్ర నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉంది. కోర్సులో ఏకీకృత విధానంతో పాటు క్రమేపీ జీఎన్ఎం వ్యవస్థను రద్దు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా కీలక నిర్ణయం తీసుకోవడానికి పలు రాష్ట్రాల నిర్ణయం కోసం లేఖలు రాసింది. చాలావరకు దీనికి పలు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా సమ్మతం వ్యక్తం చేసినట్టు తెలిసింది. త్వరలోనే దీనికి సంబంధించిన విధి విధానాలను ఖరారు కానున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అన్ని రాష్ట్రాల్లోని నర్సుల స్థితిగతులపై వారి పనితీరుపై ఆరా తీసినట్టు తెలిసింది. ఒకవేళ ఈ కోర్సు అమలయితే నర్సులతో పీహెచ్‌సీల్లో లేదా జిల్లా ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తారా అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో సహజకాన్పులను (మిడ్‌వైఫరీ) ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నర్సులకు శిక్షణా తరగతులను సైతం ప్రారంభించింది.

గతంలోనూ ఇలాంటి ప్రతిపాదన వచ్చినా పలు కారణాల వలన దానిని పక్కకు పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం దీనిపై సాధ్యా సాధ్యాలను పరిశీలించి అమలు చేయాలని ఆలోచనలో కేంద్రం ఉంది. అందులో భాగంగానే నర్సులతో ప్రత్యేక వైద్య సేవలు అందించే విధంగా వారికి గుర్తింపు పరీక్షలు నిర్వహించాలన్న ఆలోచనలో ఉంది. ఇప్పటివరకు వైద్యులు మాత్రమే రోగులను పరీక్షిస్తూ వస్తున్నారు. పీహెచ్‌సీలలో నర్సులే కీలకపాత్ర పోషించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆపరేషన్‌పై వారికి అవగాహన

ఇప్పటివరకు ఇంటర్మీడియట్ పాసైన వారితో పాటు బీఎస్సీ నర్సింగ్ చేసిన వాళ్లను కూడా ఇంటర్మీడియట్ ప్రాతిపదికన నర్సుగా రిక్రూట్‌మెంట్ చేస్తున్నారు. వైద్యులకు సాయంగా నర్సులే కీలకపాత్ర పోషిస్తున్నారు. సీనియర్ నర్సులకు ప్రతి ఆపరేషన్‌పై అవగాహన ఉండడంతో పాటుగా వైద్యుడిపై ఒత్తిడి తగ్గించేందుకు వీరు కృషి చేస్తున్నట్టు ప్రభుత్వం గుర్తించింది. అయితే నర్సులు కూడా బోర్డులు పెట్టుకొని వైద్యవృత్తిని కొనసాగించడానికి పర్మిషన్ ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. నర్సు ప్రాక్టీషనర్ కోర్సు పేరిట వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిశ్చయంతో ఉంది.

భారతీయ నర్సింగ్ మండలికి ఆదేశాలు జారీ

నర్సు ప్రాక్టీషనర్ కోర్సు పేరిట వారికి శిక్షనిచ్చి వారు వైద్య సేవలు చేసేలా ఆదేశాలిచ్చినా అవి ఎంతమేర సత్ఫలితాలు ఇస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీనికి వైద్యుల నుంచి ఎలాంటి ఒత్తిడులు వస్తాయో, ప్రజలు ఏ విధంగా దీనిని రిసీవ్ చేసుకుంటారో అన్న అంశంపై కూడా ప్రభుత్వం సీరియస్‌గా ఆలోచిస్తుంది. దానికి సంబంధించిన విధివిధానాలు త్వరలో ఖరారు కానున్నట్టు తెలిసింది. ఈ విధి విధానాలు బయటకు వచ్చిన తరువాత స్పందిస్తామని కొందరు డాక్టర్లు పేర్కొంటున్నారు. ఈ విషయమై జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులతో చర్చించి దీనికి సంబంధించిన నియమ నిబంధనలు రూపొందించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలు పంపింది. ఈ సంవత్సరం ఏప్రిల్ లోగా నర్సుల ప్రాక్టీసు కోర్సును ప్రారంభించాలని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఇప్పటికే భారతీయ నర్సింగ్ మండలి (ఐఎన్‌సీ)ని ఆదేశించింది. దీంతో పాటు నర్సు ప్రాక్టీషనర్ కోర్సు ఇన్ క్రిటికల్ కేర్ (ఎన్‌పీసీసీ) కూడా ప్రారంభించేందుకు ఇప్పటికే 50 కళాశాలలు ముందుకొచ్చాయి.

తెరపైకి ఏకీకృత విధానం

జాతీయ స్థాయిలో నర్సుల్లో వృత్తి నైపుణ్యాలను పెంపొందించే దిశగా శిక్షణను అభివృద్ధి చేయాలని కేంద్ర నిర్ణయించింది. ఏకీకృత విధానం ప్రస్తుతం నర్సింగ్ విద్యలో కొనసాగుతున్న జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) మున్ముందు కొనసాగించకూడదని కేంద్రం నిర్ణయించింది. జీఎన్ఎం డిప్లమా కాగా బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సును నిర్వహిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని తొలగిస్తూ నర్సింగ్ కోర్సులోకి ఏకీకృత విధానాన్ని తెరపైకి తీసుకొస్తుంది. ప్రస్తుత మున్న జీఎన్ఎం కోర్సులను కళాశాలలు దశలవారీగా 5 సంవత్సరాల్లో బీఎస్సీ నర్సింగ్‌గా రూపాంతరం చెందాల్సి ఉంటుంది. 2022 సంవత్సరంలోగా ఈ దిశగా చర్యలు చేపట్టాలని భారతీయ నర్సింగ్ మండలిని కేంద్రం ఆదేశించింది. నచ్చిన వైద్య సేవల్లో భాగంగా వేర్వేరు విభాగాల్లో పనిచేయాల్సి వస్తుంది. ఈ సందర్భంగా ప్రత్యేక నైపుణ్యానికి సంబంధించి అర్హత పరీక్షను నిర్వహించనుంది. అన్ని రాష్ట్రాల్లోనూ నర్సింగ్ కోర్సు చేసిన అభ్యర్ధుల సమాచారాన్ని రాష్ట్ర నర్సింగ్ మండలిలో ఏకీకృత విధానంలో నమోదు చేసుకోవాలని జాతీయ ఆరోగ్య విధానం సూచించింది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో నర్సుల నమోదు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశం చింది. ప్రస్తుతం దీనికి సంబంధించి కొన్ని రాష్ట్రాల్లో అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

మాకన్నా అదృష్టవంతులు ఉండరు: జి.నిర్మల, హెడ్‌నర్సు, నిమ్స్

ఆస్పత్రుల్లో నర్సులే కీలకపాత్ర పోషిస్తారు. అందరికన్నా కష్టపడేది కూడా నర్సులే. ఒకవేళ ఈ కోర్సు ఆమోదం పొందితే మాకన్నా అదృష్టవంతులు ఉండరు. ప్రతిరోజు రోగులను చూసి ఏ వ్యాధికి ఏ మందులు ఇవ్వాలే మాకు తెలిసిపోతుంది. నర్సులకు అనేక సమస్యలు ఉన్నాయి. ప్రతి దవాఖానలో 50 రోగులకు ఒక నర్సు పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో నర్సింగ్ చేయడానికి చాలామంది మహిళలు ఆసక్తి చూపడం లేదు.

మాకే ఎక్కువ బాధ్యత: విజయసుశీల, హెడ్‌నర్సు, ఉస్మానియా ఆస్పత్రి

ఓపీలో బీపీ, షుగర్ టెస్టులతో మేమే చేస్తాం. వైద్యులకు రోగుల తాకిడి ఉన్నప్పుడు మేమే చూడాల్సి ఉంటుంది. ఉదాహరణగా చెప్పాలంటే ఎంబీబీఎస్ సీట్లు 200 ఉంటే బీఎస్సీ నర్సింగ్ సీట్లు 60 మాత్రమే ఉంటాయి. ఈ కోర్సు ఒకవేళ ప్రారంభించాలనుకుంటే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న నర్సుల పోస్టులను భర్తీ చేయాలి. టీచింగ్, నాన్‌టీచింగ్ బోధనా ఆస్పత్రుల్లో నర్సింగ్ సీట్లను పెంచాలన్నది మా డిమాండ్.

ఆందోళన బాటలో ఆర్టీసి కార్మికులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్టీసీలో కనీస వేతనం రూ. 23 వేలు ప్రకటించడంతో పాటుగా 75 శాతం ఫిట్మెంట్‌తో మాస్టర్ స్కేల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన బస్ భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ బస్ డిపోల ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున ధర్నాలు, ప్రదర్శనలు జరిపారు. పే స్కేల్ సవరణ, బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక నిధుల కేటాయింపు, రెగ్యులేషన్స్ సవరింపు డిమాండ్ చేస్తూ కార్మికులు నినాదాలు చేశారు. బస్ భవన్ ఎదుట జరిగిన ధర్నాలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్. రావు ప్రసంగించారు. ఆర్టీసీలో వేతన సవరణ 2017 ఏప్రిల్ నుండి అమలు కావలసి ఉందన్నారు. ఆర్టీసీలో కనీస వేతనం రూ.23 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. 75 శాతం ఫిట్మెంట్‌తో మాస్టర్ స్కేల్ అమలు జరపవలసి ఉందన్నారు. 2018 -19 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసీకి రూ. 1500 కోట్లు కేటాయించడంతో పాటుగా నెల నెలా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించవలసి ఉందన్నారు. నష్టాలను ప్రభుత్వం భరించాలని ప్రచార కార్యదర్శి పి. రవీందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఆర్థిక పరిపుష్టిని మెరుగుపర్చడానికి వి.వి.గిరి నేషనల్ ఇనిస్టిట్యూట్ చేసిన సిఫార్సులను అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. సకల జనుల సమ్మె కాలాన్ని పని రోజులుగా గుర్తించాలని, కార్మికులకు రూ. 10 లక్షల వరకు గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేయాలని, సంస్థలో ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, మహిళా కండక్టర్లకు ప్రత్యేక డ్యూటీ చార్టులు వేయాలని, ఆర్టీసీ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీగా అభివృద్ధి పర్చాలని, కార్మికుల తల్లి, దండ్రులకు కూడా కార్పోరేట్ వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా....... న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని ఆర్టీసీ ఉన్నతాధికార వర్గాలు తెలిపాయి. కార్మికుల కృషి ఫలితంగానే ఆర్టీసీ ఇప్పుడిప్పుడే నష్టాలను అధిగమిస్తుందన్నారు. ఇప్పటికిప్పుడు వేతన భారం భరించే పరిస్థితిలో ఆర్టీసీ లేదని అధికారులు పేర్కొన్నారు.

22న ఛలో బస్ భవన్

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న ఛలో బస్ భవన్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. బస్ భవన్ ముట్టడి ప్రచార పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. బస్ భవన్ ముట్టడిలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

13న ఫ్రెంచ్ కళాకారుల ప్రదర్శన



ఫ్రెంచ్ కళాకారుల ప్రదర్శన బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి చందూలాల్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఈ నెల 13న పీపుల్స్ ప్లాజాలో ఫ్రెంచ్ ఏరియల్ షో నిర్వహిస్తున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. భారత్ - ఫ్రెంచ్ దేశాల మధ్య సాంస్కృతిక ఒప్పందంలో భాగంగా బోంజోర్ ఇండియా 2018 ఉత్సవాలు దేశంలోని 33 నగరాలలో జరుగుతున్నాయని, భారత్‌లో తొలి ప్రదర్శన హైదరాబాద్‌లో నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఫ్రెంచ్ సాంస్కృతిక సంస్థ ట్రాన్స్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన సుమారు 18 మంది కళాకారులు నగరంలో నిర్వహించే సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొంటారని మంత్రి పేర్కొన్నారు. పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, ఈ ప్రదర్శనలో సంగీతం, నృత్యం, సర్కస్, క్రాఫ్ట్, ఆర్కెస్ట్రా కళాకారులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించబోతున్నారని వివరించారు. ఫ్రెంచ్ ప్రభుత్వ నిధులు దాదాపు కోటి రూపాయలతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. నగర వాసులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇండో - ఫ్రెంచ్ ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలలో భాగంగా కార్యక్రమాలు హైదరాబాద్‌లో నిర్వహించడం జరుగుతుందని ప్రభుత్వ సలహాదారు పాపారావు తెలిపారు. కార్యక్రమంలో ఫ్రెంచ్ ట్రాన్సెస్ ఎక్స్‌ప్రెస్ సంచాలకులు ఎమిలిన్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో శివరాత్రి రోజున సాంస్కృతిక కార్యక్రమాలు

భూపాలపల్లి జిల్లాలోని రామప్ప దేవాలయంలో శివరాత్రి సందర్భంగా పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. రామప్ప దేవాలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు సాధించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని వివరించారు. మహాశివరాత్రి నాడు రామప్ప దేవాలయంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో రాత్రి అంతా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివస్తున్నందున తగిన ఏర్పాట్లు చేస్తున్నామని పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు.

సుబాబుల్ రైతులను ఆదుకోండి

● మంత్రి హరీష్‌రావుకు టీడీపీ నేతల వినతి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సుబాబుల్, జమాయిల్ వేసిన రైతులు గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం జోక్యం చేసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలని మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీష్‌రావుకు తెలుగుదేశంపార్టీ తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని దాదాపు రెండున్నర లక్షల ఎకరాల్లో జామాయిల్ సాగు చేస్తున్నారని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో కూడా పెద్దఎత్తున సాగు పెరిగిందని, వీరికి గిట్టుబాటు కాకపోవడంతో నష్టపోతున్నారని తెదేపా నేతలు ఆయన దృష్టికి తెచ్చారు. సుబాబుల్, జామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ పార్టీ శాసనసభ్యుడు సండ్ర వెంకటవీరయ్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి, బిఎన్‌రెడ్డి తదితరులు శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ రెండు తోటల సేద్యానికి ఎకరాకు రూ.30వేలకుపైగా ఖర్చవుతుందని, బిపిఎల్ కంపెనీ టన్నుకు రూ.5,500 ఇచ్చేందుకు గతంలో ఒప్పందం చేసుకుందని వారు మంత్రి దృష్టికి తెచ్చారు. అయితే దళారుల రూ.2వేలకే కొనుగోలు చేస్తున్నారని, దీంతో రైతులకు కనీస పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని వారు ఆందోళన వ్యక్తంచేశారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

● మొదటిసారి సిద్దిపేటలో టీ-20 క్రికెట్ టోర్నీ ● పదిరోజులపాటు కొన సాగనున్న పోటీలు ● క్రీడలను ప్రోత్సహిస్తున్న కేసీఆర్:మంత్రి హరీష్‌రావు



సిద్దిపేట, ప్రభన్యూస్ : తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అన్ని జిల్లాల్లో క్రీడా మైదానాలను అభివృద్ది చేయడం జరుగుతుందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట మినీ స్టేడియంలో జి.వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ టీ-20 లీగల్ మ్యాచ్‌ను రాష్ట్ర ప్రభుత్వసలహాదారు వివేకేతో కలిసి ఆయన ప్రారంభించారు. ఇందులో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 10 టీంలు ఆడనుండగా మెదక్ వర్సెస్ ఖమ్మంలు మొదటి ఆటను ఆడగా ఖమ్మం టాస్ గెలుపుకుని బ్యాటింగ్‌ను ఎంపి కుంది. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడా రంగాన్ని బలోపేతం చేయడానికి క్రీడా మైదానాలను అభివృద్ధి పరిచి క్రీడా కారులకు ఇంటి స్థలంతో పాటు ఎన్నో ప్రోత్సాహకాలు కల్పిస్తు న్నారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే మొట్ట మొదటిసారిగా ముం బాయి, ఢిల్లీ, హైదరాబాద్‌లాంటి మహా నగరాల్లో కాకుం డా సిద్దిపేటలో జరుగడం గర్వించదగ్గ విషయమన్నారు.సిద్దిపేట స్టేడియంలో క్రికెట్‌తో పాటు టెన్నిస్‌లాంటి మరెన్నో జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహిం చే విధంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. పది రోజుల్లో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసి రాత్రింబవళ్ళు క్రీడలు జరిగే విధంగా స్టేడియాన్ని తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు.మంత్రి ప్రొద్బలంతోనే ఇక్కడ ఈ పోటీలు ఏర్పాటు చేసి ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తామన్నారు. ఇంత మంచి స్టేడియాన్ని తీర్చిదిద్దిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు మంత్రి హరీశ్‌రావు, వివేక్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి క్రికెట్ ఆడారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ ఆగం రావు, మాజీ మంత్రి వినోద్, మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, వైస్ చైర్మన్ అక్తర్‌పటేల్, కౌన్సిలర్లు పూజల చిన్న, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి బర్ల మల్లికార్జున్, చిప్ప ప్రభాకర్, శ్రీనివాస్‌యాదవ్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జట్టుపై మెదక్ గెలుపు

ఐపీఎల్ మ్యాచ్‌లకు తీసిపోని విధంగా సిద్దిపేటలో శుక్రవారం జరిగిన టీ-20 మ్యాచ్‌కు ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. సిద్దిపేటలో తొలిసారిగా జరిగిన ఆరంభమ్యాచ్‌కు వేల సంఖ్యలో క్రికెట్ అభిమానులు హాజరుకావడంతో భారీ సందడి నెలకొంది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన తొలి మ్యాచ్‌లో మెదక్ మెవరిక్స్ ఖమ్మం టెరా జట్టు తలపడ్డాయి.కాగా ఈ మ్యాచ్‌లో ఖమ్మం జట్టుపై మెదక్ అలవోకగా విజయం సాధించింది. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వివేక్, మెదక్ మెవరిక్స్ జట్టు యజమాని జగన్‌మోహన్, మున్సిపల్ చైర్మన్ రాజనర్సులు హాజరయ్యారు.

పీహెచ్‌డీ ఎంట్రన్స్‌లకు ఓకే

హైదరాబాద్,ఆంధ్రప్రభ: పీహెచ్‌డీ అడ్మిషన్లపై ఉన్నత విద్యా మండలి వేసిన కమిటీ తన నివేదికను సిద్ధం చేసింది. విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకోసం ఎటువంటి విధానం అవలంభించాలనే దానిపై కమిటీ నివేదికను సిద్ధం చేసింది. త్వరలో దీన్ని ఉన్నత విద్యా మండలి చైర్మన్‌కు కమిటీ నివేదికను ఇవ్వనున్నట్టు సమాచారం. నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) గుర్తింపు ఉండి ఏ, ఏ ప్లస్ గ్రేడ్ పొందిన యూనివర్సిటీలు పీహెచ్‌డీ ప్రవేశాల కోసం సొంతంగా ప్రవేశ పరీక్షను నిర్వహించుకోవచ్చనే ప్రతిపాదనను కమిటీ సిఫారసు చేయనున్నట్లు సమాచారం. అయితే వీరు కూడా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) పీహెచ్‌డీ అడ్మిషన్లకోసం 2009లో రూపొందించిన నిబంధనలకు లోబడే వీటిని అమలు చేయాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో న్యాక్ గుర్తింపు ఉండి ఏ ప్లస్ గ్రేడ్ ఒక్క ఉస్మానియా యూనివర్సిటీకే మాత్రమే ఉంది. కాకతీయ, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలకు న్యాక్ గుర్తింపుతోపాటు ఏ గ్రేడ్ ఉంది. కమిటీ సిఫారసుల మేరకు ప్రవేశ పరీక్ష నిర్వహించుకోవాలనుకుంటే ఈ మూడు యూనివర్సిటీలు పీహెచ్‌డీ అడ్మిషన్లకోసం ఎంట్రన్స్ పరీక్షను నిర్వహించుకునే వీలు ఉంటుంది.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభ డిమాండ్ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు 2.20 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారని అసోసియేషన్ నేతలు తెలిపారు. శుక్రవారం జరిగిన మహాసభకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా హాజరయ్యారు. మహాసభకు గుజ్జకృష్ణ అధ్యక్షత వహించగా అసోసియేషన్ నేతలు కె శ్రీనివాస్, యం శ్యాంకుమార్, ఎండి మన్సూర్, గడ్డం వెంకట్, భూపేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడానికి న్యాయపరమైన వివాదాలు వస్తున్నందున అసెంబ్లీలో చట్టం చేయాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులతోపాటు డైలీవేజ్, పార్ట్ టైం, ఎన్ఎంఆర్, కంటిన్‌జెన్సీ తదితర టెంపరరీ ఉద్యోగులను కూడా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్ రద్దు చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరించిన పిఆర్‌టియు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగించే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)ను రద్దు చేయాలని పిఆర్‌టియు డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు చేపడుతున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి చెన్నకేశవరెడ్డి తెలిపారు. సంఘం 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని సంఘం రాష్ట్రం కార్యాలయం ఉన్న నారాయణగూడలో జెండాను ఆవిష్కరించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27న ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్సీలు పూలరవీందర్, కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని 1.20 లక్షల మంది ఉద్యోగు, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నష్టం కలిగించే సీపీఎస్‌ను రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లింపు ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు.

ఈ-వే బిల్లులు తప్పనిసరి

వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ అనిల్ కుమార్

ఆంధ్రప్రభ, హైదరాబాద్: సరుకు రవాణా వాహనాలు తప్పనిసరిగా ఇ-వేబిల్లులను కలిగి ఉండాల్సిందేనని వాణిజ్యపన్నుల శాఖా కమిషనర్ వి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈనెల10వ తేదీ నుంచి ఇ-వే బిల్లుల విధానం అమల్లోకి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. రూ.50 వేలకు మించిన సరుకును రవాణా చేసే ప్రతి వాహనం ఇ-వే బిల్లులను కలిగి ఉండాల్సిందేనని, ఇ-వే బిల్లులను టీజీసీటీ వెబ్‌సైట్‌ద్వారా పొందాలని ఆయన సూచించారు.

కీలక టెక్నాలజీగా వివిఫ్ఎక్స్

ఐటీ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : బ్రిటిష్ హైకమిషన్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం గేమింగ్, ఇమెర్సివ్ టెక్ సమ్మిట్‌ను శుక్రవారం నిర్వహించింది. యానిమేషన్, గేమింగ్, వివిఫ్ఎక్స్ పరిశ్రమ అభివృద్ధితో టెక్నాలజీ ఎక్స్‌పోర్ట్స్, ఉపాధి కల్పనకు ప్రధాన భూమికలుగా నిల్వనున్నట్లు ప్రభుత్వం గుర్తించింది ఐటి ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. ఏవిసిజిఐ ఎకో సిస్టమ్‌ను విస్తృత స్థాయిలో రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, రాష్ట్రం టెక్నాలజీపరంగా యానిమేషన్, గేమింగ్, ఇతర టెక్నాలజీలకు ఆసియా ఫసిపిక్ రీజియన్‌లోనే ఒక హబ్‌గా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇమేజ్ పాలసీ కింద మార్కెట్ డవలప్‌మెంట్ అసిస్టెన్స్ (ఎండిఎ) ప్రోగ్రామ్‌ను చేపడుతుందని, దీనిద్వారా ఏవిసిజిఐ పరిశ్రమను ప్రోత్సహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎండిఎలో అమలులో భాగంగా యుకేసైన్స్ అండ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్, యుకే ఇంటర్నేషనల్ ట్రేడ్ శాఖ ఈ సమ్మిట్‌ను నిర్వహించిందని జయేష్ రంజన్ తెలిపారు.

14 నుంచి హెరిటేజ్ జైలు వారోత్సవాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సంగారెడ్డిలోని హెరిటేజ్ జైలును ఈ నెల 14 నుంచి19 వ తేదీ వరకు అందరికీ అందుబాటులో ఉంచనున్నారు. హెరిటేజ్ జైల్ వారోత్సవాలను పురస్కరించుకుని సామాన్యులందరికీ జైలు సందర్శనకు అనుమతించనున్నట్లు జైళ్ళ శాఖ డిజి వికె సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఈ జైలు దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించిన విషయం తెలిసిందే. వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు పలు అంశాలలో పోటీలను నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను 14 వ తేదీన జైళ్ళ శాఖ డిజి ప్రారంభించగా, 19 వ తేదీ ముగింపు కార్యక్రమంలో హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి పాల్గొం టారని పేర్కొన్నారు. ముగింపు ఉత్సవంలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులను అందించనున్నారు.

తెలంగాణ క్రీడగా కర్రసాము



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికీ ప్రసిద్ది చెందిన కర్రసాము (సిలబమ్)ను తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడగా గుర్తించింది. సిలబమ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా చలన చిత్ర అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డిసి) ఛైర్మన్ పి. రామ్మోహన్‌రావును ఎన్నుకున్నారు. ఎఫ్‌డిసిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిలబమ్ జాతీయ అధ్యక్షుడు, తమిళనాడు రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీస్ ఎన్నికల కమిషనర్ రాజేంద్రన్‌తో కలిసి రామ్మోహన్‌రావు, క్రీడాప్రాధికార సంస్థ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కర్రసాము గ్రామీణ ప్రాంతాలలో ప్రసిద్ధి చెందిందని, అయినప్పటికీ ప్రభుత్వాలు ప్రోత్సహించలేదన్నారు. ఈ క్రీడను దేశంలోని 22 రాష్ట్రా లలో గుర్తించారని, 23 వ రాష్ట్రంగా తెలంగాణ కూడా గుర్తించిందన్నారు. రానున్న కాలంలో మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో పోటీలను నిర్వహిస్తామని, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లను కూడా వర్తింప చేస్తామని చెప్పారు. ప్రపంచంలోని తొమ్మిది దేశాలలో ఈ క్రీడ ప్రసిద్ధి చెందిందని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి ఔత్సాహికులను గుర్తించి రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నామన్నారు. కరాటే తరహాలో కర్రసాము క్రీడ స్వయం రక్షణకు కూడా ఉపయోగపడుతుందని, మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

నా చుట్టూ తిరిగినోళ్లే సీఎంలయ్యారు?

- ప్రజా జీవితంలో హుందాగా ఉండాలి : సీఎల్పీనేత జనారెడ్డి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రజా జీవితంలో ఉన్న ప్పుడు హుందాతనంగా వ్యవహారించాల్సి ఉంటుందని సీఎల్పీ నేత జానారెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ను లోఫర్ పార్టీ అని మంత్రి కేటీఆర్ చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పైన , రాహుల్ గాంధీపైన కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు జుగుప్సా కరంగా ఉన్నాయని ఆయన మండి పడ్డారు. టీఆర్ఎస్‌ను కూడా ప్రజలు బ్రోకర్ పార్టీ అనుకుంటున్నారని, దీనికి ఆ పార్టీ నేతలు ఏమని సమాధానం చెబుతారని ఆయన నిలదీశారు. రోజు నాచుట్టు తిరిగినొళ్లే సీఎంలు, మంత్రులు అయ్యారని, వారి హోదాకు గౌరవం ఇవ్వాలి కదా.? వారిని చులకనగా చూస్తానా..? అంటూ జానారెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన అసెంబ్లీ ఆవరణలోని మీడియా హాల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, సంపత్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ నతేలను కాలిగోరుతో పోల్చితే.. కాళ్లు పట్టుకున్న వాళ్లను ఏమనాలని ఆయన ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ మాటలు చూస్తుంటే రాజకీయ అహంకారం, దిగజారుడు తనానికి నిదర్శన మనిస్తోం దన్నారు. ఎదుటివారిని చులకచేస్తే పెద్దవారవు తామనుకోవడం సరికాదని ఆయన హితవు పలికారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కి కనీస గౌరవం ఇవ్వకపోవడం బాధిస్తోందన్నారు. దేశంలోని 130 కోట్ల మందికి రాహుల్‌గాంధీ నాయకుడని, రెండు సార్లు ప్రధానమంత్రి పదవికి అవకాశం వచ్చినా వదులుకున్నాడని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన గుజరాత్ ఎన్నికల్లో ప్రధాన మంత్రి నరేంద్రమోడికి మూడు చెరువుల నీళ్లు తాగించారని జానారెడ్డి వివరించారు. 2091 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని సీట్లు వస్తాయనేది ముఖ్యం కాదని, అధికారంలోకి వస్తామని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. సవాల్ చేసేవారందరికి మా పార్టీ నేతలు సమాధానాలు ఇచ్చారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభు త్వం తెలంగాణ ఇస్తే .. ప్రధాన మంత్రి నరేంద్రమోడి అవమానించారని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. సీబీఐ కేసులకు భయపడే సీఎం కేసీఆర్ పెదవి విప్పడం లేదన్నారు. ఎంపీ కవితకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి లేదని, అందుకనే జై ఆంధ్రా అన్నారని ఆయన విమర్శించారు. సోనియా దేవత అని మొకరిల్లిన విషయం కేటీఆర్ మర్చిపోవద్దని గీతారెడ్డి అన్నారు. రాహుల్‌గాంధీపై విమర్శలు చేసే స్థాయి కేటీఆర్‌కు లేదన్నారు.

బస్సు యాత్రకు గ్రీన్ సిగ్నల్ ఎప్పుడు?

- కాంగ్రెస్ హైకమాండ్ అనుమతి కోసం టీపీసీసీ నిరీక్షణ
- విడతల వారీగా యాత్రలకు ప్రణాళికలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : యాత్రల ద్వారా జనంలోకి వెళ్లేందుకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు చేస్తున్న యత్నాలు ఇంకా కొలిక్కి రావడంలేదు. పార్టీలోని కొంత మంది సీనియర్లు తమ సొంత జిల్లాలలో యాత్రలు చేసేందుకు అనుమతించాలని అధిష్టానానికి ఇప్పటికే పలువార్లు విజ్ఞప్తి చేసుకున్నా హైకమాండ్ నుంచి అనుమతి లభించడం లేదు. పాద యాత్రల ద్వారా కొందరూ, బస్సుయాత్రల ద్వారా మరి కొం దరూ సీనియర్లు గ్రామాలను చుట్టి రావాలనే యోచ నలో ఉన్నారు. టీ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు టీడీప నుంచి కాంగ్రెస్‌లో చేరిన రేవంత్ రెడ్డి కూడా పాదయాత్రల ద్వారా జనంలోకి వెళ్లాలని భావించారు. ఎవరికి వారుగా కాకుండా టీ పీసీసీ ఆధ్వ ర్యంలో ఫిబ్రవరి రెండో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్రను చేపడుతున్నట్లు పక్షం రోజుల క్రితం ఉత్తమ్ కుమార్ ఒడ్డి స్వయంగా ప్రకటిం చిన విషయం తెలి సిందే. ఇదిలా ఉంటే ఉత్తమ్‌తో పాటు మిగతా నాయ కులెవ్వరికి కూడా యాత్రల విషయంపై పార్టీ హై కమాండ్ నుంచి గ్రీన్ సిగ్నల్ లభించలేదు. రాష్ట్ర సీనియర్ నేతల్లో సమన్వ యం లేక పోవడమే ఇందు కు కారణ మనే అభిప్రాయం వ్యక్తమవు తోంది.

అయితే ఇప్పటి వరకు బస్సుయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్ గానీ ఏర్పాట్లు కూడా లేకపోవడంతో కాంగ్రెస్ కేడర్ నిరుత్సా హం వ్యక్తం అవుతోంది. విడతల వారిగా యాత్రలు బస్సు యాత్రలు చేపట్టి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం ద్వారా వచ్చే ఎన్నికల్లో ఫలితం ఉంటుందని చాల మంది నేతలు భావిస్తున్నారు. ముందుగా అసెంబ్లీ నియోజక వర్గాల వారిగా, రెండో విడత జిల్లాలు, మూడో విడత నాలుగు దిక్కులుగా ప్రాంతాల వారిగా యాత్రలు చేయాలని భావించారు. అసెంబ్లీ నియోజక వర్గాల్లో అయితే స్థానిక నేత పాదయాత్రలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను దాదాపు 50 నుంచి 60 నియోజక వర్గాల్లో వచ్చే ఎన్నికల్లో పోటి చేసే విషయంపై క్లారిటి ఉందని పార్టీ వర్గాలు చెబు తున్నాయి. మిగతా చోట్ల మాత్రం పార్టీ టికెట్ ఎవరికి వస్తుందోననే అను మానం నేతల్లో ఉందని, దీంతో ఖర్చు పెట్టేందుకు ముం దు కు వచ్చే వారు తక్కువగా ఉంటారనే అనుమానాన్ని పార్టీకి చెందిన ఒక సీనియర్ నేత అభిప్రాయ పడ్డారు.

ఇకపోతే వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టివిక్రమార్క రాష్ట్రంలోని 31 రిజర్వ్‌డు నియోజక వర్గాల్లో యాత్రలు చేయాలని గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. అయినా ఇప్పటి వరకు పార్టీ నుంచి ఎలాంటి అనుమతి రాలేదని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా హైకమాండ్ అనుమతిస్తే రాష్ట్ర వ్యాప్తంగా లేదంటే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పాదయాత్ర చేయడానికి సిద్ధమని ప్రకటించినప్పటికి అధిష్టానం వర్గం నుంచి సానుకూలమైన సంకేతాలు రాకపోవ డంతో తన ప్రయత్నం విరమించు కున్న ట్లుగా తెలుస్తోంది. రేవంత్‌రెడ్డి కూడా టీడీపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలో పార్టీ అను మతిస్తే రాష్ట్రం మొత్తం తిరిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నేతల వద్ద ప్రస్తావించారు. అందుకు ముఖ్య నేతలు సుముఖత వ్యక్తం చేయలేదనే ప్రచారం జరుగుతోంది.



తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ యూనిట్ కార్యవర్గం రూపొందించిన డైరీని ఆవిష్కరిస్తున్న గవర్నర్ నరసింహన్

కాంగ్రెస్ నేతలు దద్దమ్మలు

- 70 కాదు 7 స్థానాల్లో గెలిచి చూపించండి: కాంగ్రెస్‌కు టీఆర్ఎస్ సవాల్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్‌నేతలు 70కాదు.. 7సీట్లు గెలవండి చూద్దాం.. ఛాలెంజ్. ప్రతి పక్షంగా ఎలా వ్యవహరించాలో తెలియకుండా అడ్డ గోలు ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు వచ్చే ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని రాష్ట్ర పశుసంవర్ధక శాఖా మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఇంకా పాతికేళ్ళకు పైగా పొలిటికల్ కెరీర్‌గా ఉన్న కెటిఆర్ ఛాలెంజ్ చేస్తే.. దమ్ముంటే స్వీకరించాలి.. లేకుంటే మాట్లాడొద్దు.. ఇలా పోటీపడి ఒకరితర్వాత మరొకరు తిట్లపురాణమేంటి? అంటూ మండిపడ్డారు. గడచిన నాలుగేళ్ళలో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసిందని, ప్రజలకు ఏం కావాలో అన్నీ తెలిసిన వ్యక్తి కెసిఆర్ సిఎంగా ఉన్నార న్నారు. మాట్లాడితే కెసిఆర్ కుటుంబంపై అక్కసు వెళ్ళగక్కుతున్న కాంగ్రెస్ నేతలు కుళ్లు.. కుతంత్రంతో వ్యవహరిస్తున్నారన్నారు. నల్లగొండలో ఎవరో హత్యచేస్తే.. దానినీ టిఆర్ఎస్‌కు అంటగట్టే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య పద్దతిలో చేస్తే.. ప్రజాస్వామ్యంగా ఉంటామని, లేకుంటే జరగాల్సిన టైంలో అన్నీ జరుగుతాయన్నారు. తాము ఏం చెప్పినా ప్రజలకే చెప్పుకుంటామని.. ప్రజలే తమ బాస్‌ల న్నారు. కాంగ్రెస్ చెప్పినట్లు తమ పరిపాలన ఉండదని, ప్రజలకు ఏంకావాలో దానిని కెసిఆర్ అందిస్తార న్నారు.

ముమ్మాటికీ దద్దమ్మలే: ప్రభుత్వ విప్ పల్లా

కాంగ్రెస్ నేతలు ముమ్మాటికీ దద్దమ్మలేనని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల నుండి సిలికాన్‌వ్యాలీ దాకా తన నాయకత్వ పటిమతో, నైపుణ్యంతో కెటిఆర్ ప్రశంసలందు కుంటున్నారన్నారు. ఆయనపై ఉత్తమ్, కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం.. స్థాయి కాదనడం దారుణ మన్నారు. స్థాయిని ప్రజలు నిర్ణయిస్తారని, నోటికొచ్చి నట్లు మాట్లాడడం వల్ల ప్రజలు మూడున్నరేళ్ళుగా ఏ ఎన్నిక జరిగినా కాంగ్రెస్‌ను తరిమికొడుతున్నా రన్నారు. ప్రభుత్వం మంచి చేస్తున్నదనే టిఆర్ఎస్‌కు అప్రతిహత విజయాలు కట్టబెట్టిందన్నారు.

కాంగ్రెస్ కాలకేయ ముఠా: ఎమ్మెల్సీ కర్నె

కాంగ్రెస్ నాయకులది ప్రజల ఉసురుపోసుకునే కాలకేయ ముఠా అని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తాలతో కలిసి విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ ఉన్నదిఉన్నట్లు మాట్లాడడంతో ఉలిక్కిపడ్డ కాంగ్రెస్ నాయకులు పిచ్చిమాటలు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు బుట్టాచోర్ బ్యాచ్‌లా తయారయ్యారని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు నీచరాజకీయాలు చేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా విమర్శించారు.

తెరాస పాలనతో ప్రజలు విసిగిపోయారు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కదారి పట్టించేందుకే కాంగ్రెస్, టిఆర్ఎస్‌లు తిట్ల దండకాన్ని అందుకున్నాయని బిజెపి ఆరోపించింది. ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్ జడ్‌పిటిసిటిఆర్ఎస్‌కు చెందిన రామునాయక్, శాంతాపూర్ సర్పంచ్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు పుండాలిక్, అమర్‌సింగ్, వెంకట్రావులతో పాటు దాదాపు 400 మంది, రంగారెడ్డి జిల్లా తాండూరు మునిసిపాలిటీ మాజీ చైర్మన్ సత్తయ్యగౌడ్, యాలాల మండల మాజీ సర్పంచ్ చందర్‌నాయక్ తదితరులు శుక్రవారం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ, టిఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మాటలు, తిట్ల పురాణం సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికార టిఆర్ఎస్ ఘోరంగా వైఫల్యం చెందిం దని, వీటిపై నిర్మాణాత్మకమైన పోరాటం చేయాల్సిన ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ చేతలుడిగి చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టఆర్ఎస్ పార్టీల నేతలు వ్యక్తిగత ప్రచారం కోసం పాకులాడటం దురదృష్టకర మన్నారు. రెండు పార్టీలు చేస్తున్నవి డూప్ ఫైటింగ్, మ్యాచ్ ఫిక్సింగ్ అని అన్నారు. వారసత్వ రాజకీయాలు, అవినీతికి ఆనవాళ్ళుగా నిలిచిన కాంగ్రెస్, టిఆర్ఎస్‌లను ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిరస్కరించాలని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కొన్ని పార్టీలు లేనిపోని రాద్ధాంతం చేయడం సరైంది కాదన్నారు.



2019 జనవరిలో గజ్వేల్‌కు రైలు

- మంత్రి హరీశ్‌కు ద.మ రైల్వే జీఎం హామీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మనోహరాబాద్- కొత్తపల్లి రైల్వేలైన్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రి హరీష్‌రావు కోరారు. వచ్చే ఏడాది గజ్వేల్‌కు రైలు నడవాలని అన్నారు. రైల్వేలైన్, రైల్వేస్టేషన్ల నిర్మాణం, ఇతర పనుల పురోగతిని హరీష్‌రావు శుక్రవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని తన బంగళాలో సమీక్షించారు. వచ్చే సంవత్సరం జనవరిలోగా గజ్వేల్‌కు రైలు నడిచేవిధంగా పనులు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే జిఎం వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. రైల్వే పనులు మరింత వేగవంతం చేయాలని రైల్వే అధికారులను ఆదేశించారు. మనోహరాబాద్, కొత్తపల్లి మార్గంలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయాలని కోరారు. తూప్రాన్ మండలం పరికిబండ రిజర్వ్ ఫారెస్ట్‌పరిధిలో ఉన్న భూములసేకరణకు అడ్డంకులు తొలగిపోయాయన్నారు. మెదక్-అక్కన్నపేట మార్గంలో భూసేకరణ పూర్తిచేయాలన్నారు. రైల్వే పనులు ముఖ్యమంత్రి కెసిఆర్ ఆశించినదానికన్నా నెమ్మదిగా సాగుతున్నాయని మంత్రి హరీష్ అభిప్రాయపడ్డారు. రామాయం పల్లి దగ్గర రోడ్డు ఓవర్ బ్రిడ్జి, గజ్వేల్ సమీపంలో ఆర్ఓబి, ఆర్‌యుబి నిర్మిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

నాణ్యమైన విత్తనోత్పత్తే లక్ష్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించి అధికోత్పత్తులు సాధించటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారధి తెలిపారు. ఇండో జర్మని సహకార విత్తనాభివృద్ధి పథకంలో భాగంగా వివిధ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్ధసారధి మాట్లాడుతూ ఈ ఏడాది విత్తనోత్పత్తులు, ధృవీకరణ తదితర అంశాలపై తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు.17వేల క్వింటాళ్ల విత్తానాలు ఉత్పత్తి చేసి వివిధ దేశాలకు ఎగుమతి చేయగలిగామన్నారు. ఏప్రిల్ తొలివారంలో అంతర్జాతీయ ధృవీకరణపై విదేశీ శాస్త్రవేత్తలతో శిక్షణా సదస్సు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అతే కాకుండా ముఖ్యమైన విత్తనోత్పత్తి పం టల మెళకువల గురించి రైతులకు కరపత్రాలలను ముద్రించి పంచడం వల్ల నాణ్య మైన విత్తనాలు ఉత్పత్తి చేయడానికి ఈ కారక్రమాలు దోహద పడతాయన్నారు. మార్చి మొదటి వారంలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన ధృవీకరణపై పలు కార్యక్రమాలు నిర్వహించి సాంకేతిక విత్తనోత్పత్తిపైన, విత్తన నాణ్యతపైనా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ధృవీకరణ, విత్తన నాణ్యతపైనా పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పార్ధసారధి పేర్కొన్నారు. ఈసమావేశంలో జర్మన్ ప్రతినిధి ఎక్కెహార్డ్ , విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు తదితర అధికారులు పాల్గొన్నారు.

కందుల సేకరణ పరిమితి పెంపు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో పండించిన కందులసేకరణ పరిమితి పెంచుతున్నట్టు కేంద్రప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయశాఖకు లేఖరాసింది. రాష్ట్రంలో 75300 మెట్రిక్ టన్నుల కందులు కొనుగోలు చేయనున్నట్టు తెలిపింది. కందులకు కనీస మద్దతు ధర చెల్లించనున్నట్టు ఈ మేరకు లేఖలో పేర్కొంది.

ఆసరా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం

- తెదేపా ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ఆసరా పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితికి దిగజారిందని, ఇది సీఎం అసమర్థతేనని తెలుగు దేశంపార్టీ తెలంగాణ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి దుయ్యబట్టారు. ప్రతినెలా చెల్లించాల్సిన పింఛన్లు మూడు నెలలు గడుస్తున్నా విడుదల చేయకపోవడం సిగ్గుచేటని ఆయన అన్నారు. ధనిక రాష్ట్రమని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు తమ జీతాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకొని, ప్రతినెలా లక్షల్లో జీతభత్యాలు తీసుకుంటున్నారని, పింఛన్లపై ఆధారపడి జీవిస్తున్న వారికి పింఛన్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం దారుణమని నన్నూరి మండి పడ్డారు.

‘టీమ్స్’ను ప్రారంభించిన మంత్రి ఈటల



ఆంధ్రప్రభ, హైదరాబాద్: తెలంగాణ ఈ లర్నింగ్ అప్లికేషన్స్ మేనేజ్‌మెంట్ సిస్టం (టీమ్స్)ను శుక్రవారం ఆర్థిక శాఖా మంత్రి ఈటల రాజేందర్ ప్రారంభిం చారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ అధికారుల శిక్షణకు సులువైన రీతిలో ఈ అప్లికేషన్‌ను ఆయన ఆవిష్కరించారు. భవిష్యత్తులో ఈ మాధ్యం ద్వారానే శిక్షణ అందించనున్నట్టు ఎంసీహెచ్ఆర్‌డీ డైరెక్టర్ జనరల్ బీపీఆచార్య తెలిపారు. సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు చేరేందుకు ఈ లర్నింగ్ విధానంలో తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. 31 జిల్లాల్లో గుర్తించిన పనులు, ప్రభుత్వ పథకాలు, సమాచారం, సాంకేతికత వంటి అంశాలను గంటల వ్యవధిలోనే దీనిద్వారా చేరవేయనున్నట్టు ఆయన తెలిపారు. ఎస్‌డీజీల అభివృద్ధి ద్వారా నీతిఅయోగ్ ఆమోదం తెలిపిందన్నారు. డీఓపీటీకి చెందిన ఈ మాధ్యం ద్వారా 9 వేల మంది ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారని మరో 9 వేల మందికి శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్థికశాఖ సలహాదారు జీఆర్ రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల సెస్‌కు నిధులివ్వండి

- కేంద్ర మంత్రిని కోరిన ఎంపీ వినోద్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: సిరిసిల్ల కో ఆపరేటివ్ ఎలక్ట్రిక్ సప్లై సొసైటీకి నిధులు కేటాయించాలని కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్కే సింగ్‌ను ఎంపీ వినోద్ కుమార్, సిరిసిల్ల సెస్ పాలకవర్గం కలిసి కోరారు. దేశంలోనే లాభాల బాటలో అత్యంత విజయవంతంగా కొనసాగుతున్న సెస్ పనితీరు గురించి తెలుసుకున్న కేంద్ర మంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ నిధుల కేటాయింపుపై సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి ముందు 3 అంశాలను ప్రతిపాదించింది.

అవి 1. లక్షా 50 వేల గృహ మీటర్ల మార్పులకు నిధుల కేటాయింపు

2. లో ఓల్టేజ్ నుంచి హై ఓల్టేజ్ లైన్ల ఏర్పాటు కు నిధుల కేటాయింపు

3. పాత ట్రాన్స్ ఫార్మర్లు, పాత కరెంట్ లైన్ల పునరుద్ధరణ కు నిధులు

ఈ భేటీలో సిరిసిల్ల సెస్ అభివృద్ధి, నాణ్యమైన విద్యుత్ అందించే దిశలో కావాల్సిన నిధులను కేటాయించాలని కేంద్ర మంత్రిని ఎంపి వినోద్, సిరిసిల్ల సెస్ పాలక వర్గం కోరింది. వెనకబడ్డ గ్రామీణ మెట్ట ప్రాంతాల్లో పంటల అభివృద్ధి పెంచడం కోసం, భూగర్భ జలాలను ఉపయోగించుకునే పరిస్థితుల్లో విద్యుత్ మోటర్ల ద్వారా సాధ్యమవుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో సెస్‌ను స్థాపించనట్టు సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి తెలిపారు. 2 లక్షల 65 వేల వినియోగదారులతో అభివృద్ధి బాటలో కొనసాగుతూ, ప్రత్యేకంగా 65 వేల వ్యవసాయదారులకు ఉచితంగా ఈ సంస్థ విద్యుత్ అందిస్తోందని లక్ష్మారెడ్డి వివరించారు. ప్రస్తుతం లైన్ల ద్వారా దాదాపు 18 శాతం విద్యుత్ నష్టం ఏర్పడుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ విద్యుత్ నష్టాన్ని తగ్గించే దిశలో నిధులను కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరామని లక్ష్మారెడ్డి తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి విద్యుత్ పంపిణీ నష్టాలను అధిగమించేలా సిరిసిల్ల సెస్ కు సహకరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే సిరిసిల్ల సెస్‌కు నిధులు కేటాయిస్తామని ఇందుకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారన్నారు. కేంద్ర మంత్రి ఆర్కే సింగ్‌తో జరిగిన సమావేశంలో ఎంపి వినోద్‌తో పాటు, సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి, సెస్ వైస్ చైర్మన్ ఎల్. శ్రీనివాస్, సెస్ డైరెక్టర్లు అల్లాడి రమేష్, కుంబాల మల్లారెడ్డి, కొక్కు దేవేందర్ యాదవ్, తిరుపతి, వివి రమణా రెడ్డి, ఏ. విజయ రామారావు, లక్ష్మీ కనకయ్య సెస్ ఎండి యూనస్, ఏఓ సయ్యద్ ఖుర్షీద్ లు తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన కేంద్రం

● ఏపీ డిమాండ్లకు సూత్రప్రాయ అంగీకారం ● రెవెన్యూ లోటు భర్తీకి సానుకూలం ● కేంద్ర మంత్రులు జైట్లీ, పీయూష్, బీజేపీ చీఫ్ అమిత్ షాతో సుజనాచౌదరి భేటీ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తెలుగుదేశం ఎంపీలు గత అయిదురోజులుగా చేస్తున్న ఆందోళన ఫలిస్తోంది. కేంద్రం ఒక మెట్టు దిగింది. శుక్రవారం పార్లమెంటు ముగిసిన తర్వాత భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సమక్షంలో భాజపా అగ్రనేతలు, తెలుగుదేశం నేతలు సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటల పాటు చర్చలు సాగాయి. మొత్తానికి విభజన చట్టంలో పేర్కొన్న అన్ని అంశాలను నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే, ఇదివరకు వలె కేవలం మాటలతో కాకుండా స్పష్టమైన కాలపరిమితిని కూడా ఇందుకు నిర్దేశించినట్టు సమాచారం. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 5న ప్రారంభం కానున్నాయి. ఆలోపు విభజన చట్టంలోని మెజారిటీ అంశాలను పూర్తిస్థాయిలో అమలు చేయడానికి అంగీకారం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేవలం మాటలు, హామీలతో కాకుండా నిర్దిష్ట కాలపరిమితి స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి కేంద్రమంత్రి సుజనా చౌదరి కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, పియూష్ గోయల్‌తో పాటు అమిత్‌షాలకు తెలుగుదేశం డిమాండ్లను వివరించారు. దీనిపై స్పందించిన అమిత్‌షా వెనువెంటనే కార్యాచరణను ప్రకటించాలని జైట్లీ, గోయల్‌ను కోరారు. లోటుకు సంబంధించి మొదటి సంవత్సరంలో పది నెలలకు వచ్చిన లోటును ఒకేసారి చెల్లించేందుకు అభ్యంతరం లేదని జైట్లీ అంగీకరించినట్టు సమావేశానంతరం తనను కలిసిన విలేకరులతో సీఎం రమేష్ చెప్పారు. అలాగే, విశాఖ రైల్వే జోన్‌ను ఏక్షణంలో ప్రకటించమని చెప్పినా ప్రకటన వెలువరించేందుకు సిద్ధంగా ఉండాలని గోయల్‌తో అమిత్‌షా స్పష్టం చేసినట్టు సీఎం రమేష్ చెప్పారు. దుగరాజపట్నం పోర్టుకు సంబంధించి ఇస్రో కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేసిందని, అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ కోరితే అక్కడ పోర్టును నిర్మించడానికి సిద్ధమని చెప్పినట్టు అధికారవర్గాలు కూడా తెలిపాయి. అలాగే, కడప ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంలో నిర్మించేందుకు ఒప్పుకున్నారు. పోలవరంకు సంబంధించి ఇప్పటికే నిరాటంకంగా పనులు సాగుతున్నాయని, నిధుల కొరత లేదని జైట్లీ చెప్పారని మరో ఎంపీ తోట నరసింహం వెల్లడించారు. ఈఏపీ నిధులకు సంబంధించి కూడా ఎటువంటి ఆటంకాలు లేకుండా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్టు జైట్లీ చెప్పారని ఎంపీలు తెలిపారు. అలాగే, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కు సంబంధించి వెంటనే ప్రకటన చేయాలని చమురు సంస్థలను ఆదేశించినట్టు, ఇందుకు లేఖను కూడా ఇప్పటికే పంపించినట్ట జైట్లీ చెప్పారని ఎంపీలు వెల్లడించారు. ఏదిఏమైనా, వచ్చే నెల 5వ తేదీ లోగా స్పష్టమైన కార్యాచరణ ప్రకటిస్తామని కేంద్రమంత్రులు, అమిత్‌షా చెప్పారని, అవన్నీ అమల్లోకి వస్తేనే జనం నమ్ముతారని కూడా తాము స్పష్టం చేసినట్టు ఎంపీలు తెలిపారు.

ఎంపీ ఏవీ స్వామికి అస్వస్థత

న్యూఢిల్లీ: రాజ్యసభ సభ్యుడు ఎంపీ ఏవీ స్వామి అస్వస్థతకు గురయ్యారు. పార్లమెంటులో అస్వస్థతతో కుప్పకూలిపోయిన ఆయనను వెంటనే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. ప్రశ్నోత్తరాల సమయం అనంతరం రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు ఈ విషయం సభ్యులకు వెల్లడించారు. ఒడిశాకు చెందిన సభ్యుడు ఏవీ స్వామి అనారోగ్యంతో పడిపోవటంతో ఆయన్ని వైద్య చికిత్స కోసం తరలించామని తెలిపారు. మధుమేహం కారణంగా సుగర్ లెవెల్స్ పడిపోవటంతో ఆయన అస్వస్థతకు గురై పడిపోయుండవచ్చని ఏదేమైనా ఇంకా సరైన కారణం వైద్యులు వెల్లడించాల్సి ఉందని ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు.

ఎంపీల నిరసనలతో దద్దరిల్లిన లోక్‌సభ



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పార్లమెంటు బడ్జెట్ తొలివిడత సమావేశాలు ముగిశాయి. ఉభయసభలు ఆంధ్రప్రదేశ్ ఎంపీ నిరసనలు, ఆందోళనలతో దద్దరిల్లాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఏపీకి న్యాయం చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఇటు కాంగ్రెస్ పార్టీఎంపీలు సైతం రాఫెల్ డీల్ అంశంపై ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాలకు అంతరాయం కలగడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను 12గం.లకు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు నిరసనను కొనసాగించారు. రాఫెల్ డీల్ వివరాలను బయటపెట్టాలని కాంగ్రెస్ ఎంపీలు డిమాండ్ చేశారు. సభలో తీవ్రమైన గందరగోళం నెలకొనడంతో స్పీకర్ లోక్‌సభను మార్చి5కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభ వాయిదా పడగానే టీడీపీ ఎంపీలు, బీజేపీ కురువృద్ధుడు అద్వానీతో సభలోనే మంతనాలు జరిపారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం చేశారని చెప్పారు. విభజన చట్టంలోని హామీలన్నీ అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఈ అంశాలపై ఆయన సానుకూలంగా స్పందించారని ఎంపీలు చెప్పారు.

రాజ్యసభలోనూ జైట్లీది పాత పాటే...



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: తొలి విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల చివరి రోజైనా కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తుందని ఆశించిన తెలుగు ఎంపీలకు నిరాశే ఎదురైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి గురువారం లోక్‌సభలో ఏదైతే మాట్లాడారో, అక్షరం పొల్లుపోకుండా శుక్రవారం రాజ్యసభలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనసమయంలో కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని ముందే గ్రహించి తామే కొన్ని సర్దుబాట్లను ప్రతిపాదించామని గుర్తుచేశారు. విభజన చట్టంలో పొందుపరిచిన హామీల్లో ఇప్పటికే కొన్ని అమలవగా, మరికొన్ని అమలవుతున్నాయని అన్నారు.

విభజన కారణంగా విద్యా సంస్థలు, పరిశోధనా సంస్థలు తెలంగాణ భూ భాగంలోనే ఉండిపోయినందున, కొత్తగా ఏర్పడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పలు సంస్థలను కేటాయించి, నిధులు కూడా మంజూరు చేశామని చెప్పుకొచ్చారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొత్త రాజధానికి నిధులిచ్చామని, వెనుకబడ్డ జిల్లాలకు కూడా నిధులు ఇస్తూనే ఉన్నామని జైట్లీ అన్నారు. ఇక పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం నాబార్డు ద్వారా నిధులు అందజేసే ఏర్పాటు చేశామని అన్నారు.ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ఆర్థిక సహాయం (ప్యాకేజి) పేరుతో కేంద్రం ప్రతిపాదించినదానికి ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రోగ్రామ్స్ ద్వారా నిధులను సమకూర్చాలని భావించగా, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను సూచించిందని చెప్పారు. దీనిపై ఒక స్పష్టత వచ్చాక వెంటనే అమలవుతుందని తెలిపారు. ఇక రెవెన్యూ లోటు భర్తీ విషయంలోనూ రూ. 3979.5 కోట్లు ఇప్పటికే విడుదల చేశామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అంచనాల్లో ఉన్న వ్యత్యాసంపై చర్చలు జరుగుతున్నాయని, దీన్ని కూడా భర్తీ చేస్తామని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పెట్రోలియం కాంప్లెక్స్, దుగరాజపట్నం పోర్ట్ వంటి అంశాలపై సంబంధిత శాఖల ద్వారా వేగవంతం చేసేలా ప్రయత్నిస్తున్నామన్నారు. వీటిపై త్వరలోనే ఒక నిర?యం తీసుకుంటామని జైట్లీ తెలిపారు.

విశాఖలో ఐటీఆర్ ప్రతిపాదన రద్దు

● ఐటీ మంత్రి రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : విశాఖపట్నంలో ఇన్ఫర్మేషన్ ఇన్వెస్టిమెంట్ టెక్నాలజీ రీజియన్‌ను (ఐటీఐఆర్) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన రద్దయినట్టు కేంద్ర ఐటీ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ శుక్రవారం రాజ్యసభలో వెల్లడించారు. వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. విశాఖలో ఐటీఐఆర్ ఏర్పాటు చేయాలని కోరుతూ 2014 ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను ఎకనమిక్ అఫైర్స్ కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సెప్టెంబర్ 2014లో పరిశీలించిన మీదట, ఐటీఐర్ విధానాన్ని తిరిగి సమగ్రంగా పునఃపరిశీలించాలని ఆదేశం చిందని మంత్రి తెలిపారు.

ఏపీలో చౌక ధరలదుకాణాల సంఖ్య తగ్గలేదు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 45,583 చౌక ధరల దుకాణాలు ఉండగా, రాష్ట్ర విభజన అనంతరం ఏప్రిల్ 17, 2014 నాటికి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లా ల్లో 28,663 దుకాణాలు, తెలంగాణలో 16,920 దుకాణాలు ఉన్నాయని, జనవరి 1, 2018 నాటికి ఆంధ్ర ప్రదేశ్‌లో చౌక ధరల దుకాణాల సంఖ్య 29,517కు, అంటే అదనంగా 854 దుకాణాలు పెరిగాయని ఆహార పంపిణీ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఎంపీ విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆహార పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సిఆర్ చౌదరి చౌక ధరల దుకాణాల కార్యకలాపాలు మెరుగు పడా లంటే వాటి నిర్వహణ గిట్టుబాటు కావాలన్న ఉద్దేశంతో ప్రజా పంపిణీ విధానం కింద పంపిణీ చేసే ఆహార ధాన్యాలతోపాటు ఇతర సరుకులు కూడా దుకాణదారుడు విక్రయించునే వెసులు బాటును రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని సంబంధింత చట్టం స్పష్టం చేస్తోందని సమాధానమిచ్చారు. ఈ ఉద్దేశంతోనే ఏపీ ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు సరఫ రా చేసే ఆహార ధాన్యాలతోపాటు ఇతర సరుకుల విక్రయాలకు కూడా వెసులుబాటు కల్పిస్తూ గత ఏడాది డిసెంబర్‌లో పైలెట్ ప్రాజెక్ట్ ప్రాతిపదికన రెండు దుకాణాలలో చంద్రన్న విలేజ్ మాల్స్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు.

జూన్ 1 నుంచి పాఠశాలలు ప్రారంభం

● ఏప్రిల్ 13 నుంచి మే31 వరకు వేసవి సెలవులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వచ్చే విద్యాసంవత్సరం నుంచి జూన్ 1 నుంచి పాఠశాలలను ప్రారంభించాలని పాఠశాల విద్యా శాఖ 2018-19 సంవత్సర విద్యా క్యాలెండర్‌ను రూపొందించింది. ఏప్రిల్ 13 నుంచి మే 31 వరకు వేసవి సెలవులు ఇవ్వాలని ప్రతిపాదించింది. వీటిపై శనివారం ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యా సంచాలకులు చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. శనివారం ఉపాధ్యాయ సంఘాలతో సాయంత్రం 4 గంటలకు పాఠశాల విద్యా శాఖ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో 3 ఆర్ అమలుపై ఉపాధ్యాయ సంఘాల సలహాలు తీసుకోనుంది. కొత్తగా అమలు చేయనున్న అకాడమిక్ క్యాలెండర్‌పై కూడా అభిప్రాయలు తీసుకోనుంది. వీటితోపాటు ఉన్నత పాఠశాలల్లో గణితం, భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం ఎవరు బోధించాలనే దానిపై స్పష్టత రానుంది. సీసీఈ అమలుపై కూడా ఉపాధ్యాయ సంఘాల సూచనలు తీసుకోనుంది.

రైల్వేలో 13 వేల మంది ఉద్యోగులపై వేటు!

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే సుదీర్ఘకాలంగా అనధికార సెలవులో ఉన్న 13,000 మందికిపైగా ఉద్యోగులను గుర్తించింది. వారిని సర్వీసులను నుంచి తొలగించడం కోసం క్రమశిక్షణా చర్య ప్రారంభించినట్టు భారతీయ రైల్వే శుక్రవారం తెలిపింది. సంస్థ పనితీరు మెరుగుదల, చిత్తశుద్ధి కలిగిన ఉద్యోగుల్లో నైతిక స్థయిర్యం పెంపుదలకు రైల్వే ఒక కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా క్రమశిక్షణా చర్య చేపట్టింది. రైల్వేకు చెందిన వేర్వేరు విభాగాల్లో సుదీర్ఘ కాలంగా విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులను గుర్తించేందుకు భారీ కార్యక్రమం చేపట్టింది. ఫలితంగా దాదాపు 13 లక్షల మంది ఉద్యోగుల్లో 13,000 మందికిపైగా ఉద్యోగులు చాలాకాలంగా అనధికారికంగా గైర్హాజరవుతున్నారని వెల్లడి అయ్యింది అని ఒక ప్రకటనలో తెలిపింది. తగిన ప్రక్రియ చేపట్టిన అనంతరం ఈ ఉద్యోగులను ఉద్యోగుల హాజరుపట్టి (రోల్స్) నుంచి తొలగించాలని అందరు అధికారులు, సూపర్‌వైజర్లను ఆదేశించడం జరిగిందని వెల్లడించింది.

అవకాశవాదానికి అర్థం చంద్రబాబే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తన స్వార్థం కోసం చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని , అవకాశవాదానికి నిజమైన అర్థం అయనే అని వైకాపా నేత పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బుగ్గన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏపీకి ప్రత్యేక్‌హోదా సంజీవిని అన్న చంద్రబాబు అధికారంలోకి రాగానే అదేమైనా సంజీవినా ,కోడలు మగబిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా అని హేళనగా మాట్లాడరన్నారు. పోలవరంను కేంద్రమే పూర్తిచేయాలని , కడప స్టీల్ ప్లాంట్‌ను కూడా నిర్మించాలన్నారు. ఓటుకు కోట్లు కేసులో దొరికిపోయిన చంద్రబాబు అమరావతికి పరుగులు తీశారని , సీఎం తీరువల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి దేశంలోనే ఏపీ నంబర్ వన్ అని చంద్రబాబు అపద్దాలు చెప్పారన్నారు.

మాల్దీవుల్లో బందీగా భారతీయ జర్నలిస్టు

● ప్రైవేటు టీవీ చానెల్ మూసివేత

మాలె: ఒక భారతీయుడితో పాటుగా ఇద్దరు విదేశీ పాత్రికేయులను మాల్దీవుల పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని ఇమ్మిగ్రేషన్ అధికారులకు అప్పగించినట్టు పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యక్తులు వలస చట్టం మరియు నియంత్రణలకు విరుద్ధంగా టూరిస్టు వీసాపై పాత్రికేయులుగా పనిచేస్తున్నట్టు తేలింది అని వివరించారు. భారతీయుని అదుపులోకి తీసుకోవడంపై మరింత సమాచారం ఇవ్వాలని మాల్దీవుల్లో దౌత్య కార్యాలయాన్ని భారత్ కోరింది. పాత్రికేయునిగా పనిచేస్తున్న భారతీయుడు మణిశర్మను మాల్దీవుల అధికారులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. కేసుకు సంబంధించిన మరింత సమాచారం కోసం స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతుండాల్సిందిగా అక్కడున్న మా దౌత్య కార్యాలయాన్ని కోరాము అని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. బెదిరింపుల నేపథ్యంలో ప్రముఖ స్థానిక టీవీ చానల్‌ను మూసివేశారు.

15న కృష్ణా బోర్డు భేటీ

● నీటి కేటాయింపులు, వర్కింగ్ మాన్యువల్ ఆమోదంపై చర్చ ● కొత్త చైర్మన్ ఎంపికపై నిర్ణయం



అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశం ఈనెల 15న ఢిల్లీలో నిర్వహించబోతున్నారు. ఈ మధ్య బోర్డు చైర్మన్ శ్రీ వాత్సవ పదవీవిరమణ నేపథ్యంలో గోదావరి బేసిన్ బోర్డు ఛైర్మన్ శర్మకు కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. వాస్తవానికి గత నెల 30న జరగాల్సిన బోర్డు సమావేశం మళ్లీ ఫిబ్రవరికి వాయిదా వేసిన సంగతి తెలిసిందే.ఈసారి జరగబోయే సమావేశం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. నీటి లెక్కల వినియోగంతో పాటు బోర్డుకు సంబంధించిన తుది వర్కింగ్ మ్యాన్యువల్ ఆమోదంపై 15న జరిగే సమావేశంలోనే కీలకంగా చర్చించి,ఆమోదానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. కాగా నీటిపారుదల వ్యవస్థలోఎంతో అనుభం ఉన్న శ్రీవాత్సవ పదవీ విరమణ చేయడంతో రెండు రాష్ట్రాలకు చెందిన నీటి వివాదాలపై కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఆయన తర్వాత అంతటి అనుభవం,వ్యవస్థలోని లోటుపాట్లు తెలిసిన వ్యక్తి మరొకరు లేకపోవడంతో గోదావరి బేసిన్ బోర్డు చైర్మన్‌కు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారంటున్నారు. కొత్త చైర్మన్ వచ్చేంతవరకు కూడా శర్మనే ఇన్‌చార్జిగా కొనసాగుతారంటున్నారు. కృష్ణా నది బేసిన్‌కు సంబంధించిన అన్ని ప్రాజెక్టులపై సర్వాధికారాలు తమకే ఉండేలా కృష్ణా నది యాజమాన్య బోర్డు తాజాగా తుది వర్కింగ్ మ్యాన్యువల్ సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణా రాష్ట్రాల పరిధిలోని కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు,వాటిల్లో పని చేస్తున్న ఉద్యోగులంతా బోర్డు ఆధీనంలోనే పనిచేసేలా బోర్డు మార్గదర్శకాలు రూపొందించింది. అయితే గతంలో జరగాల్సిన సమావేశంలోనే ఈ విషయమై చర్చించి, ఆ మ్యాన్యువల్‌కు ఆమోదం తెలపాల్సి ఉంది. కానీ సమావేశం వాయిదా పడడంతో మ్యాన్యువల్ ఆమోదం మరింత ఆలస్యమైంది. .ఢిల్లీ సమావేశంలోనే బోర్డు ప్రధాన కార్యాలయాన్ని అవరావతిలోఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన అంశంపై కూడా చర్చిస్తారు. బోర్డు రూపొందించిన తాజా వ్ర్యాస్ ్యవ ల్ వ ార్గ ద ర్శకాల క ు సంబంధించి గతంలోనే బోర్డు కార్యదర్శి ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు ద్వారా తెలియజేయడం జరిగింది. వర్కింగ్ మ్యాన్యువల్‌ను కేంద్ర జలవనరుల శాఖ ఆమోదం లభిస్తే కృష్ణా బోర్డుకు సర్వాధికారాలు లభిస్తాయి. దీంతో రెండు రాష్ట్రాల దుకుడుకు కళ్లెం వేయడానికి బోర్డుకు అవకాశం దక్కుతుంది. మ్యాన్యువల్‌లోని మార్గదర్శకాల ప్రకారం బోర్డు పరిధిలోని ప్రాజెక్టుల్లో ఏ పనులు చేయాలన్నా బోర్డు నుంచి అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. కొత్తగా ప్రాజెక్టులు చేపట్టాలంటే మాత్రం బోర్డు నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉం టుంది. ఇలా ఉంటే నీటి వాటాలకు సంబంధించి బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులపైనే చర్చిస్తారు . గత బోర్డు సమావేశంలో ఇరు రాష్ట్రాలు వర్కింగ్ మ్యాన్యువల్‌కు ఒకే చెప్పినా మళ్లీ దానిపై సమావేశం జరగక దానికి ఆమోదం లభించలేదు. . ఇదే సమయంలో మైనర్ ఇరిగేషన్ లెక్కలపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో చర్చించి, లెక్కలు తేలుస్తారు. ఇదిలా ఉంటే కృష్ణా నది యాజమాన్య బోర్డు కార్యాలయం హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి అమరావతికి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమేరకు కార్యాలయం తరలింపునకు చర్యలు తీసుకోవాలని బోర్డు చైర్మన్‌కు, కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు రాష్ట్ర జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ లేఖలు రాసిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ పునర్వ్ విభజన చట్టంలోని సెక్షన్ 85 (2)ప్రకారం బోర్డును ఏపీ రాధానిలో అమరావతిలో ఏర్పాటు చేయాల్సి ఉంది.. ఇలా ఉంటే శ్రీశైలం,సాగర్ నుంచి తమ ఆదేశాల ప్రకారం నీటి విడుదల జరగాలని బోర్డు ఏపీ,తెలంగాణాలకు సూచించింది. ఇందుకు భిన్నంగా ఎవరైనా నీటిని వినియోగిస్తే తర్వాత జారీ చేసే ఆదేశాల్లో ఆ నీటిని పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే నీటి వినియోగానికి సంబంధించి ఎవరి లెక్కలు వారికి ఉన్నాయి. ఇప్పటివరకు మొత్తం 354.51 టీఎంసీల వినియోగం ఉండగా, అందులో ఆంధ్రప్రదేశ్ 252.79 టీఎంసీలు, తెలంగాణ 101.72 టీఎంసీలు వినియోగించుకున్నట్లు బోర్డు పేర్కొంది. అయితే ఈ లెక్కలను రెండు రాష్ట్రాలు అంగీకరించలేదు.

త్వరలో ఢిల్లీలో జరిగే సమావేశంలో ఈ విషయమై కూడా చర్చించనున్నారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) వెంకటేశ్వరరావు, జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ హాజరు కానున్నారు. అదే విధంగా తెలంగాణ నుంచి కూడా హాజరవుతారు.

హామీల అమలులో కేంద్రం విఫలం

● సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ప్రధాన మంత్రి నరేంద్రమోడి పార్లమెంట్‌లో మాట్లాడిన తీరు ప్రతిపక్ష నాయకుడిలా ఉందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. మోడి మాటలు ప్రతిపక్షాలపై విమర్శలు చేయడమే తప్పా.. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా లేవన్నారు. విభజన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభు త్వం విఫలమైందన్నారు. పార్లమెంట్ తలుపు మూసి రాష్ట్ర విభజన చేశారనడం సరికాదన్నారు. సీపీఎం పార్టీ తప్పా అన్ని పార్టీలు రాష్ట్ర విభజనకు ఒప్పుకున్న విషయం తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. శుక్రవారం ఆయన ముఖ్దూమ్ భవన్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ , రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ బిల్లు పార్లమెంట్‌లో ఆమో దం పొందినప్పుడు.. ప్రధానమంత్రిగా ఉంటే తెలం గాణ ఇచ్చేవాడిని కాదన్నట్లుగా నరేంద్రమోడి ప్రసం గం ఉందని సురవరం అన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల పోరాటం విమర్శల నుంచి తిట్ల స్థాయికి చేరిందన్నారు. రాజకీయ విధానాల ప్రకారం మాట్లాడాలని, వ్యక్తిగతమైన దూషణలు సరికావన్నారు. విభజన హామీలు, వర్గీకరణపై ప్రతిపక్షపార్టీలతో కలిసి టీఆర్ఎస్ పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీఆర్ఎస్ ఎంపీలు మాత్రం పార్లమెంట్ ఉభసభల్లో ఎందుకు మాట్లాడటం లేదన్నారు. రైల్వే జోన్‌లు తెలంగాణకు తక్కువగా ఉన్నాయని తెలిపారు.

ఏపీకిచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం తీరుకు నిరసనగా వామపక్షాలు ఇచ్చిన ఏపీ బంద్‌కు అన్ని పార్టీల నేతలు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ విషయంలో కేంద్ర ప్రభుత్వం క్లారిటి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఏపీని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభు త్వంపై ఉందని ఆయన సూచించారు. మాజీ ప్రధానమంత్రి నెహ్రూపై అపఖ్యాతి తెచ్చే విధంగా నరేంద్రమోడి మాటలు ఉన్నాయన్నారు. ప్రధాన మంత్రిగా నెహ్రూ స్థానంలో సర్దార్ వల్లాబాయ్ పటేల్ ఉంటే బాగుండే దనడం సరికాదన్నారు. పెట్రోల్, డిజిల్‌పై రూ. 2 కస్టమ్స్ డ్యూటిని తగ్గిస్తామన్న హామీ ఏమైందన్నారు. ప్రజల్లో తిరుగుబాటు వస్తుందనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్రంపై విమర్శలు చేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తమన్నప్పుడు చంద్రబాబు తిరుగుబాటు చేస్తే బాగుండేదని నారాయణ పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్రంపై చంద్రబాబు తిరుగుబాటు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ సీనియర్ నేత గాలి ముద్దు కృష్ణమనాయుడు సరైన వైద్యం అందకనే మృతి చెందారని ఆయన తెలిపారు. కార్పోరేట్ ఆసుపత్రులు కూడా డెంగ్యూ వ్యాధిని గుర్తించలేకపోవడం దురదృష్టకరమన్నారు. తెలుగు రాష్ట్రాల పట్ల బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమను చూపిస్తున్నాయని చాడా వెంకట్‌రెడ్డి విమర్శించారు.

దూకుడు తగ్గొద్దు

● సమన్వయంతో సాగుదాం ● జనాభీష్టమే దేశం అజెండా
● తాజా పరిణమాలపై చర్చ ● టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు

అమరావతి, ఆంధ్రప్రభ: ఉభయ సభలలో ఉద్యమాన్ని ఉధృతం చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల పక్షాన వాణిని వినిపించడంలో ఎం.పి.లు కృతకృత్యులయ్యారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రశంసించారు. రాష్ట్రా నికి జరిగిన అన్యాయంపై ప్రజల ఆకాంక్షలకనుగుణంగా వ్యవహరించడంలో కేంద్రం విఫలమైందని వ్యాఖ్యానించారు. దుబాయ్ పర్యటన నుంచి శుక్రవారం ఉదయం ముఖ్య మంత్రి విజయవాడకు తిరిగి వచ్చారు. అనంతరం ఆయన తెలుగుదేశం లోక్‌సభ, రాజ్యసభసభ్యులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కేంద్రం తీరు, పార్లమెంట్‌లో ఆందోళన వంటి అంశాలపై చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్ధేశం చేశారు. ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న దశ లో తెలుగుదేశం సభ్యులను సస్పెండ్ చేసే అవకాశం లేకపోలేదని, అయినప్పటికీ వెనకంజ వేయాల్సిన అవసరం లేదని ఎం.పి.లతో అన్నారు. న్యాయమైన డిమాండ్లపై ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టీపట్టనట్టువ్యవహరించడం జరుగుతోందని వ్యాఖ్యానించారు.రాష్ట్ర విభజన అనంతరం పరిణామాలను మరోసారి ప్రస్తావించిన ముఖ్యమంత్రి తాజాగా భారతీయ జనతా పార్టీ కూడా కాంగ్రెస్ బాటలోనే పయనిస్తోందని పేర్కొన్నట్టు సమాచారం. ప్రజల ఆకాంక్షలను పార్లమెంట్‌లో ప్రతిబింబింపజేయాల్సిందేనని, ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరిగేదాకా కేంద్రంపై అన్ని విధాలా ఒత్తిడి తేవాలని చంద్రబాబునాయుడు టిడిపి పార్లమెంట్ సభ్యులను కోరారు. ఇప్పటికే ఎం.పి.లు కేంద్రంలో కదలిక తేవడంలో విజయం సాధించారని, మరింతగా గట్టిగా పోరాడాల్సిందేనని కోరారు. రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని, జనం ఆకాంక్షే కర్తవ్యంగా ముందుకు సాగాలని గుర్తు చేశారు. మళ్ళీ మార్చి 5 వ తేదీన పార్లమెంట్ సమావేశమయ్యే అవకాశం వుంటుందని అంటూ సోమవారం నుంచి అనుసరించిన కార్యాచరణపై మళ్ళీ చర్చిద్దామని ముఖ్యమంత్రి పార్లమెంట్ సభ్యులతో చెప్పారు. ఇకనుంచి ఏదైనా చేతల్లో చేసి చూపిస్తేనే ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితులు వున్నాయని, ఇప్పటికే టిడిపి వ్యూహం ఫలితంగా విభజన అంశాలన్నీ దేశవ్యాప్తమయ్యాయని ముఖ్యమంత్రి చెప్పారు. మిత్రపక్షధర్మంగా ప్రజలలో నెలకొన్న అసంతృప్తిని కేంద్రం దృష్టికి తీసుకుపోవడంలో సఫలమయ్యామని అన్నారు.

సంక్షేమమే మన విజయాస్త్రం

- సంక్షేమ పథకాలను సామాన్య ప్రజల్లోకి తీసుకెళ్లండి
- అప్పుడే బీజేపీ గెలుపు సులువు
- వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సంక్షేమ ప్రచారం
- ప్రతిష్టాత్మక ఆరోగ్య బీమాయే మనకు దీమా
- ఎంపీలకు ప్రధాని మోడీ దిశానిర్దేశం

న్యూఢిల్లీ: సంక్షేమ పథకాలను సాధారణ ప్రజానీకంలోకి తీసుకెళ్లినప్పుడే వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు సులువౌతుం దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్టీ ఎంపీలకు దిశానిర్ధేశం చేశారు. కేంద్ర బడ్జెట్ లోని సంక్షేమ ఫలాలు గురించి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించాలని ఎంపీలు సూచించారు. సామాన్య ప్రజలకు ఉపయోగపడే పథకాల గురించి విస్తృతమైన ప్రచారం అవసర మన్న మోడీ.. ఇందుకోసం ఎంపీలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీల కు పలు అంశాలపై దిశానిర్దేశం చేసిన ప్రధాని.. సంక్షేమమే తమ ప్రచా రాస్త్రమని వెల్లడించారు.ఇటీవలి బడ్జెట్ లో ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రకటించిన సంక్షేమ ప థకాల గురించి ప్రజల్లో అవగా హన పెంచాల్సిన బాధ్యత ఎంపీలపై ఉందని గుర్తు చేశారు.

ఆరోగ్య బీమాయే బీజేపీకి దీమా

రాహుల్ తీరు అప్రజాస్వామికం: అమిత్‌షా

ఈ సందర్భంగా అమిత్ షా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.రాహుల్ గాంధీ లోక్ సభలో అప్రజాస్వామిక రాజకీయాలకు తెరతీశారని దుయ్యబట్టారు. లోక్ సభలో ప్రధాని ప్రతిష్టాత్మక జాతీయ ఆరోగ్య బీమా పథకం ద్వారా 10 కోట్ల పేద కుటుంబాలకు లబ్ది చేకూరనుందన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని పిలుపు నిచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆరోగ్య బీమాపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత ఎంపీలదేనని స్పష్టం చేశారు. ఈసమావేశానికి కొంతమంది ఎంపీలు ఆలస్యంగా రావడం గమనించిన ప్రధాని.. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతోనే ఆయా నియోజక వర్గాల్లో బీజేపీ నాయకుల గెలుపు ఆధారపడి ఉంటుందని.. వారి గెలుపే పార్టీ గెలుపుగా అభివర్ణించారు. ఎంపీలు వారివారి నియోజకవర్గాల్లో మాక్ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి బడ్జెట్ పేర్కొన్న పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈనెల 18న త్రిపుర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గురువారం నాటి తన ర్యాలీకి ప్రజల నుంచి వచ్చిన ఆదరాభిమానాలను గుర్తు చేస్తూ.. ప్రతీ రాష్ట్రంలోనూ ప్రజల్లో ఇలాంటి ఉత్సాహాన్ని కలిగించాలని ఎంపీలకు సూచించారు.



మోడీ ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రవర్తించిన తీరు గర్హనీయమని మండిపడ్డారు. మోడీ ప్రసంగాన్ని కాంగ్రెస్ నాయకులు అవహేళన చేయడా న్ని షా తప్పుబట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి లోక్‌సభ లో తెలిపే ధన్యవాదాల తీర్మానంపై ప్రధాని ప్రసంగిస్తుండగా ప్రతిపక్షాలు అడ్డుకోవడం పార్లమెంట్ చరిత్రలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ అంశానికి సంబంధించిన సమగ్ర వివరాలు ప్రజల ముందు పెట్టడం వీలుకాదని అన్నారు.

మూడోసారి అదే మాట



ఏపీ ప్రత్యేకసాయంపై కసరత్తు తుదిదశకు: జైట్లీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: కేంద్రప్రభుత్వం మళ్లీ పాత పాటే పాడింది. ఏపీ విభజన చట్టం హామీల అమలుపై పార్లమెంటులో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మూడో సారి పాత ప్రకటనే చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక సాయాన్ని ప్రత్యామ్నాయ పద్దతిలో అందజేసేందుకు జరుగుతున్న కసరత్తు తుది దశకు చేరుకుందని, త్వరలోనే దీనిని ఖరారు చేస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీ రాజ్యసభలో తెలిపారు. కొన్ని రోజులుగా ఏపీ ఎంపీలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ రాజ్యసభలో ప్రకటన చేశారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో చాలా హామీలు అమలు చేశామని, మరిన్ని అమలు చేయాల్సి ఉందన్నారు. దానికి సంబంధించిన పని కొనసాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అవశేష ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకపోవడం చాలా ఆదాయం కోల్పోయారని చెప్పారు. అనేక సంస్థలు తెలంగాణలో ఉండిపోయాయని తెలిపారు. అయితే తాము ఇప్పటికే అనేక సంస్థలను నెలకొల్పామని, రాజధానికి నిధులు ఇచ్చామని చెప్పారు. పోలవరానికి ఎక్కడా కూడా నిధులు ఆగలేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిధులు సమకూరుస్తూనే ఉన్నామన్నారు.

రెవెన్యూ లోటుకు సంబంధించి కొంత ఇచ్చామని, . బకాయిలపై చర్చించి చెల్లిస్తామన్నారు. కడపలో ఉక్కు కర్మాగారం, దుగరాజపట్నం ఓడరేవు, విశాఖకు రైల్వే జోన్, విశాఖ పెట్రో కాంప్లెక్స్, విశాఖచెన్నైబెంగళూరు పారిశ్రామిక కారిడార్ తదితర అంశాలకు సంబంధించి ఆయా శాఖలు పనిచేస్తున్నాయని, వాటిపై త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చారు. రాజ్యసభలో టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు నిరసన కొనసాగించారు. టీడీపీ ఎంపీలు సిఎం రమేష్, టిజి.వెంకటేష్, సీతామహాలక్ష్మి, గరికపాటి మోహన్ రావు వైఎస్సార్సిపి ఎంపీ విజయసాయిరెడ్డి పలు సార్లు ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు ప్రదర్శించారు.

ప్రత్యేక హోదా ఇవ్వాలి : విజయసాయిరెడ్డి

విభజనలో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేశారు. ఏపికి ప్రత్యేక హోదా ఇస్తామని నాటి ప్రధాని హామీ ఇచ్చారు. ప్రత్యేక హోదా ఏపికి లైఫ్‌లైన్ లాంటిదని అన్నారు. స్పెషల్ ప్యాకేజీ ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదని అన్నారు.

హుందాగా వ్యవహరించాలి : వెంకయ్య

రాజ్యసభ చర్చలకు వేదిక అని, ఆందోళనలు చేయడానికి కాదని, సభ్యులు హుందాగా వ్యవహరించాలంటూ రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు రాజ్యసభలో విజ్ఞప్తి చేశారు. అధికార, విపక్ష సభ్యులు సరైన భాష ఉపయోగించాలని కోరారు. వరుసగా ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ తుడిచిపెట్టుకుపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

భ్రమల్లో జీవిస్తున్న లోకజ్ఞాని చిదంబరం

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరంపై శుక్రవారం వ్యంగ్యాస్త్రాలు సంధించారు. లోకజ్ఞానిగా పేరుగడించిన ఆయన తప్పుడు భ్రమల్లో జీవిస్తున్నారని వ్యాఖ్యానించారు. యూపీఏ 10 సంవత్సరాల హయాంలో దారుణమైన వైద్యుని చేతుల్లో పడిన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత దుర్బలమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా పతనావస్థకు చేరుకుందని అన్నారు. బీజేపీ హయాంలో భారతీయ ఆర్థిక వ్యవస్థ 2014 నుంచి విధానపరమైన పక్షవాతం నుంచి నిర్మాణాత్మక సంస్కరణల వరకు ప్రయాణాన్ని పూర్తి చేసిందని, అది వెలిగిపోతున్న ఆర్థిక వ్యవస్థగా మార్చిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానంగా గత యూపీఏ పాలనకు, ప్రస్తుత పాలనకు పోలిక తెస్తున్నట్టుగా జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు, కరెంటు ఖాతా లోటుపై గణాంకాలను ఆర్థిక మంత్రి ఏకరవు పెట్టారు. కొన్ని సందర్భాల్లో మీ వైఖరి మీరు కూర్చున్న చోటుపై ఆధారపడి ఉంటుందని చెప్పడం ద్వారా అధికార పక్షం స్థానాల నుంచి ప్రతిపక్షం స్థానాలకు వెళ్ళాక చిదంబరం వైఖరిపై జైట్లీ చురకలు వేశారు.

దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దాం

రైతులకు కనీస మద్దతు ధర ఇచ్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ అన్నారు. ఎ2 ఎఫ్‌ఎల్ తో పాటు 50శాతం అదనంగా ఉండేలా కనీస మద్దతు ధరను నిర్ణయిస్తామని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన రాజ్యసభలో సమాధానమిచ్చారు. జిఎస్టీ కౌన్సిల్ అద్భుతంగా పనిచేస్తోందని తెలిపారు. జిఎస్టీతో పన్నుల రాబడి పెరిగిందని, ఎగవేతలు తగ్గిపోయాయని చెప్పారు. ప్రత్యక్ష పన్నుల ద్వారా ఆదాయం 19శాతం పెరిగిందని తెలిపారు. పన్నులు చెల్లించే వారి సంఖ్య, పరిధి పెరిగిందని చెప్పారు. నల్లధనం నియంత్రణకు తీసుకున్న చర్యల కారణంగానే ఇది సాధ్యమైందన్నారు. విధాన నిర్ణయ రాహిత్యం నుంచి వ్యవస్థల సంస్కరణల దిశగా తాము ప్రయాణిస్తున్నామని, ముక్కలైన ఆర్థిక వ్యవస్థను ధృడంగా చేశామని అన్నారు.

ట్రంప్ వలస విధానంతో..

తగ్గనున్న గ్రీన్ కార్డుల సమస్య

- లాటరీ విధానం స్వస్తికి ట్రంప్ నిర్ణయం
- ప్రతిభావంతులకు అందలం
- ప్రతీ ఏడాది7శాతం మందికే గ్రీన్ కార్డులు
- ఇబ్బందుల్లో వలసదారులు

వాషింగ్టన్ : అమెరికా వలసదారులకు అందించే గ్రీన్ కార్డు విషయంలో వైట్‌హౌస్ అధికారులు కీలక ప్రకటన చేశారు. లాటరీ పద్ధతిని వీసా అందించే విధానానికి స్వస్తి చెప్పాలని ట్రంప్ నిర్ణయించారని, ప్రతిభావంతులకు మాత్రమే వీసా అందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తారని వివరించారు. దీంతో గ్రీన్‌కార్డులు పొందే వారి సంఖ్య తగ్గుతుందని, దీంతో పాటు మున్ముందుకు కోటాను సైతం రద్దుచేసే ఆలోచనలో అమెరికా ప్రభుత్వం ఉందని వివరించారు. హెచ్-1బీ వీసాపై అమెరికాకు వచ్చిన చాలా మంది గ్రీన్ కార్డు పొందడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిభావంతులైన వారు భారతీయులు అమెరికాకు వస్తే ప్రస్తుత నిబంధనలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైట్‌హౌస్ అధికారులు వివరించారు. అమెరికా వచ్చి గ్రీన్ పొందగోరే వారు, లేదంటే శాశ్వత నివాసం పొందాలనుకునే వివిధ దేశీయులకు ప్రతీ సంవత్సరానికి కేవలం 7 శాతం కోట ఉంటుందని వివరించారు. ఇది



ఇలాగే కొనసాగితే మాత్రం ప్రస్తుతం గ్రీన్ కార్డు పొందాలనుకునే భారతీయులకు 70 ఏళ్ల వేచి చూడాల్సి వస్తుంది. గత వారం చాలా మంది ప్రతిభావంతులపై భారతీయులు అమెరికాలోని వివిధ రాష్ట్రాల నుండి వాషింగ్టన్ చేరుకుని ట్రంప్ పరిపాలనాధి కారులతో పాటు కాంగ్రెస్ సభ్యులతో మాట్లాడారు. వలస విధానాల్లో మార్పు తీసుకునిరావాలని కోరారు. లాటరీ విధానాన్ని రద్దు చేస్తే బాగుంటుందని, కాంగ్రెస్ కంటే మంచి తరహా నిబంధనలు తీసుకొచ్చి అమెరికా వాసులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ట్రంప్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతిభావంతులు, నిపుణులను అమెరికాకు వచ్చేలా వలస విధానాన్ని రూపొందిస్తామని ట్రంప్ పరిపాలనాధికారులు వివరించారు. భారతీయులు లాటరీ విధానానికి స్వస్తి పలకాలని కోరిన సాయంత్రమే ట్రంప్ దీనిపై అధికారికంగా ప్రకటన చేయడం గమనార్హం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. చట్టబద్ధమైన వలస విధానం వైపు వెళ్తున్నారని అనుకుంటున్నాను. చట్టంలో సవరణలు చేసి గొలుసుకట్టు వలస విధానం అనేది మెరిట్ ఆధారంగా రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అనుకుంటు న్నాను అని వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రెటరీ రాజ్ షా విలేకరు లకు వివరించారు. అమెరికాకు వచ్చే వాళ్లు ప్రతిభ కలిగి ఉండి, జాతీయత, మతం వంటి పక్షపాత ఆలోచనలు లేకుం డా ఉండాలని ట్రంప్ పరిపాలనాధి కారులు కోరుతున్నారని షా తెలిపారు. అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ట్రంప్ ప్రయత్నిస్తు న్నారని, వచ్చే వారి చదువుకు సంబంధించిన పుట్టుపూర్వోత్తరాలు, పని ఒత్తిడి తట్టుకునేవారు, అదేవిధంగా పనిలో అమెరికా వాళ్లకు సాయం అందించేవారు ఇలా అన్నికోణాల్లో చూసి ఎంపిక ఉంటుందని షా వివరించారు. ప్రతీ ఏడాది సగటున 50వేల గ్రీన్ కార్డులను లాటరీ విధానం ద్వారా కేటాయించొచ్చు. అది కూడా ఎలాంటి అవకాశం లేకుండా ప్రతిభ ఆధారంగా ఉద్యోగ వీసాపై అమెరికాకు వచ్చిన వారికి ప్రాధాన్యత ఉండాలని సెనేట్ రిపబ్లికన్ పాలసీ కమిటీ యోచిస్తున్నది.

మాల్దీవుల్లో రాజకీయ సంక్షోభంపై

మోడీకి ట్రంప్ ఫోన్

- రక్షణ, ఆర్థిక స్థితిగతులపై చర్చ
- మయన్మార్ రోహింగ్యాల వసతుల ప్రస్తావన
- ఏప్రిల్‌లో ఇండో- అమెరికా రక్షణ వ్యవస్థపై సమావేశం

వాషింగ్టన్ : మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభంపై భారత్ ప్రధాని నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారు. మాల్దీవుల్లో నెలకొన్న పరిస్థితులపై ఇరు దేశాల ప్రధానులు ఆందోళన వ్యక్తం చేసినట్టు వైట్‌హౌస్ అధికా రులు వివరించారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టాన్ని సంరక్షించాల్సిన బాధ్యత గౌరవిం చాల్సిన బాధ్యత మాల్దీవులతో పాటు ఇతర దేశాలపై కూడా ఉందని ఇరువురు అభిప్రాయపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్‌లోని పరిస్థితులతో పాటు ఇండో-పసిఫిక్ ప్రాంతంలోని రక్షణ చర్యలపై ఇరు దేశాల అధ్యక్షులు చర్చించుకున్నట్టు వైట్‌హౌస్ వర్గాలు వివరించాయి. దీనికి యమీన్ అంగీకరించకపోవడంతో గత కొన్ని రోజులుగా రాజకీయ సంక్షోభం తలెత్తింది. దీంతో మాల్దీవుల రాజధాని మేల్‌లో నిరసన లు మిన్నంటాయి. అంతటితో ఆగని ప్రభుత్వం సుప్రీం కోర్టు చీఫ్ జడ్జితో పాటు మరో జడ్జిని అరెస్టు చేసింది. ఇండో-పసిపిక్ రీజయన్‌లో రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయ డానికి కలిసి పనిచేయనున్నట్టు వివరించారు. దక్షిణాసియా వ్యూహంతో పాటు ఆఫ్గనిస్థాన్‌లో పరిస్థితులు చక్కదిద్దడానికి రక్షణ పరమైన సహాయం అందించే విషయమై ట్రంప్, మోడీ చర్చించుకున్నారని అధికారులు తెలిపారు. సుమారు 6,80,000 మంది రోహింగ్యాలు పొరుగుదేశం బంగ్లాదేశ్‌కు వెళ్లిపోయారని, ప్రస్తుతం బంగ్లా ఆర్థిక వ్యవస్థ పరంగా తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటుందనే విషయమై మాట్లా డుకున్నారు. కొన్ని రోజుల క్రితమే రోహింగ్యాలకు వసతులు కల్పించ డం, తిరిగి వారిని మయన్మార్ పంపించ డానికి గాను మయ న్మార్, బంగ్లాదేశ్‌లు ఒప్పందం కుదుర్చుకు న్నాయి. కానీ రోహిం గ్యాలు తిరిగి మయన్మార్ వెళ్లడం ఇది సరైన సమయం కాదని అమెరికా భావిస్తున్నట్టు ట్రంప్ మోడీకి ఫోన్‌లో వివరించారు. ఉత్తర కొరియా అణ్వాస్త్రాల ప్రయోగం, కొరియాను అణ్వాయుధాల విషయంలో నియంత్రించగలిగే అంశంపై ట్రంప్, మోడీ చర్చించినట్టు వైట్‌హౌస్ అధికారులు తెలిపా రు. రక్షణ, ఆర్థిక రంగం పటిష్టం చేసే అంశాలపై ధికారులు ఏప్రిల్‌లో సమావేశం నిర్వహించడానికి నిర్ణయించుకున్నారు. 2 ప్లస్ 2 అనే నినాదాన్ని జూన్, 2017లో వైట్‌హౌస్‌లో ట్రంప్, మోడీ సమావేశమైన సందర్భంగా తెరపైకి వచ్చింది. 2 ప్లస్ 2 అంటే.. భారత్‌లో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ఉన్నారు. అదేవిధంగా రక్షణ శాఖ మంత్రిగా నిర్మలాసీతారామన్ ఉన్నారు. అమె రికాలో కౌంటర్ పార్ట్ కార్యదర్శిగా రెక్స్ టిల్లర్‌సన్ ఉండగా, రక్షణ శాఖ కార్యదర్శిగా జిమ్ మట్టీస్ ఉన్నారు. భారత్ నుండి ఇద్దరు, అమెరి కా నుండి ఇద్దరు సమావేశం కావడం నేపథ్యం లో 2 ప్లస్ 2 అనే నినాదం తెరపైకి వచ్చింది.



ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం

వాషింగ్టన్ : ఎంతో ఉత్కంఠభరిత పరిస్థితుల మధ్య అమెరికన్ కాంగ్రెస్ ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపింది. బిల్లు ఆమోదం పొందడానికి కొన్ని గంటల సమయం పట్టింది. అమెరికా రెండో షట్‌డౌన్‌కు మూడు వారాల్లో ముగింపు లభించింది. మార్చి 23 వరకు ప్రభుత్వ నిధులు సమకూర్చేందుకుగాను ద్వైపాక్షిక ప్యాకేజీకి మద్ద తుగా సభలో 240కు 186 ఓట్లు నమోదయ్యాయి. రానున్న రెండు సంవత్సరాలకు గాను ఫెడరల్ ఖర్చు సుమారు 300 బిలియన్ డాలర్ల పరిమితిని ఎత్తేసింది. ఈ నిర్ణయాన్ని సెనేట్ అర్ధరాత్రి ప్రకటించింది. బిల్లులో నిధుల కేటాయింపుపై అసంతృప్తితో ఓ సెనేటర్ బిల్లు ఆమోదానికి అంగీకరించ లేదు. దీంతో కాంగ్రెస్‌కు అర్ధరాత్రి గడువుకాస్త ముగిసిపో యింది. అనంతరం చర్చలు సత్ఫలితాలు ఇవ్వడం, ట్రంప్ సంతకం చేయడంతో మూడు వారాల షట్‌డౌన్ వీగిపోయింది. దీంతో అమెరికాలోని కార్యాలయాలు యథావిధిగా కొనసాగే అవకాశం వచ్చింది.

చర్చలతో సమస్య పరిష్కారం

భారత్‌తో కలిసి పని చేస్తాం: చైనా

బీజింగ్ : మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభం నేపథ్యంలో శాంతి నెలకొల్పేందుకు భారత్‌తో కలిసి పని చేస్తామని చైనా ప్రకటించింది. భారత్ చర్చల ద్వారా మాల్దీవుల్లోని రాజకీయ సంక్షోభానికి తెరదించాలని చైనా శుక్రవారం కోరింది. అక్కడి పరిస్థితులపై చర్చించడానికి ఢిల్లీతో కూడా బీజింగ్ సంబంధాలు కొనసాగిస్తున్నదని చైనా అధికారులు ప్రకటించారు. మాల్దీవుల్లో పరిస్థితి మరింత క్లిష్టతరం కావాలని చైనా ఆలోచించడం లేదని వివరించింది. అంతర్జాతీయ సమాజం మాల్దీవుల సార్వభౌమత్వాన్ని, స్వేచ్ఛను గౌరవించాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి జెంగ్ షుయాంగ్ అన్నారు. ప్రస్తుత పరిస్థితులు మాల్దీవుల అంతర్గత వ్యవహారం. ఇలాంటి పరిస్థితులు సంబంధిత పార్టీల సంభాషణ, చర్చల ద్వారా పరిష్కారం అవుతుందని జెంగ్ షుయాంగ్ అభిప్రాయపడ్డారు. మాల్దీవుల అధ్యక్షుడు యమీన్, చైనాకు ఆ దేశ ఆర్థికాభివృద్ధి శాఖ మంత్రి మహ్మద్ సయీద్‌ను పంపించారు. మాల్దీవుల పరిస్థితి మరింత ముదిరే అవకాశం ఉందని ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఐక్యరాజ్య సమితి అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ మిరోస్లేవ్ జెంకా మాట్లాడుతూ.. ఇలాగే కొనసాగితే పరిస్థితి చేయి దాటిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ అయినా ఏ దేశం అయినా దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం మంచి పద్ధతి కాదని వివరించారు. అంతర్జాతీయ సమాజాన్ని గౌరవించాలని, పరిస్థితిని అదుపులోకి తీసుకొని అభివృద్ధి జరిగేలా దోహదపడాలని ఆయన సూచించారు. చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్‌యితో సయీద్ సమావేశం అయ్యారు. ప్రస్తుత పరిస్థితులను చైనాకు సయీద్ వివరించారు. ఈ సందర్భంగా వాంగ్‌యి మాట్లాడుతూ.. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే దిశగా తమ సాయం ఉంటుందని హామీ ఇచ్చారు.

అమెరికాలో వైద్యునిపై అవినీతి కేసు

వాషింగ్టన్: అమెరికాలో భారత సంతతికి చెందిన వైద్యుడిపై అవినీతి కేసు నమోదైంది. భారత సంతతి వైద్యునితోపాటు మరో ఇద్దరిపై కూడా అధికారులు అవినీతి, కుట్ర కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన అమెరికన్ న్యాయశాఖ అధికారులు వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఇండో అమెరికన్ వైద్యుడు పద్మినీ నాగరాజ్ (60), ముహమ్మద్ కలీం అర్షద్(62), జోసెఫ్ హెన్స్(61) ముగ్గురిపై ఆరోగ్య బీమా విషయంలో అక్రమ చెల్లింపులకు కుట్ర పన్నారని ఆరోపణలతో కేసు నమోదు చేశామన్నారు. అర్షద్, నాగరాజ్ ఇరువురిపై హెల్త్ కేర్ స్కీం విషయంలో అవకతవకలకు పాల్పడ్డారని ఒకే తరహా ఆరోపణలతో కేసు నమోదు చేశామని న్యాయశాఖాధికారులు వెల్లడించారు. కుట్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు ముగ్గురూ లూసియానా ప్రాంతానికి చెందినవారని తెలిపారు. వీరు మానసిక వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ఒక హెల్త్ ఏజెన్సీ యజమానికి లంచమిచ్చి అవసరం లేకున్నా ఔట్ పేషెంట్లను వైద్య సేవలు కోసం పంపించవలసిందిగా తప్పుడు ఒప్పందంతో కుట్ర పన్నారని అన్నారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న మూడో వ్యక్తి హెన్స్ సదరు కంపెనీలో మార్కెటర్‌గా పనిచేస్తున్నాడని తెలిపారు. ఇతను లంచాలు, హెల్త్ ఏజెన్సీ నుంచి అక్రమ చెల్లింపుల విషయంలో వైద్యులకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడన్నారు.

ఫలించిన రవిశంకర్ మధ్యవర్తిత్వం

బెంగళూరు: అయోధ్యలో వివాదాస్పద బాబ్రీ మసీదు-రామజన్మభూమి ప్రాంతం నుంచి మసీదును ఇతర ప్రాంతానికి తరలించాలనే ప్రతిపాదనకు ముస్లిము నేతలు మద్దతు ఇచ్చారని శ్రీశ్రీ రవిశంకర్ వ్యవస్థాపకులుగా వ్యవహరిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్(ఏఓఎల్) ఒక ప్రకటనలో పేర్కొంది. రవిశంకర్ అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు, సున్నీ వక్ఫ్ బోర్డు సభ్యులతో పాటుగా పలువురు ముస్లిము నేతలతో శుక్రవారం సమావేశమయ్యారు. అయోధ్య వివాదంపై కోర్టు వెలుపల పరిష్కారానికి వారు మద్దతు తెలిపారు. ముస్లిము నేతల్లో అనేకులు ఈ వ్యవహారానికి సహకరిస్తున్నారని ఏఓఎల్ తెలిపింది. ముస్లిము పర్సనల్ లా బోర్డు ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మౌలానా సయీద్ సల్మాన్ హుస్సేన్ నద్వి, ఉత్తరప్రదేశ్ సున్నీ వక్ఫ్ బోర్డు చైర్‌పర్సన్ జుఫర్ అహ్మద్ ఫరూఖీ, లక్నోలో టీలా వలి మసీదుకు చెందిన మౌలానా వసీఫ్ హసన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ అనిస్ అన్సారీ, వ్యాపారవేత్త ఎ.ఆర్.రెహ్మాన్, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

లోయా మృతిపై సిట్ ఏర్పాటు చేయండి

న్యూఢిల్లీ: సీబీఐ జడ్జి బి.హెచ్.లోయా మృతి కేసును కోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందానికి(ఎస్ఐటీ) అప్పగించాలని, సిబిఐ లేదా ఎన్ఐఏ పట్ల తమకు ఎలాంటి నమ్మకం లేదని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు విపక్షఎంపీలు శుక్రవారం విన్నవించుకున్నారు. ఈమేరకు కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకేతో పాటుగా పలు రాజకీయ పక్షాలకు చెందిన ఎంపీలు రాష్ట్రపతిని కలుసుకొని ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. న్యాయవ్యవస్థ సమున్నత స్థాయిని నిలబెట్టడానికి ఈ అంశంలో మీ జోక్యాన్ని అభ్యర్థిస్తున్నాము. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో, సర్వోన్నత న్యాయస్థానం ఎంపిక చేసిన స్వతంత్ర అధికారులతో కూడిన బృందం ద్వారా సమగ్రమైన దర్యాప్తు అవసరమైనది అని వినతిపత్రంలో పేర్కొన్నారు. టీఎంసీ, ఎస్పీ, ఎన్‌సీపీ, డిఎంకె, ఆర్జేడీ, ఆప్‌తో కలుపుకొని 15 పార్టీలకు చెందిన 114 మంది ఎంపీలు వినతిపత్రంపై సంతకాలు చేశారు.

వ్యవసాయ వ్యాపారానికి ఊతం: కోవింద్

న్యూఢిల్లీ: 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేసే దిశగా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తెలిపారు. ఆ క్రమంలో వ్యవసాయ వాణిజ్యానికి ప్రోత్సాహం నిమిత్తం ఒక నవకల్పన మరియు పరిపాక కేంద్రం(ఇన్నోవేషన్ అండ్ ఇన్‌క్యుబేషన్ సెంటర్) ఏర్పాటు చేయాలని భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐఏఆర్ఐ) కు రాష్ట్రపతి విజ్ఞప్తి చేశారు. సదరు కేంద్రానికి నిధులు అందించాలని వెంచర్ పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిచ్చారు. ఇక్కడి ఐఏఆర్ఐకు చెందిన పోస్ట్‌గ్రాడ్యుయేట్ స్కూల్ 56వ స్నాతకోత్సవ కార్యక్రమంలో రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఒక స్తంభమని మహాత్మాగాంధీ అన్నారు. ఇది నేటికీ వాస్తవమే. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఆదాయం మెరుగుదల దేశ ప్రాధాన్యత కావాలి అని తెలిపారు. విద్యార్థులు వ్యవసాయ వ్యాపారం చేయడానికి సహకరించేలా ఒక నవకల్పన, పరిపాక కేంద్రాన్ని నెలకొల్పాలి. వ్యవసాయ వ్యాపారం ఆరంభించడానికి అనేక పథకాలు ఉన్నాయి. కేంద్ర వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ త్రిలోచన్ మొహాపాత్ర, ఐఏఆర్ఐ డైరెక్టర్ ఎ.కె.సింగ్, తదితరులు పాల్గొన్నారు.

మే 6న నీట్.. మార్చి10 వరకు ఫీజు చెల్లింపు

న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య విద్య అభ్యసించేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) మే 6వ తేదీన నిర్వహించనున్నారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించారు. మార్చి 9వతేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మార్చి10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. నమోదు చేయించుకున్న ప్రతి అభ్యర్థి ఆధార్ నెంబర్ నమోదు చేయాలన్నారు. అస్సాం, మేఘాలయ, జమ్మూ కాశ్మీర్‌కు చెందిన దరఖాస్తుదారులకు మాత్రమే ఆధార్ నమోదు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ప్రవేశ అర్హత పొందిన అభ్యర్థులుకు అడ్మిషన్ తేదీనాటికి 17సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. వయోపరిమితి విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగ అభ్యర్థులకు ఆయా వర్గాలను అనుసరించి సడలింపు ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే అప్లయ్ చేయాలన్నారు. మిగతా వివరాలకు డబ్ల్యూ డబ్ల్యూడబ్ల్యూ.సిబిఎస్ ఎన్ఈఈటి. ఎన్‌సి.ఇన్ వెబ్‌సైట్‌ను చూసి తెలుసుకోవచ్చన్నారు.

మార్చి11న లోక్‌సభ ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ: యూపీ సీఎం రాజీనామాతో ఖాళీ అయిన గోరక్‌పూర్ లోక్‌సభ స్థానంతోపాటు, డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య రాజీనామా చేసిన పూల్పూర్ ఎంపీ స్థానానికి, బీహార్‌లోని అరేరియా లోక్‌సభ స్థానానికి మార్చి11న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం శుక్రవారం ప్రకటించింది. యూపీలోని రెండుస్థానాలతోపాటు బీహార్‌లోని ఆర్జేడీ ఎంపీ మహమ్మద్ తస్లీముద్దీన్ మరణంతో ఖాళీ అయిన అరేరియా స్థానానికి సైతం అదేరోజున ఉప ఎన్నిక జరుగుతుందని ఈసీ వెల్లడించింది. యూపీ సీఎం ఆదిత్యనాథ్, మౌర్య తమ లోక్‌సభ స్థానాలకు రాజీనామా చేయటంతో ఈసీ ఉప ఎన్నికలు నిర్వహిస్తోంది. గతేడాది రాజ్యసభ స్థానానికి రాజీనామా చేసిన బహుజన్ సమాజ్‌వాద్ పార్టీ అధినేత్రి మాయావతి పూల్పూర్ లోక్‌సభ స్థానానికి పోటీ చేసే అవకాశం ఉంది అయితే ఇప్పటివరకూ ఆ పార్టీ నుంచి ఎటువంటి అధికారక ప్రకటన వెలువడలేదు. కాగా యూపీ సీఎం ఆదిత్యనాథ్‌కు ఈ ఉప ఎన్నికలు ఓ పరీక్షగా నిలవనున్నాయి. ప్రజల్లో యోగి సర్కార్‌కు ఉన్న విశ్వాసం ఈ ఎన్నికల్లో వెల్లడికానుంది. ఇదిలాఉండగా బీహార్ సీఎం నితిశ్ కుమార్‌కు కూడా ఈ ఉప ఎన్నిక కీలకంకానుంది. కాంగ్రెస్, ఆర్జేడీ నుంచి బయటకువచ్చి కేంద్రంలో అధికార భారతీయ జనతాపార్టీతో చేతులు కలిపిన అనంతరం మొదటిసారి బీహార్ సీఎంగా ఆయన ఈ ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. అంతేకాక ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్ యాదవ్ రాజకీయ భవిత ఈ ఉప ఎన్నికపైనే ఆధారపడి ఉంది.

ఏపీ డిమాండ్ల సాధనకు ఏకమౌదాం

న్యూఢిల్లీ: ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఐక్యాంగా ఉండాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు నెరవేర్చడంతో అన్ని పార్టీలు కలిసికట్టుగా ముందుకుసాగాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం మరింత వేగంగా పూర్తయ్యేలా సహకరించాలన్నారు. ఏపీ ప్రజల డిమాండ్లయిన, ప్రత్యేక హోదా, పోలవరం నిర్మాణం వేగవంతం విషయంలోకాంగ్రెస్ పార్టీపూర్తిమద్దతునిస్తుందని చెప్పారు. ఏపీ డిమాండ్ల సాధనలో అన్ని రాజకీయపార్టీలు ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందన్న రాహుల్ గాంధీ.. అందుకోసం కేంద్రంపై ఒత్తిడిపెంచాలని కోరారు. ఏపీ డిమాండ్ల సాధన కోసం పార్లమెంట్ లో వివిధ రాజకీయ పార్టీలు ఆందోళనకొనసాగిస్తున్న నేపథ్యంలో రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఏరోస్పేస్ రంగంలో భారత్ ముందంజ

న్యూఢిల్లీ : భారత్ అతి తక్కువ ఖర్చుతో మేక్ ఇన్ ఇండియాలో భాగంగా మేజర్ ఎయిరోస్పేస్ రక్షణరంగ పరికరాలను తయారు చేస్తున్నదని, ప్రపంచ దృష్టిని ఆకర్శిస్తోందని ఏవియేషన్ ఇండస్ట్రీ అధికారులు ప్రకటించారు. భారీ సంఖ్యలో అంతర్జాతీయ స్థాయిలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు నెలకొల్పబడుతున్నాయని వివరించారు. తమ ఉత్పత్తిని పెంచి ఈ రంగాన్ని మరింత విస్తృతపర్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఏవియేషన్ ఇండస్ట్రీ అధికారులు అభిప్రాయపడ్డారు. భారీ ఏయిరోస్పేస్ రక్షణ రంగ పరికరాల తయారీలో ముందంజలో ఉండటం సంతోషంగా ఉందని బిజినెస్ డెవలప్‌మెంట్, మార్కెట్ ఎట్ మార్టిన్-బేకర్ ఏయిర్‌క్రాఫ్ట్ కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ యాండ్రీ మార్టిన్ అన్నారు. మార్టిన్-బేకర్ ఏయిర్‌క్రాఫ్ట్ కంపెనీ అనేది విమానయానంలో ఉపయోగించే ఇంజెక్షన్ సీట్లు, సేఫ్టీకి సంబంధించిన పరికరాలను అందిస్తుంది. అమెరికా తరువాత పైలట్‌కు సంబంధించిన ఇంజక్షన్ సీట్లు అందించే రెండో దేశంగా భారత్ పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. ఏయిరోస్పేస్, రక్షణ రంగ పరికరాలు సరఫరా చేసే కంపెనీల్లో 99వ స్థానంలో మార్టిన్ కంపెనీ ఉంది.

వాయుసేన గ్రూప్ కెప్టెన్ అరెస్ట్

న్యూఢిల్లీ: గూఢచర్యం అభియోగాలు ఎదుర్కొంటున్న భారతీయ వైమానిక దళం(ఐఏఎఫ్) గ్రూప్ కెప్టెన్ అరుణ్ మర్వాను అరెస్టు చేసినట్టు సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఐఏఎఫ్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం దాదాపు 10 రోజులు విచారించిన అనంతరం మర్వాను ఢిల్లీ పోలీసు శాఖలో ఉత్తర రేంజ్‌కు చెందిన స్పెషల్ సెల్‌కు బుధవారం అప్పగించినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. అధికారిక రహస్యాలు చట్టం(ఓఎస్ఏ) కింద అరెస్టయిన ఐఏఎఫ్ గ్రూప్ కెప్టెన్‌ను కోర్టు ప్రశ్నించే నిమిత్తం ఐదురోజుల పోలీసు కస్టడీకి పంపించింది. వైమానిక దళం ప్రధాన కార్యాలయం వద్ద విధులు నిర్వర్తిస్తున్న మార్వా అత్యంత గోప్యంగా ఉంచాల్సిన పత్రాలను వాట్సప్ ద్వారా ఒక మహిళకు పంపించారని అభియోగం. అతడు ఆమెతో గత డిసెంబరు నుంచి అత్యంత స్నేహితంగా వ్యవహరిస్తున్నారని పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

క్రీడాప్రభ



శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభం అదిరింది





- కొరియన్ సమైక్యత వర్ధిల్లింది
- ఇరు కొరియాల చారిత్రక కలయిక

మంచు క్రీడల ఆరంభం నింగినంటింది. బాణా సంచా వెలుగులతో మిరుమిట్లు మిన్నంటాయి. మంచు కాంతులను దశ దిశలా చాటేందుకు స్నేహాన్ని పెంపొందించేందుకా అన్నట్లు తారా జువ్వలు నింగి ఎగిశాయి. క్రీడలకు అతిథ్యం ఇస్తున్న ప్యాంగ్ చాంగ్ సందర్శకులతో నిండిపోయింది. ఈ క్రీడల ప్రారంభానికి హాజరైన దేశాధినేతల హృదయాల్లో ఆనందం ఉప్పొంగింది 17 రోజులపాటు సాగనున్న ఈ క్రీడలు అన్ని దేశాల క్రీడా అభిమానులను అలరిస్తాయనటంలో సందేహం లేదు

ప్యాంగ్ చాంగ్: శీతాకాల ఒలింపిక్స్ క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పలుదేశాల నేతలు హాజరయ్యారు. మరోవైపు ప్రారంభ వేదిక బద్ధ శత్రువులను కలిపింది. క్రీడల ద్వారా స్నేహం పెరుగుతుందన్న సామెత నిజమైంది. 63 ఏళ్లుగా పక్కపక్కనే ఉంటూ శత్రుత్వంతో రగులుతున్న ఉత్తర, దక్షిణ కొరియాలు కలిశాయి. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి యో జోంగ్, ఉత్తర కొరియా సెరిమోనియల్ హెడ్ ఆఫ్ ది స్టేట్ కిమ్ యాంగ్ నామ్‌లను దక్షిణా కొరియా అధ్యక్షుడు మూన్ జే ఆహ్వానించి వారితో కరచాలనం చేశారు. ఉభయ కొరియాలు కలిసి మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్నాయి. నీలం, తెలుపు రంగులతో కూడిన ఉమ్మడి పతాకంతో రెండు దేశాల క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేశారు. ఎముకలు కొరికే చలి రాత్రిలో బాణా సంచా పేలుళ్లు మిన్నంటాయి. ఆకాశం హరివిల్లులా మారింది. ఉత్తర కొరియాలో అధికారంలో ఉన్న కుటుంబానికి చెందిన ఒక సభ్యురాలు దక్షిణ కొరియాను సందర్శించడం 1950-53 కొరియన్ యుద్ధం తర్వాత ఇదే ప్రథమం.

కాగా ఉత్తర,దక్షిణ కొరియాలు కలిసి మార్చ్ ఫాస్ట్‌లో చివరిసారిగా 2006 శీతాకాల ఒలింపిక్స్‌లో పాల్గొన్నాయి. రష్యా అథ్లెట్లు తటస్థ జెండాతో మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్నారు. శుక్రవారం ప్యాంగ్ చాంగ్‌లో మైనస్ 10 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. నిర్వాహకులు క్రీడాకారులకు హీట్ ప్యాక్స్, దుప్పట్లు, టోపీలు పంపిణీ చేశారు. క్రీడల మస్కట్లుగా సూహర్యాంగ్ (తెల్ల పులి) బండబి (నల్ల ఎలుగుబంటి)లు ప్యాంగ్‌చాంగ్‌లో క్రీడాకారులను, సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి.

వింటర్ ఒలింపిక్స్‌కు ఉత్తర కొరియా అధ్యక్షుడి సోదరి

ప్యాంగ్ చాంగ్: దక్షిణ కొరియాలో ప్యాంగ్‌చాంగ్‌లో శుక్రవారం ప్రారంభమైన శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి యో జోంగ్ కలిసిన అధికారుల బృందం పాల్గొన్నారు. 23 మంది సభ్యులున్న ప్రతినిధుల బృందం ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ బృందానికి ఉత్తర కొరియా సెరిమోనియల్ హెడ్ ఆఫ్ ది స్టేట్ కిమ్ యాంగ్ నామ్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ ప్రతినిధుల బృందంలో పీస్‌ఫుల్ రీ యూనిఫికేషన్ కమిటీ అధ్యక్షుడు రి సన్ గ్వోన్ కూడా ఉన్నారు. ఉత్తర కొరియాలో అధికారంలో ఉన్న కుటుంబానికి చెందిన ఒక సభ్యురాలు దక్షిణ కొరియాను సందర్శించడం 1950-53 కొరియన్ యుద్ధం తర్వాత ఇదే ప్రథమం. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఉత్తర కొరియా సెరిమోనియల్ హెడ్ ఆఫ్ ది స్టేట్ కిమ్ యాంగ్ నామ్ దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జేను కలుసుకున్నారు.

63వ రగ్బీ నేషనల్ ఛాంపియన్‌షిప్- 2018

విజేత బీహార్ - ఒడిషా జట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన 63వ రగ్బీ నేషనల్ ఛాంపియన్‌షిప్-2018లో టోర్నమెంట్ విజేతలుగా బీహార్(బాలుర విభాగం), ఒడిషా(బాలికల విభాగం) జట్లు నిలిచాయి. అండర్-19 బాలుర విభాగంలో బీహార్ జట్టు 17-14 స్కోరుతో ఒడిషా జట్టుపై గెలుపొంది విజేతగా నిలువగా, ఒడిషా జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఛత్తీస్‌గఢ్ జట్టు 10-05 స్కోరుతో ఢిల్లీ జట్టును ఓడించి తృతీయ స్థానాన్ని సాధించింది. బాలికల విభాగంలో ఒడిషా జట్టు 31-05 స్కోరుతో బీహార్ జట్టుపై గెలుపొంది విజేతగా నిలువగా, బీహార్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. తమిళనాడు జట్టు 10-05 స్కోరుతో సీబీఎస్‌ఈ జట్టును ఓడించి తృతీయ స్థానాన్ని సాధించింది. శుక్రవారంనాడిక్కడ నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు శాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా శాట్స్ చైర్మన్ మాట్లాడుతూ, యూరప్, అమెరికా దేశాల స్థాయిలో తెలంగాణలో కూడా రగ్బీ క్రీడ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

నేడు నాలుగో వన్డే

- గెలిస్తే సిరీస్ మనదే
- చారిత్రక విజయానికి చేరువలో భారత్
- పింక్ వన్డేలో గెలుపు మాదేనంటున్న సఫారీలు

చారిత్రక రికార్డుకు భారత్ మరో మ్యాచ్ దూరంలో ఉంది. ఇప్పటివరకు దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్ గెలవని భారత్ కోహ్లీ సారథ్యంలో ఈ అద్భుతాన్ని చేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. మరో పక్క దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్ గెలిచి ఓటమిల పరంపర నుంచి తప్పించుకోవాలని వ్యూహాలను పన్నుతోంది.గాయంతో ఆటకు దూరమైన డివిల్లియర్స్ తిరిగి జట్టులోకి రావడం ఎంతవరకు లాభిస్తుందో వేచిచూడాల్సిందే





జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా, భారత్‌ల మధ్య నేడు జరుగనున్న నాలుగో వన్డే మ్యాచ్ ఇరు జట్లకు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఈ మ్యాచ్ గెలిచి దక్షిణాఫ్రికాపై సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించాలని కోహ్లీ సేన ఉత్సాహంగా ఉండగా, మరోపక్క అతిథ్య జట్టు మ్యాచ్ గెలిచి పరువును కాపాడుకునేందుకు ప్రయత్నాల్లో పడింది. సఫారీల జట్టులో కెప్టెన్ డు ప్లెస్సిస్, వికెట్ కీపర్ డికాక్ గాయాలతో మ్యాచ్‌లకు దూరమయిన సంగతి తెలిసిందే. గాయపడ్డ ఎబి డివిల్లియర్స్ తిరిగి జట్టులోకి రావడంతో ఆయన రాక ఎంతమేరకు రాణిస్తాడో వేచిచూడాల్సిందే. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఇప్పటికే 3-0 ఆధిక్యంలో ఉంది. ఒక్క మ్యాచ్ గెలిస్తే సిరీస్ కైవసమవుతుంది. ఇప్పటి వరకు దక్షిణాఫ్రికా గడ్డపై ఆదేశంతో ఆడుతూ సిరీస్ గెలవని భారత్ చరిత్ర సృష్టించడానికి ఒక మ్యాచ్ దూరంలో ఉంది. 2010-11 ధోని కెప్టెన్సీలో దక్షిణాఫ్రికాలో పర్యటించిన భారత జట్టు 5 మ్యాచ్‌ల సిరీస్‌లో తొలుత 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే మిగతా రెండు మ్యాచుల్లో సఫారీలు గెలవడంతో సిరీస్ 2-3 తేడాతో కోల్పోయింది. 1992-93 నుంచి చూస్తే భారత్ ఇప్పటివరకు సఫారీలపై ఆదేశంలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచినది ప్రస్తుత సిరీస్‌లోనే. వన్డేల్లో ఇప్పటికే అగ్రస్థానంపొందిన భారత్ నాలుగో వన్డేలో గెలిచి ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకునే దిశలో కదులుతోంది. కాగా మూడో వన్డే ఆడేముందు డ్రెస్సింగ్ రూంలో భారత్ ప్రతీ మ్యాచ్ గెలవాలన్న శిఖర్ ధావన్ మాటలు సహచరుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అనంతరం విరాట్ కోహ్లీ తన 34 వన్డే సెంచరీతో భారత్‌కు విజయాన్ని అందించడం అదే జోరు మిగతా రెండు వన్డేల్లో కొనసాగించడం భారత్ విజయ పథాన పయనిస్తుందని స్పష్టం చేస్తోంది.

విజయానికి వెన్నెముకగా మారిన స్పిన్నర్లు

నిజానికి ఈ వన్డే సిరీస్‌లో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇపప్పటివరకు జరిగిన మూడు మ్యాచుల్లో అందుబాటులో ఉన్న 30 వికెట్లలో కుల్దీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్ జంట 21 వికెట్లు తీయడమే ఈ విజయాలకు కారణం. వీరి తోడ్పాటు భారత జట్టు ఆత్మ విశ్వాసాన్ని రెట్టింపు చేస్తోంది. కాగా దక్షిణాఫ్రికా కూడా న్యూలాండ్స్‌లో ఐదుగురు స్థానిక స్పిన్నర్లతో తమ బ్యాట్స్‌మన్లకు ప్రాక్టీస్ చేయించినప్పటికి భారత స్పిన్నర్ల ద్వయంను ఎదుర్కోవడంలో విఫలమయ్యారు. నేడు జరుగనున్న మ్యాచ్‌లో ఇదే పరిస్థితి పునారావృతమవుతుందో.. లేక పేస్ బౌలర్లు విజృంబిస్తారో చూడాల్సిందే. డివిల్లియర్స్ జట్టులోకి రావడం సఫారీల జట్టుకు కొంచెం ధైర్యాన్ని ఇస్తుందనటంలో సందేహంలేదు. భారత్‌తో మూడు టెస్టు ఆడుతున్న సమయంలో చేతి వేలికి గాయంతో తొలి మూడు వన్డేలకు డివిల్లియర్స్ దూరంకావడం జరిగింది. అయినప్పటికి డివిల్లియర్స్ నాల్గోవన్డేలో బరిలోకి దిగుతాడా లేదా అన్నది సందేహంగా మారింది. ఈ విషయంపై దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు మీడియాకు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. శుక్రవారం మధ్యాహ్నం డివిల్లియర్స్ ఫిట్‌నెస్‌పై బోర్డు పరిశీలించి అనంతరం శనివారం నాటి మ్యాచ్‌లో ఆడేవిషయంపై ప్రకటన చేయనుంది. ఒకవేళ డివిల్లియర్స్ ఫిట్‌గా ఉండి అందుబాటులో ఉంటే మ్యాచ్‌లో మూడో బ్యాట్స్‌మన్‌గా బరిలోకి దిగే అవకాశముంది. డుమిని నంబర్ 4బ్యాట్స్‌మన్‌గా ఆడతాడు. కాగా డేవిడ్ మిల్లర్ లేదా ఖాయా జొండో ఇద్దరిలో ఎవరో ఒకరు 11వ ఆటగాడిగా ఉంటారని అంచనా. కెప్టెన్‌గా ఎడెన్ మర్‌క్రమ్ కొనసాగనున్నాడు.

పింక్ ఒడిఐ

నేటి మ్యాచ్ బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనపేర ఆడాలాని దక్షిణాఫ్రికా నిర్ణయించింది. బ్రెస్ట్ క్యాన్సర్ బాధితులు కూడా ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి వారిలో నైతిక స్థైర్యం పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు అంటున్నారు. ఇందులో భాగంగా ప్లేయర్లు పింక్ జెర్సీని ధరిస్తారు. ఈ తరహా మ్యాచ్ 2011లో తొలిసారిగా జరిగింది. ఇప్పటివరకు సఫారీలు తమకే ప్రత్యేకమైన ఈ పింక్ జెర్సీతో ఆడి ఓటమిని చవిచూడలేదు. 2015లో పింక్ డేస్‌లో భాగంగా డివిల్లియర్స్ మంచి రికార్డును నమోదు చేశాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో 44 బంతుల్లో 149 పరుగులు సాధించాడు. 2013లో భారత్ ఈ పింక్ డే మ్యాచ్‌లో ఆడినప్పుడు కూడా డివిల్లియర్స్ 47 బంతుల్లో 77 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా నాలుగు వికెట్లకు 358 పరుగులు చేయగా, భారత్ 141 పరుగులకే కుప్పకూలింది. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ మోర్కెల్, డేల్‌స్టెయిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో తిప్పలు పడ్డాడు. 43 బంతుల్లో 18 పరుగులు మాత్రమే చేశాడు. దక్షిణాఫ్రికాకు ఈ మ్యాచ్ కీలకం కానుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ మ్యాచ్ గెలవాల్సిందేనని ఆదేశ అభిమానులు కోరుకుంటున్నారు. దక్షిణాఫ్రికాలో ఆడిన 11 వన్డేల్లో రోహిత్ శర్మ సగటు 12.10 మాత్రమే. రోహిత్ ఫామ్ భారత జట్టులో ఆందోళన కలిగిస్తోంది. కోహ్లీ తుది జట్టులో ఆటగాళ్లను మార్చే యోచనలో లేనట్లే కన్పిస్తోంది.

వండరర్స్ మైదానం కలిసొస్తుందా ?

వండరర్స్ మైదానంలో ఇప్పటివరకు భారత్ ఆడిన 7 వన్డేల్లో మూడు మ్యాచ్‌లు గెలువగా.. (2003 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిన వన్డేతో కలిపి) నాలుగు మ్యాచ్‌లు ఓడింది. టెస్టుల్లో ఇక్కడ అపజయం ఎరుగని సఫారీలను ఈ పర్యటనలో మూడు టెస్టులో భారత్ ఓడించి సంచలనం రేపింది. ఇక్కడి మైదానంలో సఫారీ జట్టుతో ఆడిన 4 వన్డేల్లో మూడింటిలో భారత్ ఓటమి చవిచూసింది. 2011 పర్యటనలో భాగంగా జరిగిన వన్డేలో మునాఫ్ పటేల్ 29 పరుగులిచ్చి 4 వికెట్లు తీసి ఒకే పరుగు తేడాతో భారత్‌కు అద్భుత విజయాన్నందించాడు.



అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు థామస్ బాచ్, ఐక్యరాజ్య సమితి సాధారణ అసెంబ్లీ అధ్యక్షుడు మిరోస్లవ్ లాజిక్ ఒలింపిక్ టార్చ్ రిలేలో పాల్గొంటున్న దృశ్యం



దక్షిణ కొరియాకు చెందిన ఒలింపిక్ స్కేటింగ్ ఛాంపియన్ యునా కిమ్ ఒలింపిక్ జ్యోతిని వెలిగిస్తున్న దృశ్యం

ఐసీసీ బోర్డులో తొలి మహిళా డైరెక్టర్‌గా ఇంద్రానూయి

దుబాయ్: పెప్సీ కంపెనీ చైర్మన్, సీఈవో ఇంద్రా నూయి అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) గవర్నింగ్ బాడీలో డెరెక్టర్‌గా నియమితం ఆయ్యారు. ఐసీసీలో నియమితమైన తొలి మహిళా ఇండిపెండెంట్ డైరెక్టర్ నూయి కావడం విశేషం. బోర్డులో 2018 జూన్‌లో తన పదవీ భాధ్యతలను చేపడతారు. రెండేళ్లపాటు ఈ పదవిలో ఆమె కొనసాగుతారు. 2 సార్లు ఈ కాలపరిమితిని పొడిగించే అవకాశం కూడా ఉంది. ఈ మేరకు ఐసీసీ శుక్రవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. 'ఐసీసీలో ప్రవేశిస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది. అందులో తొలి మహిళా డైరెక్టర్‌గా నియామకం కావడం నాకు సంభ్రమంగా అనిపిస్తోంది. బోర్డులోని సభ్యులతో, క్రికెటర్లతో సాహచర్య లభించడం నా అదృష్టంగా భావిస్తూ... నా విధులను నిర్వహిస్తాను' అని నూయి అన్నారు. ఐసీసీ చైర్మన్ శశాంక్ మనోహర్ ఈనియామకంపై వ్యాఖ్యానిస్తూ.. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా మహిళను నియమించడం బోర్డు నిర్వహణలో మరో మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఐసీసీలో మహిళా డైరెక్టర్‌ను నియామకానికి ఐసీసీ మండలి గత ఏడాది జూన్‌లోనే అనుమితిచ్చిందని చెప్పారు.



భారత్-సఫారీ మహిళా జట్ల పోరు

- నేడు మూడో వన్డే
- క్లీన్ స్వీప్ చేస్తాం:మిథాలి సేన

పొట్చెఫ్‌స్ట్రూమ్: దక్షిణాఫ్రికాలో ఐసీసీ మహిళా ఛాంపియన్ షిప్‌లో భాగంగా అతిథ్య దేశంతో వన్డే సిరీస్ ఆడుతున్న భారత మహిళ క్రికెట్ జట్టు నేడు స్థానిక సెన్వాస్ పార్క్‌లో సిరీస్‌లో చివరి వన్డే ఆడనుంది. ఇప్పటికే రెండు వన్డేల్లో గెలిచిన మిథాలిరాజ్ ఆధ్వర్యంలోని క్రికెట్ జట్టు మూడోది చివరిదైన వన్డేను గెలిచి వైట్ వాష్ చేయాలని ఉవ్విళ్లూరుతుంది. 2017 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా భారత్‌ను ఓడించినప్పటికి తన సొంత గడ్డపై అంతగా రాణించలేక పోతోంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి బదులు తీర్చుకోవాలని భారత జట్టు భావిస్తోంది. ఈ పర్యటనలో తొలి, రెండో వన్డేలో దక్షిణాఫ్రికాను 125, 124 పరుగులకే ఆలౌట్ చేసింది. భారత్ తన పేస్, స్పిన్ బౌలింగ్‌తో సఫారీలను ఇబ్బంది పెట్టింది. బ్యాటింగ్‌లో అటు పేస్ బౌలింగ్‌లో రాణిస్తున్న జులన్ గోస్వామీ, లెగ్ స్పిన్నర్ పూనం యాదవ్‌లతో పాటు మరో ఓపెనెర్ స్మృతి మంధాన అద్భుతంగా రాణిస్తున్నారు. స్మృతి వరుసగా రెండు వన్డేల్లో 84, 135 పరుగులు చేసి మంచి ఊపు మీద ఉంది. నేడు సెన్వాస్ పార్క్‌లో జరుగనున్న వన్డేలో కూడా ఆమె మరో అద్భుత ఇన్నింగ్స్ ఆడే అవకాశముంది. అయితే ఆమె సహచరి మరో ఓపెనెర్ పూనం రావత్ రాణించాల్సి ఉంది. తొలి మ్యాచ్‌లో విఫలమైన హర్మన్‌ప్రీత్ కౌర్, వేద కృష్ణమూర్తి రెండో వన్డేలో ఫామ్‌లోకి రావడం భారత్‌కు అనుకూలాంశం. ఇక దక్షిణాఫ్రికా విషయానికి వస్తే రెండో వన్డేలో ఆ జట్టు ఓపెనెర్ లిజిల్లె లీ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొని 73 పరుగులు చేసింది. మిగతా బ్యాట్స్‌మన్లెవరూ కూడా విఫలమయ్యారు. ఏదైనా అద్భుతం జరగడమో లేదా సఫారీలకనుగుణంగా పిచ్‌లో మార్పులు జరిగితే తప్ప వారు గెలుపొందటం జరుగదు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



ఆలుగడ్డ లేదా బంగాళ దుంపని అందరూ ఇష్టంగా తింటారు. అయితే మనం దీనితో ఎక్కువ వెరైటీలు చేయము. వేపుడు, కుర్మా, చిప్స్, ఆలుబజ్జి...ఇలా మాత్రమే వీటిని వాడతాం. బంగాళ దుంపతో రుచికరమైన వంటలు చాలా చేయవచ్చు. వివిధ రాష్ట్రాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఆ వంటలు మీకోసం-

దమ్ ఆలూ... రుచులూరు!

సురుచి

బెంగాలీ...

కావలసినవి

బంగాళ దుంపలు- 5లేక 6 లేదా 12 నుండి 15 వరకు బేబీ పొటాటోలు
ఆవనూనె- మూడు లేదా నాలుగు టేబుల్‌స్పూనులు
బిర్యానీ ఆకు-1
కాశ్మీరీ మిరప కారం లేదా మామూలు కారం- అర టీస్పూను
ధనియాల పొడి- అరటీస్పూను
పసుపు- అరటీ స్పూను
జీలకర్ర పొడి-ఒక టీస్పూను
నీళ్లు- ఒక కప్పు
పంచదార- అరటీస్పూను లేదా తగినంత
ఉప్పు-తగినంత
-రెండు మీడియం సైజు ఉల్లిపాయలు అర అంగుళం అల్లం ముక్క మూడు వెల్లుల్లి రెబ్బలను మరీ మెత్తగా కాకుండా పేస్ట్ చేసుకోవాలి.
-అలాగే ఒక పెద్ద టమోటాతో ఒక కప్పు ప్యూరీని తయారుచేసుకోవాలి (టమోటాని నీళ్లలో ఉడికించి తోలుతీసి...మిగిలిన పండుని మిక్సీలో వేసుకుని పేస్ట్‌లా చేసుకోవాలి) లేదా టమోటాని సన్నని ముక్కలు చేసి వాడుకోవచ్చు.
-దాల్చిన చెక్క రెండుఅంగుళాల ముక్క, మూడు లేదా నాలుగు లవంగాలను పొడి చేసి పెట్టుకోవాలి.
నెయ్యి- ఒక టేబుల్ స్పూను

తయారుచేయు విధానం

-ముందుగా బంగాళదుంపలను బాగా కడిగి ఉడికించుకోవాలి. అయితే దుంపలు మరీ ఎక్కువగా కాకుండా ఒక మాదిరిగా ఉడకాలి.
-ఈ లోపల టమోటా ప్యూరీ, దాల్చిన చెక్క లవంగాలపొడి, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ని తయారుచేసి పెట్టుకోవాలి.
-సగం ఉడికిన బంగాళ దుంపలను బాగా ఆరనిచ్చి...తరువాత తోలుతీసి ముక్కలుగా చేసుకోవాలి. ఈ ముక్కలపై పావు టేబుల్ స్పూను పసుపుని చల్లుకుని బాగా కలపాలి.
-పాన్‌లో ఆవనూనె వేసుకుని వేడెక్కాక బంగాళదుంపల ముక్కలు వేసి లేత బంగారు రంగు వచ్చేవరకు వేయించాలి. వాటిని ఒక పక్కన పెట్టుకోవాలి.
-అదే నూనెలో బిర్యానీ ఆకుని వేసి మంచి సువాసన వచ్చేంత వరకు కొన్ని సెకన్లపాటు వేయించాలి.
-తరువాత ఉల్లి అల్లం వెల్లులి పేస్టుని వేసి బాగా కలియబెడుతూ వేయించాలి. నూనె... మిశ్రమం నుండి బయటకు వచ్చేంతవరకు అది లైట్ బ్రౌన్ రంగులోకి వచ్చే వరకు వేయించాలి.
-ఇప్పుడు టమోటా ప్యూరీ, పావు టీస్పూను పసుపు, కారం జీలకర్ర ధనియాల పొడర్లు, ఉప్పు, పంచదారలను వేసి బాగా కలుపుతూ ఉండాలి. నూనె పాన్‌లోని మిశ్రమం నుండి బయటకు వచ్చేదాకా అలా పొయ్యిమీద ఉంచి కలుపుతూనే ఉండాలి. ఇప్పుడు బంగాళ దుంప ముక్కలను వేసి...ముక్కలకు మిశ్రమం అంటుకునేలా బాగా



తిప్పాలి. కప్పు నీళ్లతో పాటు దాల్చినచెక్క లవంగాల పొడిని కూడా కలపాలి. దీని బదులుగా పావుటీస్పూను గరం మసాలా పొడిని కూడా కలపవచ్చు. అయితే గరం మసాలా కలిపేటట్లయితే కూర పూర్తిగా ఉడికాక కలపాలి.
-ఇప్పుడు మంటని సిమ్‌లో ఉంచి నీరు పూర్తిగా ఇంకిపోయి గ్రేవీ బంగాళ దుంపలకు బాగా పట్టేంత వరకు పొయ్యిమీద ఉంచాలి.
-వడ్డించేటప్పుడు దీనికి ఒక స్పూను నెయ్యి కలుపుకోవాలి. బెంగాలి దమ్ ఆలూని పూరీలతో తింటే బాగుంటుంది.

పంజాబీ ...

కావలసినవి

బంగాళ దుంపలు- 5లేక 6 లేదా 12 నుండి 15 వరకు బేబీ పొటాటోలు
ఉల్లిపాయ -ఒకటి పెద్దది
టమోటా-ఒకటి పెద్దది
అల్లం-అర అంగుళం ముక్క
వెల్లుల్లి-రెండు లేదా మూడు రెబ్బలు
జీడిపప్పు- ముక్కలుగా చేసినవి రెండు టేబుల్ స్పూనులు లేదా 12వరకు పెద్ద సైజు జీడిపప్పులు అరగంట నీళ్లలో నానబెట్టినవి
యాలుకలు -నలుపుది...ఒకటి పెద్ద పరిమాణంలో
దాల్చిన చెక్క- ఒక అంగుళం ముక్క
పసుపు- అరటీస్పూను
కారం- అరటీస్పూను
ధనియాల పొడి-ఒక టీస్పూను
సోంపు పొడి- ఒకటీస్పూను
గరం మసాలా పొడి- అర టీస్పూను
నిమ్మరసం- అర టేబుల్ స్పూను లేదా ఒక టేబుల్ స్పూను పెరుగు
ఒకటి నుండి ఒకటిన్నర కప్పుల నీళ్లు
కొత్తిమీర-తగినంత
నూనె...డీప్ ఫ్రైకి తగినంత

ఇలా తయారుచేయాలి...

-ముందుగా బంగాళ దుంపలను శుభ్రంగా కడిగి బాగా ఆరనివ్వాలి.
-బేబీ బంగాళ దుంపలయితే తోలు అలాగే ఉంచాలి. కాకపోతే తోలుతీసి ముక్కలు చేసుకోవాలి.
-నూనెలో వేసి దుంపలు లోపలంతా బాగా ఉడికేలా, బ్రౌన్ రంగులోకి వచ్చేవరకు డీప్ ఫ్రై చేయాలి.
-నానబెట్టిన జీడిపప్పుని, ఉల్లి అల్లం వెల్లులిని, టమోటాలను...వేరు వేరుగా మెత్తగా అయ్యేలా మిక్సీలో వేసుకోవాలి.
-పొయ్యిమీద మూకుడు పెట్టి...రెండు లేదా మూడు టేబుల్ స్పూన్ల నూనె వేసుకోవాలి. నూనె వేడెక్కాక అందులో నల్ల యాలుకలు దాల్చిన చెక్క వేయాలి.
-నూనె మంచి సువాసన వచ్చే వరకు ఆగి, ఉల్లి అల్లం వెల్లుల్లి పేస్ట్‌ని వేయాలి. బంగారు రంగు వచ్చి నూనె వేరయ్యే వరకు మిశ్రమాన్ని వేయించాలి. మంట సన్నగా ఉండాలి. దీనికి పదినిముషాల వరకు సమయం పడుతుంది.
-ఈ బ్రౌన్ రంగు పేస్ట్‌కి టమోటా ప్యూరీ కలుపుకుని బాగా కలుపుకోవాలి. మూడు నాలుగు నిముషాల తరువాత పసుపు ధనియాల పొడి, కారం, గరం మసాలా, సోంపు పొడులను ఒక్కొక్కటిగా వేసుకోవాలి.
-ఈ మిశ్రమాన్ని బాగా కలుపుతూ నూనె బయటకు వచ్చేదాకా 12 నిముషాల వరకు వేగనివ్వాలి.
-ఇప్పుడు దీనికి జీడిపప్పు పేస్ట్, పెరుగు (ఒకవేళ పెరుగు వాడేటట్టయితే) కలుపుకోవాలి. మరో మూడు నాలుగు నిముషాలు ఈ మిశ్రమాన్ని వేయించాలి.
-తరువాత ఒకటి లేదా ఒకటిన్నర కప్పుల నీళ్లు పోసి గ్రేవీని బాగా ఉడకనివ్వాలి. ఇప్పుడు వేయించిన బంగాళ దుంపల ముక్కలను వేసుకుని గ్రేవీ చిక్కబడే వరకు కలుపుతుండాలి.
-చివరగా నిమ్మరసం ఉప్పు వేసుకుని బాగా కలుపుకోవాలి. (నిమ్మరసం కానీ పెరుగుకానీ ఒక్కటే వాడాలి...రెండూ వాడకూడదు)
-తరిగిన కొత్తిమీరతో అలంకరించుకోవాలి.
-పంజాబీ దమ్ ఆలూని వేడిగా చపాతీతో కానీ బాస్మతీ రైస్‌తో వండిన అన్నంతో కానీ తింటే రుచిగా ఉంటుంది.

కాశ్మీరీ ...

కావలసినవి

బంగాళ దుంపలు- అరకేజీ లేదా 20 వరకు బేబీ పొటాటోలు
మంచినీళ్లు- సుమారు మూడున్నర కప్పులు
ఉప్పు- పావు టేబుల్ స్పూను
కాశ్మీరీ దమ్ ఆలూ గ్రేవీ కోసం కావాలసినవి
కాశ్మీరీ మిరప కారం...లేదా మామూలు కారం-మూడు టేబుల్ స్పూన్లు...రెండు టేబుల్ స్పూన్ల నీళ్లలో బాగా కలుపుకోవాలి.
అల్లం పేస్టు- అరటేబుల్ స్పూను
సోంపు పొడరు- ఒక టేబుల్ స్పూను
షాజీరా- ఒక టేబుల్ స్పూను
దాల్చిన చెక్క- ఒక అంగుళం ముక్క
లవంగాలు -3
ఒక పెద్ద యాలుక్కాయి (నలుపుది), ఒకటి చిన్నది (ఆకుపచ్చది)
నల్లమిరియాలు-4 లేదా5
బాగా మీగడ ఉన్న తాజా పెరుగు-ఆరు టేబుల్ స్పూన్లు (మృదువుగా మారేలా గిలకొట్టాలి)
నీళ్లు-ఒకటిన్నర కప్పు
ఆవనూనె-మూప్పావు కప్పు (బంగాళదుంపలు వేయించడానికి)
రెండు టేబుల్ స్పూన్ల తాజా ఆవనూనె (గ్రేవీ తయారీకి)
ఉప్పు -తగినంత
అలంకరణకోసం కొంచెం షాజీరా

తయారీ ఇలా....

-ముందుగా దుంపలను బాగా కడుక్కుని ఉడికించుకోవాలి (సగమే ఉడకాలి...పూర్తిగా కాదు)



-చల్లారాక తోలు తీసుకోవాలి. బేబీ పొటాటో అయితే తోలు ఉంచేయవచ్చు.
-పోర్క్‌తో లేదా టూత్‌పిక్‌తో బంగాళదుంపలకు సన్నని రంధ్రాలు పెట్టుకోవాలి.
-ఒక చిన్న గిన్నెలో నీళ్లు తీసుకుని అందులో కారం కలుపుకోవాలి. కారం నీళ్లలో బాగా కలవాలి. పెరుగుని కూడా బాగా గిలకొట్టి మృదువుగా అయ్యేలా చేసుకోవాలి.
-ఇప్పుడు పొయ్యిమీద పాన్ పెట్టుకుని ఆవనూనె వేసుకుని వేడిచేయాలి.
-ఇందులో బంగాళదుంప ముక్కలు వేసుకుని సన్నని లేదా మీడియం మంటమీద వేయించుకోవాలి. దుంపలు బంగారు రంగు వచ్చేవరకు బాగా వేగేలా చూసుకోవాలి.
-వేగిన వాటిని కిచెన్ పేపరు టవల్ మీద వేసుకుంటూ అన్నీ వేయించుకోవాలి. అవసరం అనుకుంటే వీటికి కూడా రంధ్రాలు పెట్టుకోవచ్చు.
-ఇప్పుడు పాన్‌లో అదనంగా ఉన్న నూనెని తీసేసి రెండు స్పూన్లు ఉండనివ్వాలి. నూనె కాస్త చల్లారాక అందులో ఇంగువ వేసి బాగా కలపాలి.
-తరువాత కారం కలిపిన నీళ్లు పోసి బాగా కలపాలి. ఇది చిందే అవకాశం ఉంది...జాగ్రత్తగా ఉండాలి.
-మంట సన్నగా ఉంచి పెరుగుని కూడా వేసి బాగా కలపాలి. పెరుగులో కాస్త సెనగ పిండి లేదా మొక్కజొన్న పిండి వేస్తే గ్రేవీలో అది గడ్డకట్టకుండా ఉంటుంది. తరువాత నీళ్లు పోసి మళ్లీ కలయబెట్టాలి. ఇందులో సోంపు పౌడర్‌ని వేయాలి (సోంపుని వేయించి పొడి చేసుకోవాలి)
-అన్ని మసాలాలు అల్లం కూడా కలిపి బాగా తిప్పాలి. ఇప్పుడు దుంపలు వేసి మళ్లీ బాగా కలియబెట్టాలి. ఉప్పుకూడా వేసి కలపాలి.
-పాన్‌మీద గాలి చొరబడకుండా మూతపెట్టి, సన్నని లేదా మీడియం మంటమీద 8నుండి 10 నిముషాలు ఉడకనివ్వాలి.
-దమ్ ఆలూ గ్రేవీ చిక్కబడుతుంది. గ్రేవీ ఎంత చిక్కగా కావాలి...అనేదాన్ని బట్టి నీళ్లని వాడాల్సి ఉంటుంది.
-చివరగా కొంచెం షాజీరాని పైన చల్లుకోవాలి. ఇది రొట్టెల్లో అయినా అన్నంలో అయినా బాగుంటుంది.


కండలు పెంచితే... కాసులే!

తారల శిల్పులు... ఫిట్‌నెస్ ట్రైనర్లు!

సినిమా తారలకు మొదటి పెట్టుబడి వారి రూపమే. తెరపై ఎంత అందంగా కనబడితే...ప్రేక్షకుల్లో అంత క్రేజు పెరుగుతుంది. అయితే తీరుగా, చెక్కిన శిల్పాల్లా ఉండే వారి రూపాలు అంత తేలిగ్గా దక్కినవి కాదు. ఆ ఆకృతుల వెనుక ఎంతో శ్రమ పట్టుదల ఉన్నాయి. అన్నింటికీ మించి... మంచి ఫిట్ నెస్ ట్రైనర్లు ఉన్నారు. పర్సనల్ ఫిట్ నెస్ ట్రైనర్లు...తారల శారీరక సౌష్టవం కోసం ఎంతగా శ్రమిస్తారో...అంతగా పారితోషకమూ పుచ్చుకుంటారు. ఆ వివరాలు-

సత్యజిత్ చౌరాసియా

ఒక్కొక్క సెషన్‌కి పదివేల నుండి లక్ష రూపాయల వరకు



ఛార్జ్ చేస్తాడు. ఒక్కో క్లయింటుకి మూడు నుండి ఆరునెలల పాటు ఫిట్‌నెస్ ప్రోగ్రాములు ఉంటాయి. గజనీలో అమీర్‌ఖాన్ ఎయిట్‌ప్యాక్ బాడీ సత్యజిత్ చెక్కినదే. ఈ రంగంలో 28ఏళ్ల అనుభవం ఉన్న సత్యజిత్‌కి బాలివుడ్‌లో చాలా డిమాండ్ ఉంది. తన క్లయింట్ల శరీరతీరునే కాకుండా మనస్తత్వాన్ని కూడా తాను తెలుసుకుంటానని, వారికి తగినట్టుగా ఫిట్‌నెస్ ప్రోగ్రామ్ ఉంటుందని..ఇతను చెబుతున్నాడు. హృతిక్ రోషన్‌కి కూడా ఈయనే ట్రైనర్



వినోద్ చన్నా

ఇతను 12 సెషన్లకు రూ. 1.5 లక్షలు ఛార్జి చేస్తాడు. ఇంటికి వచ్చి ట్రైనింగ్ ఇస్తే రూ.3.5 నుండి 5 లక్షల వరకు తీసుకుంటాడు. జాన్ అబ్రహాం, రితేష్ దేశ్‌ముఖ్, అభిషేక్ బచ్చన్ మొదలైన సెలబ్రిటీలకు ఇతనే ట్రైనర్. తన వద్ద 15 రకాల ఫిట్‌నెస్ శిక్షణా విధానాలు ఉన్నాయంటున్నాడు వినోద్. 15ఏళ్ల అనుభవం ఉన్న వినోద్...అమెరికన్ స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ అసోసియేషన్‌లో కోచింగ్ తీసుకున్నాడు.

సామీర్ జారా

ఎక్కడ ట్రైనింగ్ ఇచ్చినా నెలకు మూడునుండి నాలుగు లక్షల వరకు ఛార్జ్ చేస్తాడు. అయితే ఫిట్‌నెస్‌తో పాటు ఆహారం బాధ్యత కూడా తనదే. భాగ్ మిల్కా భాగ్ కోసం ఫరాన్ అక్తర్‌కి ట్రైనింగ్ ఇచ్చింది సామీరే. ఫరాన్‌ని రోజుకి ఆరుసార్లు ట్రైన్ చేసేవాడినని సామిర్ తెలిపాడు. ఈ కారణంగానే ఆ సినిమాలో ఫరాన్ ఒలింపిక్ అథ్లెట్‌గా కనిపించగలిగాడు.



మనీష్ అద్వైకర్

ఒక్కసారి ఇంటికి వచ్చి శిక్షణ ఇస్తే రూ. 4వేలు తీసుకుంటాడు. అయితే పోషకాహారం బాధ్యత తీసుకోడు. తన జిమ్‌లో అయితే నెలకు రూ.35వేలు తీసుకుంటాడు. సల్మాన్ ఖాన్, టైగర్ ష్రాఫ్, హృతిక్ రోషన్ మొదలైన వారికి శిక్షణ ఇచ్చాడు. ఇతను బాలీవుడ్ సెలబ్రిటీలకే కాదు... మిస్టర్ ఇండియాకు ఎంపికైన వారికి, ఇంటర్నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్స్‌కి సైతం శిక్షణ ఇచ్చాడు. బాడీ బిల్డింగ్‌లో 20ఏళ్ల అనుభవం ఉన్న మనీష్‌కి...కండలు పెంచడంలో ప్రత్యేక నైపుణ్యం ఉంది.





నమ్రతా పురోహిత్

ఈమె తన తండ్రి సామిర్‌తో కలిసి ఫిట్‌నెస్ ట్రైనింగ్ ఇస్తోంది. 12 వ్యక్తిగత ట్రైనింగ్ సెషన్లకు 32వేలు తీసుకుంటున్నారు. వరుణ్‌ధావన్ ఫ్లెక్సిబుల్ బాడీ వెనుక ఉన్నది నమ్రత కృషే. శరీరాన్ని ఎలా కావాలంటే అలా తిరిగేలా మృదువుగా మార్చే శిక్షణ ఇవ్వటంలో 22 ఏళ్ల నమ్రత దిట్ట. వరుణ్ ధావన్, ఆదిత్యరాయ్ కపూర్, అర్జున్ కపూర్ మొదలైన వారికి శిక్షణనిచ్చింది. కరీనా కపూర్ ఈమెకు నెలకు రూ. 65వేల వరకు చెల్లించింది. నెలకు 45వేల రూ.లు పుచ్చుకుంటూ కంగనా రనౌత్‌కి ట్రైనింగ్ ఇస్తోంది. ఫెమినా మిస్ ఇండియా పోటీలకు 2011నుండి అధికారిక ఫిట్‌నెస్ ట్రైనర్‌గా ఉంది.

ఇంకా...

సోనమ్ కపూర్ తన ట్రైనర్ రాధికా కరాలేకి నెలకు రూ. 55వేల పారితోషకం ఇస్తోంది. కరీనా కపూర్ ఫిట్‌నెస్ ట్రైనర్ పేరు యాస్మిన్ కరాచీ. కరీనా ఈమెకు నెలకు 45వేల రూ.లు చెల్లిస్తోంది. ఆలియా భట్‌కి, దీపికా పదుకొనేకి కూడా ఇదే ఫీజుతో ఈమె ట్రైనింగ్ ఇస్తోంది.








చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

ఉన్నది ఒక్కటే శక్తి



(గత సంచిక తరువాయి భాగం)

''వారి శక్తి అనేక విధాల పనిచేస్తుంది. కాని, ఫలితాఫలితాలకు ఖేదమోదాలు వారికుండవు. ఎందువల్లనంటే, అంతా బ్రహ్మమయంగా తోచటం వల్ల కష్టం, సుఖం అనేది గోచరించదు. 'నేను, ఈ శరీరంలో ఉన్నాను. ఈమనిషిని, ఇది లోకం' అనే భావన ఉంటే గదా, ఖేదమోదాలు చెందేంటందుకు. **'దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్యే ద్బ్రహ్మమయమ్ జగత్'** అన్న ఉపనిషద్వాక్యానుసారం ఎప్పుడు జ్ఞానదృష్టి కలుగుతుందో, అప్పుడే సర్వం బ్రహ్మమయంగా తోస్తుంది. నేను చేస్తున్నాననే భావనకిక తావేది? ఏదో ఒక శక్తి వల్ల, కార్యం జరుగుతున్నదని భావిస్తారు. అంతే'' నన్నారు భగవాన్.

''జ్ఞానులు, శాపానుగ్రహ సమర్థులంటారు గదా? వారిదేమీ లేదని సెలవిస్తున్నారే తమరు?'' అన్నారింకొకరు. ''అవునండీ, సమర్థులు కారని ఎవరన్నారు? అయితే, తాము వేరు, ఈశ్వర శక్తి వేరు అన్న భావన వారికి లేదు. ఉన్నది ఒక్కటే శక్తి. ఆ శక్తి చేతనే, తాము చలిస్తున్నామని గ్రహించి, అహం కర్తృత్వరహితులై ఉంటారు. వారు ఉండుటే లోకానికి మేలు. ప్రారబ్ధానుసారం ఏ పనులు చేయవలసి ఉంటే ఆ పనులు చేస్తారు అంతే'' నన్నారు భగవాన్.

ప్రారబ్ధం

17-5-47

ఈ ఉదయం 9 గంటలకు ఒక భక్తుడు భగవానునుద్దేశించి ''స్వామీ నిన్న జ్ఞాని ప్రారబ్ధానుసారం చేయవలసిన పనులుంటే చేస్తాడని, తాము సెలవిచ్చారే, అసలు జ్ఞానులకు ప్రారబ్ధం లేదంటారు గదా?'' అన్నాడు.

భగవాన్ సావధానులై ''ప్రారబ్ధం లేనిది దేహమెట్లా వచ్చింది? పనులెట్లా చేస్తారు? జ్ఞానుల చర్యలకే ప్రారబ్ధమంటారు. బ్రహ్మ మొదలు సదాశివాది దేవతలకున్నూ ప్రారబ్ధం ఉన్నట్టు చెప్పి ఉన్నది. రామ,కృష్ణాద్యవతారాలూ అంతే. **'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం, ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే'** అన్నట్లు ఎప్పటికప్పుడు సాధువుల పుణ్యం, దుష్టుల పాపం చేరి ప్రారబ్ధంగా పరిణమించి, ధర్మసంస్థాపనార్థం ఈశ్వరుడు రూపం ధరిస్తాడు. దాన్నే పరేచ్ఛా ప్రారబ్ధమంటారు. శరీరమే ప్రారబ్ధం. ఏ నిమిత్తంగా ఆ శరీరం వచ్చిందో ఆ పని దానంతటదే జరుగుతుంది'' అన్నారు.

''గీతలో కర్మయోగమే ప్రాధాన్యంగా చెప్పారే?'' అన్నారు నిన్నటి వారు. ''ఓహో, అట్లాగా, కర్మయోగం ఒక్కటేనా వారు చెప్పింది. మిగతావన్నీనో? అవన్నీ తెలుసుకుంటే కర్మయోగంలోని మర్మం తెలుస్తుంది. అది విచారించరు.

'అహం క్రతు, రహం యజ్ఞ, స్స్వధా2హ, మహమౌషధం।
మన్త్రోహ మహమే వాజ్య, మహ మగ్ని రహం హుతం'॥ అ.9శ్లో.16
అన్న గీతాకారుడు, దీనికి ముందే
'న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి దనంజయ।
ఉదాసీన వ దాసీన మసక్తం తేషు కర్మసు'॥ అ.9శ్లో. 9
అన్నాడు. అదేగాక
''ఉదాసీనవ దాసీనో గుణైర్యో న విచాల్యతే।
గుణావర్తంత ఇత్తేవ యో-వతిష్ఠతి నేంగతే'॥ అ.14 శ్లో.23
అనీ,
సమదుఃఖసుఖః స్వస్థస్సమలోష్టాశ్మ కాంచనః।
తుల్యప్రియాప్రియోధీర స్తుల్యనిందాత్మ సంస్తుతిః'॥ అ.14శ్లో 24
అనీన్నీ
'మానావ మానయో స్తుల్య, స్తుల్యో మిత్రారి పక్షయోః।
సర్వారంభపరిత్యాగీ గుణాతీతస్స ఉచ్యతే॥ అ.14శ్లో 25. అని చెప్పి ఉన్నాడు. పై విధంగా ఉన్న మహాపురుషులు బాహ్యానికి ఏవిధంగా ఉన్నా సదా కర్మసిద్ధులే.

(తరువాయి భాగం వచ్చేసంచికలో)

- సూరి నాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

విశ్వాసమే ముక్తికి హేతువు

'భగవంతుడు సర్వ వ్యాపకుడు. అతని నామం ఏదైనా కావచ్చు. అతని మీద విశ్వాసమే అతని దరి చేరుస్తుంది. విశ్వాసమే మూలం. దానిపైనే చాలా విషయాలు ఆధారపడి ఉన్నాయి. దానికి ముక్తినిచ్చే శక్తి కూడా ఉంది'



ఈ లోకంలో చాలా విషయాలకు విశ్వాసం ముఖ్యం. చివరకు ముక్తికి కూడా విశ్వాసమే హేతువు. అర్జునుడు కృష్ణ పరమాత్మను భగవంతుడని నమ్మాడు. అయినా సంశయం మిగిలే ఉంది. అందుకే 'కృష్ణా! నీవే నిరతిశయ జ్ఞానైశ్వర్య మంతునిగా ఎరుగుదువు. నీవే ఏయే విభూతుల వలన ఈ లోకములన్నిటియందు వ్యాపించి ఉంటావో అట్టి దివ్యములైన నీ విస్తార మహాత్మ్యములను సంపూర్ణంగా వర్ణింప తగుదువు. ఓ యోగీశ్వరా! ఎట్లు సదా తలపోయుట వల్ల నేను నిన్ను తెలుసుకోగలను? ఓ దేవ దేవా! ఏయే వస్తువులలో నిన్ను ధ్యానించాలి?' అంటూ తన సంశయాన్ని వ్యక్తం చేశాడు. అప్పటికే అర్జునుడు జ్ఞాన, కర్మ, భక్తి, ఇత్యాది యోగాల గురించి శ్రీకృష్ణుని ముఖతః విని ఉన్నాడు. అయినప్పటికి సంశయం తీరలేదు, సంతృప్తి కలగలేదు. అలాంటప్పుడు మానవ మాత్రులకు దేవుని ఉనికి గురించి సంశయాలు కలగడంలో ఆశ్చర్యం లేదు. ఒకప్పుడు మధురైను ఏలిన పాండ్య రాజు, మంత్రిని పిలిచి, 'ఏ దేవుని కొలిస్తే త్వరిత గతిన ముక్తి లభిస్తుందో' చెప్పమన్నాడు. 'బహుశ నీకు కూడా తెలిసి ఉండకపోవచ్చు. అందువలన రెండు మూడు రోజుల్లో మన రాజ్యంలోని పండితులను, జ్ఞానులను దర్బారులో సమావేశపరుచు. జ్ఞానులు కాబట్టి వారు నాకు సహాయపడే స్థితిలో ఉంటారు' అన్నాడు పాండ్య రాజు.

రాజాజ్ఞ మేరకు రాజ్యం నలు మూలల నుంచి 15 మంది ఉద్దండ పండితులు వచ్చారు. 'ఏ దేవుణ్ని కొలిస్తే త్వరిత గతిన ముక్తి లభిస్తుందో సెలవియ్యండి' అన్నాడు రాజు. 'మహారాజా! ఇందులో సందేహం ఎందుకు? విష్ణువు స్థితి కారకుడు. అతన్ని ప్రార్థిస్తేనే తొందరగా ముక్తి లభించగలదు' అన్నాడొక పండితుడు. అంతలో శివారాధన చేసే ఒక పౌరాణికుడు మొదటి వాని సలహాను ఖండిస్తూ, 'కేవలం శివయ్యను నమ్మండి' అన్నాడు. ఇంతలో వేరొకడు లేచి 'ఆ విష్ణువూ వద్దు, శివుడూ వద్దు, సులభ ప్రసన్నురాలైన జగదంబను నమ్మండి. ఆ తల్లి దయ అపారం. కోరిన కోరికలను తీర్చి ముక్తిని ప్రసాదిస్తుంది' అన్నాడు. సభలోని పండితులలో కలవరం మొదలైంది. వేరొకరు విఘ్నేశ్వరుని మరొకరు దక్షిణామూర్తి పేరు చెప్పారు. మరికొందరు వేరే దేవతల పేర్లు చెప్పారు. రాజుగారికి అంతా గజిబిజిగా ఉంది. సమస్య సమస్యగానే ఉండిపోయింది. మీరిచ్చిన సమాధానాలు బాగానే ఉన్నాయి అని వారికి సంభావనలిచ్చి పంపించి వేశాడు.


ఆయనకు చికాకుగా ఉంది. చికాకులో మంత్రితో ఇలాగన్నాడు. 'ఏమిటి ఈ ముక్కోటి దేవతల గోల. ఎవరి మాట వినాలో నాకర్థం కాలేదు. సరే ఆ విషయం వదిలెయ్. అసలు భగవంతుడెక్కడ ఉన్నాడు? ఎటు చూస్తున్నాడు? ఏమి చేస్తున్నాడు?ఈ మూడు ప్రశ్నలకు నీవే జవాబివ్వాలి లేకుంటే నీకు శిక్ష తప్పదు' అన్నాడు. ఉరుము ఉరిమి మంగలం మీద పడినట్టయింది మంత్రి పరిస్థితి. ఆ ప్రశ్నలకు జవాబు లేదని కాదు. విభూతి యోగంలో తన ఉనికి గురించి చెప్పాడు భగవంతుడు. 'సర్వ భూతములకు మూల కారణం నేనే. చర చరాత్మక భూతాలలో నా విభూతి కానిది లేదు. దివ్యములగు నా విభూతులకు అంతము లేదు. నేనీ జగత్తునందు ఒక అంశ మాత్రంగానే వ్యాపించి ఉన్నాను' అన్నాడు. అయితే అంతఃపురాలలో, కేళీ విలాసాల్లో మునిగి ఉండే రాజుకు ఇవన్నీ ఎలా చెప్పటం. ఆయనకి ఏమి చెప్పినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్టే అనుకున్నాడు. తనకు శిక్ష తప్పదని చింతాక్రాంతుడై ఈ మాట భార్యకు చెప్పాడు. అదే సమయంలో వారికి రోజూ పాలు పోసే గోప బాలుడు అక్కడకు వచ్చాడు. వాడూ ఈ ప్రశ్నలు విన్నాడు. వెంటనే 'మంత్రి గారూ! రేపు నన్ను మీ వెంట సభకు తీసికెళ్ళండి. ఆ ప్రశ్నలకు నేను జవాబు చెబుతాను, నేను చిన్నవాడినే కాని అవివేకిని, అల్ప జ్ఞానిని, చదువు సంస్కారాలులేని వాడిని అనుకోకండి' అన్నాడు. ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికి గడ్డిపోచ దొరికినా దానిని పట్టుకుని గట్టుకు చేరాలనుకుంటాడు. అలా ఉంది మంత్రి పరిస్థితి.

మర్నాడు గోపబాలుడితో రాజు వద్దకు వెళ్ళాడు మంత్రి. ఈ గోప బాలుడు మీ ప్రశ్నలకు జవాబులు చెబుతాడన్నాడు మంత్రి. రాజు ఆశ్చర్యపోయాడు. అయినా సరేనన్నాడు. గోప బాలుడు, 'మీ ప్రశ్నలు విన్నాను మహారాజా! ఒక మర్రి విత్తనం తెప్పించండి అన్నాడు. పరిచారికలు ఉద్యానవనం నుంచి ఒక మర్రి విత్తనం తెప్పించారు. గోప బాలుడు దానిని చిదిపేడు. 'దీనిలో ఏముందో చూసి చెప్పండి' అన్నాడు బాలుడు. 'చిన్న అణువులు తప్ప మరేమీ లేవు' అన్నాడు రాజు. 'మీరు చెప్పింది నిజమే. అయితే దీనిని చిదపకుండా భూమిలో పాతి, నీరు పెడితే కొన్ని రోజులకది మొలకెత్తి, పెద్ద చెట్టుగా ఎదిగి, శాఖోపశాఖలతో, ఆకులు, కాయలు వస్తాయి. ఒక్క విత్తనంలో ఇన్ని ఉన్నట్టు భగంతుడు వేర్వేరు రూపాలతో ఈ జగత్తులో అణువణువునా నిండి ఉన్నాడు. వేర్వేరు వ్యక్తులు వారివారికిష్టమైన రూపాన్ని కొలుచుకునేందుకు ఇన్ని రూపాలు' అన్నాడు. ఇది మీ మొదటి ప్రశ్నకు జవాబు అన్నాడు.

రెండవ ప్రశ్న భగవంతుడు ఎటు చూస్తున్నాడు అని. 'సర్వ వ్యాపకుడైన భగవంతుడు సృష్టిగతులన్ని అంటే సూర్యచంద్రులు గతులు తప్పకుండా, మహాసముద్రాలు హద్దు దాటకుండా, సమృద్ధిగా వర్షాలు పడేలా చూస్తాడు. తాను సృష్టించిన ప్రాణులను పోషిస్తాడు, కాపాడుతాడు. దుష్ట శిక్షణ చేస్తాడు. ఆ విధంగా సర్వదిక్కులకు చూస్తున్నాడు' అన్నాడు. 'ఇక భగవంతుడు ఏమి చేస్తా డనేగా మీ మూడవ ప్రశ్న. ఈ ప్రశ్నకు జవాబు చెప్పేందుకు మీరు కాసేపు నేను కూర్చున్న ఈ సామాన్యుల ఆసనంలో కూర్చోవాలి. నేను కొన్ని క్షణాలు మీ సింహాసనం మీద కూర్చునే అవకాశం కల్పించాలి' అన్నాడు. రాజు అంగీకరించాడు. భగవంతుని చర్యలను వర్ణించలేము. తిమ్మిని బెమ్మి చేస్తాడు, అజ్ఞానిని జ్ఞానిని చేస్తాడు. పామరుడిని పండితునిగా చేస్తాడు. రాజుని బీదవాడిగా, బీదవాడిని రాజుగా చేస్తాడు. ఈ సింహాసనంపై నన్ను, సామాన్య జనం కూర్చునే చోట రాజును కూర్చో బెట్టింది ఆ భగవంతుడే' అన్నాడు. 'రాజా భగవంతుడు సర్వ వ్యాపకుడు. అతని నామం ఏదైనా కావచ్చు. అతని మీద విశ్వాసమే అతని దరి చేరుస్తుంది. విశ్వాసమే మూలం. దానిపైనే చాలా విషయాలు ఆధారపడి ఉన్నాయి. దానికి ముక్తినిచ్చే శక్తి కూడా ఉంది' అన్నాడు. రాజుకి జ్ఞానోదయమైంది. నిశ్చల భక్తితో భగవంతుణ్ని ధ్యానించి అనతికాలంలో మోక్షప్రాప్తి పొందాడు.

- గుమ్మా ప్రసాదరావు
(భిలాయ్ నుంచి)
9755110398

విలక్షణ క్షేత్రం కాళేశ్వరం -2



(నిన్నటి సంచిక తరువాయి భాగం)

దైవ ప్రాధాన్యమే కాదు కాళేశ్వరంలో పితృకార్యాలూ చేస్తుం టారు.

ఇక్కడి గోదావరి త్రివేణి సంగమంలో పితృదేవతలకు పిండ ప్రదానాలు చేస్తే వారికి కైలాసప్రాప్తి, వైకుంఠ ప్రాప్తి కలుగుతాయన్నది ఇక్కడికి వచ్చే వారి ప్రబల నమ్మకం. అందుకే ఇక్కడ పిండ ప్రదానాలు చేస్తుంటారు.

ఆలయంలో శనివారం శని పూజలు, మంగళ, గురు వారాల్లో కాలసర్ప దోష నివారణ పూజలు జరుగుతుంటాయి. ఈ పూజలవల్ల ఆ దోషాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.

కాళేశ్వరానికి సమీపంలో ఉన్న మంథని గౌతమ మహాముని తపస్సు చేసిన ప్రాంతమని చెబుతారు. దీనితో గౌతమ మహాముని పాదాలను అభిషేకించిన గోదావరి నదీమ తల్లి గౌతమిగా మరో పేరు దాల్చింది.

కాళేశ్వర ముక్తేశ్వర ఆలయానికి పరివార ఆలయాలు ఉన్నాయి. వీటిలో సూర్య దేవాలయం, సరస్వతీ ఆలయం ఉన్నాయి. ఆదిశంకరుల శిష్య పరంపరలోని వారు ఈ క్షేత్రాన్ని దర్శించి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయానికి దక్షిణాన మహాసరస్వతి అమ్మవారిని ప్రతిష్ఠించినట్లుగా జన శ్రుతి.

కాళేశ్వరాలయానికి పడమరగా ఒక కిలో మీటరు దూరంలో ప్రకృతిసిద్ధ విభూతి రాళ్లు లభిస్తాయి. ఈ విభూతిని ధరించిన వారు వారు శివునికి ప్రీతి పాత్రులవుతారని అంటారు. అందువల్ల కొందరు ఈ విభూతి రాళ్ళను భక్తితో సేకరించుకుని, భద్రపర చుకుని శరీరానికి పూసుకుని శివారాధన చేస్తారు.

కాకతీయ చక్రవర్తుల కాలంలో కాళేశ్వర క్షేత్రం మహా వైభవోపేతంగా, మహోజ్జ్వలంగా ప్రకాశించింది. రుద్రదేవుడి కాలమైన 1158 నుంచి రెండో ప్రతాప రుద్రుని కాలం వరకూ సుమారు 165 ఏళ్లు ఈ క్షేత్రం అంగరంగ వైభవంగా మహోన్న తంగా కొనసాగిందని కాకతీయుల చరిత్ర చెబుతోంది. ఈ ఆలయాల అభివృద్ధికి రుద్ర దేవుడు, మహాదేవుడు, గణపతి దేవుడు, రుద్రమ దేవి, ప్రతాప రుద్రుడు ఎన్నో మణి మాణిక్యా లను, బంగారాన్ని సమర్పించుకున్నట్టు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

కాళేశ్వరాలయంలోని లింగాలు అతి ప్రాచీనమైనవే అయినా ఇక్కడ ఆలయాన్ని 1171లో రుద్ర దేవుని (మొదటి ప్రతాప రుద్రుని) ప్రధాన మంత్రి గంగాధరుడు శివునిపై తనకున్న అపార భక్తికి ప్రతీకగా నిర్మించినట్లు చెబుతారు. ప్రతాప రుద్రుడు ఈ ప్రాంతంలో ఉత్సవాలు జరిపి బ్రాహ్మణులకు దానాలు, వారింటి కన్యలకు వివాహాలు జరిపించాడని, ఇక్కడ 12 తులాభారాలతో కాళేశ్వరునికి అపారంగా బంగారం సమర్పించుకున్నాడని చెబుతారు. 1379లో రెండవ హరిహరరాయలు కుమారుడు దేవరాయలు దిగ్విజయ యాత్ర చేసి కాళేశ్వరం వచ్చి తన విజయాలకు గుర్తుగా గొప్ప ఉత్సవం నిర్వహించి గొప్ప దానం చేశాడని తెలుస్తోంది. చరిత్ర గతిలో ఈ ఆలయం విదేశీ దండయాత్రలకు గురై 650 ఏళ్ళు చీకటిలో మగ్గిందని ఆ తర్వాత మళ్ళీ ప్రాభవాన్ని సంతరించుకుందని కొందరు పరిశీలకుల అభిప్రాయం.

- తాళ్ళపల్లి యాదగిరి గౌడ్
9949789939

దినఫలాలు

మేష రాశి: కుటుంబ సఖ్యత పెరుగుతుంది. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. అధికారులతో సంబంధ, బాంధవ్యాలు మెరుగవుతాయి. ఆధ్యాత్మిక కార్యాలలో పాల్గొంటారు. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో శుభపరిణామాలు చోటు చేసుకొంటాయి.ఆదాయంలో మెరుగైన వాతావరణం ప్రారంభమవుతుంది.

వృషభ రాశి: ఆరోగ్య పరీక్షలు మేలును కలిగిస్తాయి. కోర్టు వ్యవహారాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ఖర్చులు పెరుగుతాయి. రాజకీయ వత్తిడులు పెరుగుతాయి. ఆదాయంలో ఇబ్బందులను నెట్టుకురాగలుగుతారు.

మిథున రాశి: గృహకార్యాలు, కార్యక్రమాలు అనుకూలం. అసహన పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆరోగ్యం పర్వాలేదు. శ్రమతో కూడిన కార్యాలు, అసంతృప్తి ఉంటాయి. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు తప్పనిసరి.

కర్కాటక రాశి: ఆరోగ్య పరీక్షలు ఉపశమనం కలిగిస్తాయి. స్థిరాస్తి విషయాలు అనుకూలం. మానసిక ధైర్యం పెరుగుతుంది. నిర్ణయాలు అమలు పరచగలుగుతారు. రాజకీయ వ్యవహారాల్లో చుక్కెదురు ఉంటుంది. పనులపై ఒత్తిడి అధిగమించగలుగుతారు. ఆదాయంలో అనుకూలత పెరుగుతుంది.

సింహ రాశి: ఆర్థిక లావాదేవీలు ఊరట కలిగిస్తాయి. స్థిరాస్తి విక్రయాలు/ వాహన విక్రయాలు లాభిస్తాయి. రుణ ఒత్తిడులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆందోళన పరిస్థితులను అధిగమించలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: సాహస నిర్ణయాలు లాభిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ఆదాయంలో ఆశించిన ఫలితాలు పొందగలుగుతారు.

తులా రాశి: స్థిరాస్తి కొనుగోళ్లు, ఆరోగ్య పరీక్షలు ఉపకరిస్తాయి. విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. వేగవంతమయిన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత తగ్గుతుంది. పొరపాట్లను విస్మరించటం ద్వారా సమస్యలు ఎదురవుతాయి. ఆదాయంలో ప్రోత్సాహక పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

వృశ్చిక రాశి: రాజకీయ నిర్ణయాలు అనుకూలం. నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. పరీక్షలు ఆరోగ్యపరంగా ఉపకరిస్తాయి. శ్రమ అధికమవుతుంది. ఆరోగ్యంలో జాగ్రత్తలు పాటించాలి. పనులలో ఆలస్యం ఉంటుంది. శ్రమ పెరుగుతుంది. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: విదేశీ సంభాషణలు / లావాదేవీలు లాభిస్తాయి. ఒత్తిడులని వేగవంతంగా ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యంలో అనుకూలత పెరుగుతుంది. వృత్తిలో పోటీ పెరుగుతుంది. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.


మకర రాశి: వ్యాపార ఒప్పందాలు ఊరట కలిగిస్తాయి. అవమానకర పరిస్థితుల్ని ఎదుర్కోలేకపోతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. మంచి కార్యాలలో కూడా విమర్శలకు గురవుతారు. ఆదాయంలో ఆటంకాలని చవిచూస్తారు.

కుంభరాశి: విదేశీ లావాదేవీలు ఉపకరిస్తాయి. ఆనందకర సంఘటనలు గృహంలో ఏర్పడతాయి. శ్రమ అధికంగా ఉన్నా, విజయాలు సాధ్యపడతాయి. ఆరోగ్యంలో శ్రద్ధ పెరుగుతుంది. స్థిరాస్తి విషయాల్లో శ్రద్ధ తప్పనిసరి. నూతన ప్రణాళికలు వృత్తిలో లాభిస్తాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు ఆనందాన్ని కలిగిస్తాయి.

మీనరాశి: విదేశీ ప్రయాణాలు కలసివస్తాయి. అలసత్వం పెరుగుతుంది. అవకాశాలను సద్వినియోగ పరచుకోగలుగుతారు. ఆరోగ్యం ప్రతికూలత ఉంటుంది. ఉద్యోగ వ్యవహారాల్లో అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



భగవద్గీత

భగవద్ధామం చేరుకున్నవారు ముక్తులు

అధ్యాయం7

శ్లోకం 29:

జరామరణమోక్షాయ
మామాశ్రిత్య యతంతి యే।
తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమ్
అధ్యాత్మం కర్మ చాఖిలమ్॥

తాత్పర్యం

ముసలితనం, మృత్యువుల నుండి ముక్తిని పొందుటకై యత్నించు బుద్ధిమంతులు భక్తియోగముతో నన్ను ఆశ్రయిస్తున్నారు. దివ్య కర్మలను గూర్చి సమగ్రంగా ఎరిగి యుండుటచే యథార్థంగా వారు బ్రహ్మస్వరూపులై ఉన్నారు.

భాష్యం

జన్మ మృత్యు జరా వ్యాధులు ఈ శరీరానికే గాని ఆత్మకు ఉండవు. కాబట్టి ఎవరైతే భగవంతుణ్ణి పూజించి, భగవద్ధామానికి చేరుకుంటారో వారు ముక్తులైనట్లు. 'అహం బ్రహ్మాస్మి' 'నేను బ్రహ్మము' 'నేను ఆత్మను' అని అర్థం చేసుకోవాలి. శుద్ధ భక్తులు ముక్త స్థితిలో ఉంటారు కనుక దివ్యమైన లీలలను అర్థం చేసుకోగలుగుతారు.

నాలుగు రకాల వారు, వేరు వేరు అవసరాల కోసం భగవంతుణ్ణి ఆశ్రయించినా, చివరకు పరిశుద్ధులై భగవద్ధామానికి చేరుకొంటారు. అయితే దేవతలను పూజించేవారు, నిరాకార వాదులు భగవంతుని పట్ల అపోహలు కలిగి ఉంటారు కాబట్టి సర్వోన్నతలోకమైన కృష్ణ లోకానికి చేరలేరు.

ఇలా కేవలం భగవంతుణ్ణి ఆశ్రయించిన వారే నిజానికి 'బ్రహ్మము' కాగలరు. మోక్షాన్ని కోరుతూ కొందరు అర్చా విధానం ద్వారానో, ధ్యానం ద్వారానో భగవంతుణ్ణి పూజిస్తూ ఉంటే భగవంతుడు వారికి కూడా కృపను చూపి 'బ్రహ్మము' ను గురించి అవగాహన ప్రసాదిస్తాడు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.



సుమతి శతకము

ఉపమింప మొదలు తియ్యన
కపటం బెడ నెడను చెఱకుకైవడినే పో
నెపములు వెదకును గడపట
కపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ

తాత్పర్యం: చెడ్డవాని యొక్క స్నేహము చెఱకుగడ వంటిది. మొదట ఈ స్నేహము చాలా తియ్యగా ఉండును. మధ్య మధ్యలో ఆ తీపిని హరించే కణుపుల వంటి చెడ్డ సంఘటనలు ఎదురగును. చివరకు రసం లేని వెన్నుల వలె తప్పులే కనబడును.

బాలప్రభ

పొడుపు కథ

నున్నగా చెక్కించి, నూనె మెరుగెట్టించి,
ఏడాదికొకసారి గంట కొట్టి కదిలిస్తారు
కోలాహలంగా ఏమిటది?





చింటుగాడి కథలు

రచన: రాంకి

బొమ్మలు: జానకిరాం

రామలింగని ఔదార్యం

తెనాలి రామలింగడు రాయలవారి ఆస్థానంలోగల అష్టదిగ్గజాలలో ఒకడు. రామలింగడు మహామేధావి. యుక్తిపరుడు. గొప్పకవి. చతురోక్తులకు హాస్యోక్తులకు అతడు పెట్టింది పేరు. రాయలవారి నుండి ఎన్నో ప్రశంసలు పొందినా అతనికి గర్వం లేశమాత్రమయినా లేదు. రాయలవారు, భువన విజయం అనే భవనంలో కవితా గోష్టులు నిర్వహించేవారు. ఎందరో కవులు భువన విజయంలో తమ విద్వత్తు ప్రదర్శించి రాయలవారి నుండి సత్కారాలు పొందేవారు. ఆ భవనానికి తిమ్మడు అను పేరుగల ద్వారపాలకుడుండేవాడు. తిమ్మడు అనేకమంది పండితులను కవులను చూశాడు. ఎన్నో పద్యాలు విన్నాడు. రామలింగడికి తిమ్మడు అంటే ఎంతో ఆప్యాయత. ఒక రోజు తిమ్మడు మంచి పట్టు కండువా ధరించి ద్వారం దగ్గర నిలబడి ఉన్నాడు. భవనం లోపల రాయలవారు కొలువుదీరి ఉన్నారు. కవుల కోసం నిరీక్షిస్తున్నాడు. లింగడు వచ్చారు. వారు ద్వారం వద్దకు రాగానే తిమ్మడు అందరికి నమస్కరించి మహానుభావులారా! మీరు భవనం లోపల రాయలవారి సమక్షంలో ఎన్నో పద్యాలు చదువుతారు. ఈ రోజు ఇక్కడ నాపైన కూడా ఏదో పద్యం చెప్పండి అని వినయపూర్వకంగా అడిగాడు. వెంటనే అల్లసాని పెద్దన ఇలా ఒక పద్యపాదం చెప్పాడు.

వాకిలి కావలి తిమ్మా. తర్వాత నంది తిమ్మన ఆపాదం విని రెండో పాదం చెప్పాడు. ప్రాకటముగసుకవి పరులపాలిట సొమ్మా అది విని భట్టుమూర్తి మూడో పాదం ఇలా చెప్పాడు. నీకిదే పద్యము కొమ్మా.

రామలింగడు పై మూడు పాదాలు విని పద్యాన్ని ఈ దిగువ పాదంలో పూరించాడు. నాకీ పచ్చడమై చాలు నయముగానిమ్మా. ఈ పద్యం విని తిమ్మడు ఆనందాన్ని పట్టలేక తను ధరించిన పట్టు కండువా రామలింగనికి కప్పి మిగిలిన కవులకి నమస్కరించాడు. రామలింగడు అప్పుడు తిమ్మా మా కవితకు నీ పట్టు కండువా బహుమానమైతే నీ కవితాభిమానానికి నా బంగారు జరీ కండువా బహుమతిగా ఇస్తున్నాను తీసుకో అని తన కండువాను తిమ్మనికి కప్పి సత్కరించాడు. కవులు తర్వాత లోపల భవనంలో ప్రవేశించారు.

రాయలవారికి నమస్కరించి వారి ఆసనాలలో కూర్చున్నారు. రామలింగని భుజంపై బంగారు కండువా లేకపోవడం

చూసి రాయలవారు దాన్ని గురించి రామలింగని ప్రశ్నించారు.

రామలింగడు అప్పుడు జరిగినదంతా విన్నవించి ప్రభూ! ఆ విధంగా నా కండువాను తిమ్మనికి బహుకరించాను అన్నాడు. రాయలవారు వెంటనే సింహాసనం దిగి ఇంతవరకూ నీ హాస్యోక్తులు, పాండిత్యము చూసి సత్కరించాను. కానీ ఔదార్యాన్ని సత్కరించడం కూడా నా కర్తవ్యం అంటూ తన కంఠం నుండి ఒక స్వర్ణమాల తీసి రామలింగనికి బహుకరించాడు. రామలింగడు పాండు రంగమహత్యము అనే గొప్ప కావ్యం వ్రాశాడు. అది పండితుల ప్రశంసలు పొందింది.

- ఉలాపు బాలకేశవులు

కప్పన్నవిందు

ఏమర్రా పిల్లలు ఏమి చేస్తున్నారు? శనివారం కోసం ఎదురుచూస్తున్నారు కదూ! మరి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మన పుస్తకాలతోటలో కొత్త పుస్తకం సమాచారం తెలుసుకుందామే!!

ఈ వారం విశాఖపట్టణంకు చెందిన కెఎస్‌వి రమణమ్మ (స్వరాజ్యం) అమ్మమ్మ వ్రాసిన కథల పుస్తకం కప్పన్నవిందు గురించి తెలుసుకుందాం. దీనిలో మొత్తం పది కథలున్నాయి.

ఇవి అన్నీ వేటికవే భలే గమ్మత్తుగా ఉంటాయి. ప్రతికథకు బాలి బాబాయ్ వేసిన బొమ్మలు ఎంత ముద్దుగా ఉన్నాయనుకున్నారు.

పుస్తకం పేరున్న కథ గురించి చెప్పాలంటే పుస్తకం మొత్తానికి ఇదే గొడుగు లాంటిది. చిట్టెలుక, కోడిపిల్ల, చీమ, మిణుగురు పురుగు, మంచి స్నేహితులు. ఇవి అన్నీ కలిసి చేసిన ప్రయాణం చివరికి ఐకమత్యం అనే బలం సాయంతో వాళ్ళకు ఎదురైన ఆటంకాన్ని కూడా ఎలా ఎదుర్కొని వాళ్ల మిత్రుడు కప్పను చేరుకుని విందు ఆరగించిన తీరును ఎంతో చక్కగా చెప్పబడింది. ఈ కప్పన్న విందు కథలో చిన్నపిల్లల్లోని సృజనాత్మకత వికాసానికి పర్యటనలు ఎంతగా ఉపయోగపడతాయో



అందంగా చెప్పిన కథ తాతగారి ఊరు పర్యావరణ కాలుష్యానికి హానిచేసే ప్లాస్టిక్ వస్తువులు పశువుల ఆరోగ్యానికి ఎంత భయంకరంగా హాని కలిగిస్తున్నాయో కళ్లకు కట్టినట్లు చెప్పిన కథ 'మేత'

ఆపదలో ఉన్న మిత్రుడిని రక్షించుకోవడమే అసలైన స్నేహ ధర్మం అని చాటిచెప్పిన కథ చిన్న బన్ను ఇందులో రూపంలో రెండు చిట్టి కుందేళ్లు తమకన్నా ఆకారంలో పెద్దవైన సింహాన్ని సైతం. యుక్తితో ఎలా బంధించావో తెలుసుకోవాలంటే ఈ కథ చదవాల్సిందే.

ఎవరి రూపంతో వారు తృప్తిగా తమ తమ పనులు చేసుకుపోవాలే తప్ప అత్యాశకు పోయి లేనిదాన్ని కోరుకోవడం వల్ల వచ్చే ఆపదల గురించి అర్థమయ్యేట్టు చెప్పిన కథ వరాలిస్తే పిల్లలతో పాటు పెద్దలకూ కనువిప్పు కలిగిస్తూ తల్లిదండ్రుల పట్ల తమ సంతానం ఎలాంటి కర్తవ్యం కలిగి ఉండాలో చెబుతూ కర్తవ్యబోధ చేసిన కథ ''పండు''. ఇలా ప్రతి కథ ఓ విందుభోజనంలా ఉండే ఈ కథల పుస్తకంలోని అన్ని కథలు ఎంతో పసందుగా ఉంటాయి.


ఈ పది కథల పుస్తకంలోని మొత్తం పేజీలు 48, వెల: యాభైరూపాయలు, ప్రతులకు: కెఎస్‌వి రమణమ్మ,

ఇంటినెంబర్: 7-1-67/3, చిన్నవాల్తేరు, మెయిన్ రోడ్, పోస్టాఫీసు ఎదురుగా, విశాఖపట్టణం-530017, ఆంధ్రప్రదేశ్, సెల్: 9347211537

పరిచయకర్త: డాక్టర్ అమ్మిన

నా కథలతో
భయం పోగొడతాను

బాలసాహితీ బంధువులు



నిర్వహణ: పైడిమర్రి రామకృష్ణ
సెల్: 9247564699

దెయ్యాలు, పిశాచాలు, భూతాలు, దొంగలే ముఖ్య పాత్రలుగా అనేక కథలు రాశారు. మాచిరాజు కామేశ్వరరావు తాతయ్య. తూర్పు గోదావరిజిల్లా ప్రతిపాడులో 21 మే 1955న పుట్టారు. అమ్మ రత్నకుమారి, నాన్న సీతారామయ్య. నెల్లూరు విఆర్ కాలేజిలో బికాం చదివారు. కెనెరా బ్యాంక్ కరెన్సీ చెస్ట్‌లో మేనేజర్‌గా పదవీ విరమణ చేశారు.

మాచిరాజు కామేశ్వరరావు చాలా చిన్న వయసు నుండే కథలు రాయటం ప్రారంభించారు. తండ్రి సీతారామయ్య గారి ప్రేరణతో తన 14వ ఏటా అంటే 1969 సెప్టెంబర్ చందమామ బాలల మాసపత్రికలో గుడ్డివాడి డబ్బు కథతో వీరి కథా రచన ప్రారంభమయ్యింది. 1972 నుండి చందమామకు ఓ యజ్ఞంలా కథలు రాశారు. చందమామలో ప్రచురించిన దయ్యాల, పిశాచాల కథలన్నీ దాదాపు మాచిరాజు రాసినవే కావటం విశేషం. కేవలం ఒక్క చందమామలోనే దాదాపు 250కి పైగా కథలు ప్రచురించబడ్డాయి. ఇవే కాకుండా బాలజ్యోతి, స్నేహబాల, బొమ్మరిల్లు వంటి పత్రికల్లో దాదాపు 100 కథలు ప్రచురించబడ్డాయి. చందమామ ద్వారా పాఠకులు, అభిమానులు వీరి చిరునామా తెలుసుకుని ఇంటికి వచ్చి కలుసుకుని దెయ్యాల కథలు, భూతాల కథలు, పిశాచాల కథలు రాయమని కోరేవారు. కళాశాలలో కూడా రచయితగా వీరికో మంచి గుర్తింపు లభించింది. కొన్ని కథల్ని రెండు కథా సంపుటాలు పాపిష్టిడబ్బు, చందమామ కథలుగా ప్రచురించి బాలలకు అందించారు.

నా కథల్లో దయ్యాలకి, దొంగలకి సముచిత స్థానం ఉంది. పిల్లల్లో దయ్యాలంటే భయం పోవాలనే నా కథల్లో దయ్యాలు నవ్విస్తాయి. హుషారు పుట్టిస్తాయి. నీతులు చెపుతాయి. వినోదం పంచుతాయి. అంతేకానీ పిల్లల్ని భయపెట్టవు అంటారు మాచిరాజు కామేశ్వరరావు.

వీరు రాసిన విధినిర్వహణ కథను మహారాష్ట్ర గవర్నమెంటు ఆరో తరగతి తెలుగువాచకంలో పాఠంగా ఎన్నిక చేయగా పారిపోయిన దొంగ అనే కథ కేంబ్రిడ్జ్ యూనివర్శిటీవారు రెండో పరీక్షపేపరుకు వీరి అనుమతితో వాడుకున్నారు. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ నిర్వహించిన పిల్లల నవలల పోటీలో అడుగుకో ఆపద నవలకు ప్రథమ బహుమతి లభించింది. బాలసాహిత్యంలో చేసిన కృషికి 2013-14 కొలసాని-చక్రపాణి పురస్కారం అందుకున్నారు మాచిరాజు తాతయ్య.

మాచిరాజు కామేశ్వరరావు
ఫ్లాట్ నెం 301
జ్యోతి క్రెస్ట్, డిఫెన్స్ కాలనీ,
సైనిక్‌పురి
సికింద్రాబాద్ 500094
సెల్: 9000080396
krmachiraju@gmail.com



బాలగేయాలు

అమ్మా అమ్మా రావే

అమ్మా అమ్మా రావె
పలకాబలపం తేవె
పలకాబలపం ఇస్తే
అక్షరాలు దిద్దేస్తా!
అమ్మా అమ్మా రావే
కలమూ కాగిత మివ్వవె
కలమూ కాగితమిస్తే
ఎన్నో పదాలు వ్రాసేస్తా!
అమ్మా అమ్మా రావె
కుంచె రంగు లివ్వవే
కుంచె రంగులిస్తే
చక్కని బొమ్మలు వేసేస్తా!
అమ్మా అమ్మా రావె
సైకిలు తాళమిస్తే
గబ గబ సైకిలు నేర్చేస్తా!



- నారంశెట్టి ఉమామహేశ్వరరావు

సైబీరియన్ పులి

సైబీరియన్ పులి జాతికి చెందిన జంతువు. దీనినే ఉత్తర చైనా పులి అని, మంచూరియా పులి అని, అముర్ అని, కొరియన్ పులి అని కూడా పిలుస్తారు. ఇది పులి జాతిలో ఒక అరుదైన జంతువు. దూరప్రాచ్యం ప్రాంతంలో అముర్ నది ప్రాంతంలో ఉంటుంది. ఇది ప్రస్తుతం రక్షిత వన్యప్రాణి. ఇది పులి జాతిలో ఫెలిడే కుటుంబంలో అతి పెద్దదైన జంతువు. ఇది సాధారణంగా మనుషులను తినడానికి అలవాటు పడదు. ప్రాంతంలో మనుషుల ఆవాసం తక్కువగా ఉండటంతో ఈ పులులు స్వేచ్ఛగా తిరగగలుగుతున్నాయి.





పకపక



గ్యారంటీ ఉంది

అమాయకరావ్ కొత్త కలర్ టీవీ తెచ్చాడు. నీళ్లలో ముంచుతున్నాడు. భంటి దీన్ని దూరంగా గమనించి ఇలా అడిగాడు.

భంటి: కొత్త టీవీ కదా! అప్పుడే నీళ్లలో ముంచుతావెందుకు?

అమాయకరావ్: చెక్ చేస్తున్నాను. రంగు మాత్రం వెలిసిపోవడం లేదు. ఎందుకంటే ఈ టీవీకి ప్రస్తుతం గ్యారంటీ ఉంది





లక్షరూపాయలు

సందీప్: నా ఇష్టాన్ని పూర్తి చేస్తే వారికి ఒక లక్ష రూపాయలిస్తాను

నరేష్: నీ ఇష్టం ఏమిటి?

సందీప్: నాకు రెండు లక్షల రూపాయల అవసరం ఉంది

ఫైనల్

చెర్రీ: ఎప్పుడు నేను పడుకున్నా కలలో కోతి ఫుట్‌బాల్ ఆడుతుంది

డాక్టర్: ఫర్వాలేదు. ఈ బిళ్ల రాత్రి పడుకునే ముందు వేసుకోవాలి

చెర్రీ: రేపటి నుంచి వేసుకుంటాను. ఇవ్వాళ ఫైనల్ ఉంది.



ఆరునెలలు నిండుతాయి



శ్యాంరావ్: నా కొడుకు పర్‌ఫెక్ట్

అప్పారావ్: అతను స్మోకింగ్ చేస్తాడా?

శ్యాంరావ్: లేదు

అప్పారావ్: అతను విస్కీ త్రాగుతాడా?

శ్యాంరావ్: లేదు

అప్పారావ్: అతను ఇంటికి ఆలస్యంగా వస్తాడా?

శ్యాంరావ్: లేదు

అప్పారావ్: మీరు నిజంగానే అదృష్టవంతులు. మంచి కుమారుడు. అతని వయసెంత?

శ్యాంరావ్: వచ్చే బుధవారానికి ఆరునెలలు నిండుతాయి.

బంగారు పలుకు

స్వాతంత్ర్యం అనేది ఎవరో
ఇచ్చేది కాదు
దాన్ని మనం సాధించుకోవాలి

- నేతాజీ సుభాష్ చంద్రబోస్



చిట్టిగాడి గుండెని గోలెట్టిచ్చేసింది ఈ పిల్లేనండి

రామ్‌చరణ్, సమంత జంటగా నటిస్తున్న చిత్రం రంగస్థలం. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల చిట్టిబాబుగా రామ్‌చరణ్ పాత్రను పరిచయం చేసిన చిత్రబృందం శుక్రవారం సమంత పాత్రను పరిచయం చేస్తూ మరో టీజర్‌ను విడుదలచేసింది. ఇందులో సమంత రామలక్ష్మి పాత్రలో నటిస్తున్నారు. ఇక టీజర్‌లో ఏముందంటే...రామలక్ష్మి నడుచుకుంటూ వెళ్తుంటే బ్యాక్‌గ్రౌండ్‌లో చిట్టిబాబు ఆమెను కామెంట్ చేస్తూ...ఓహోహో..ఏం వయ్యారం..ఏం వయ్యారం..ఏ మాటకామాట సెప్పుకోవాలండీ...ఈ పిల్ల ఎదురొత్తుంటే ఈ ఊరికే 18 సంవత్సరాల వయసు వచ్చేసినట్టు ఉంటుంది. ఈ చిట్టిగాడి గుండెని గోలెట్టిచ్చేసింది ఈ పిల్లేనండి..పేరు రామలక్ష్మండి..ఊరు...అంటుండగా రంగా..రంగస్థలానా అంటూ బ్యాక్‌గ్రౌండ్ పాట వస్తూ ఉంటుంది. అయితే సమంత పాత్రకు ఈ టీజర్‌లో డైలాగులు లేకపోవడంతో ఆమెది మూగ పాత్రేమోనన్న సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. కాగా ఈ చిత్రం మొదటిపాటను ఈ నెల 13న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మైత్రీ మూవీమేకర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తుండగా, ఆది పినిశెట్టి ముఖ్యపాత్రలో కనిపించనున్నారు. మార్చి 30న ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్న విషయం తెలిసిందే. దేవిశ్రీప్రసాద్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.



సమంత

నా ప్రేమకథ పాఠశాలలోనే మొదలైంది....!

ఏ తరహా కథలు అంతరించినా...వెండితెరపై ఎప్పటికీ నిలిచి ఉండేవి ప్రేమ కథలే. ఇరవై ఏళ్ల కిందట ఒక తొలిప్రేమ ఘన విజయంతో ప్రేమకథల సత్తా చాటితే...తాజాగా మరో తొలిప్రేమ ఆ బాటలో నడిచేందుకు వచ్చేస్తోంది. అప్పుడు బాబాయ్ పవన్‌లా ఆకట్టుకునేందుకు అబ్బాయ్ వరుణ్‌తేజ్ సిద్ధమవుతున్నాడు. ఈ శుక్రవారం తొలిప్రేమ ప్రేక్షకుల పలకరించబోతోంది. ఈ సందర్భంగా కథానాయకుడు వరుణ్ చెప్పిన చిత్ర కబుర్లు చూద్దాం....



- వరుణ్ తేజ్

- ఫిదా కంటే ముందే ఒప్పుకున్న సినిమా ఇది. శేఖర్ కమ్ముల సినిమా చేశాక ఈ చిత్రాన్ని ప్రారంభిద్దాం అనుకున్నాం. తొలిప్రేమ కథ ముందు దిల్‌రాజు విని...బాగుంది చేయమన్నారు. వాస్తవానికి ఆయన నిర్మాణంలోనే ఈ చిత్రాన్ని చేయాలి. అప్పటికున్న చిత్రాలతో తీరిక లేనందున...బీవీఎస్ఎన్ ప్రసాద్ గారికి చిత్రాన్ని ఇచ్చారు. అలా ఫిదా విజయం తర్వాత తొలిప్రేమను ప్రారంభించాం.

- దర్శకుడు వెంకీ అట్లూరి నాకు చాలా రోజులుగా తెలుసు. అయితే తనకు దర్శకత్వం చేయాలనే ఆలోచన ఉంది నాకు తెలియదు. దిల్ రాజు గారి ప్రొడక్షన్‌లో కొన్నాళ్లు పనిచేశారు. వెంకీ ప్రతిభ అక్కడే అందరికీ తెలిసింది. నాకంటే బాగా కథను నిర్ణయించగల వాళ్లు ఈ సినిమా చేయమన్నారు. నాకూ కథ బాగా నచ్చింది. అందుకే కొత్త దర్శకుడైనా ఎలాంటి సందేహం లేకుండా సినిమా చేయగలిగాను.

- ఫిదాలో ఎన్ఆర్ఐ యువకుడి పాత్ర కాబట్టి..కొంత మెత్తగా ఉంటాడు. ఊరికే ఎవరితో గొడవలు పడడు. అతనికి ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంటుంది. కానీ తొలి ప్రేమలో అంత మెతకగా ఉండడు. కాస్త దూకుడుగానే వ్యవహరిస్తాడు.

- మొత్తం మూడు దశల్లో నా పాత్ర సాగుతుంటుంది. వీటిలో లండన్ నేపథ్యంలో నడిచే పాత్ర అంటే ఇష్టం. ప్రేమమ్ సినిమాకు తొలిప్రేమకు ఎక్కడా పోలిక ఉండదు. మూడు దశల్లో కథ సాగుతుంది అంతే. చైతూ ప్రేమమ్‌లో చాలా చక్కగా నటించాడు..

- కథలో చాలా అంశాలు నా మనసుకు బాగా నచ్చాయి. థియేటర్‌లో ప్రేక్షకులు కూడా వాటిని పోల్చుకుంటారని నమ్ముతున్నాను. ముఖ్యంగా విశ్రాంతి సమయంలో నాయకా నాయికలు విడిపోయే సన్నివేశం నాకు బాగా నచ్చింది.

- తొలిప్రేమ టైటిల్ వరకు మాత్రమే తీసుకున్నాం. పవన్ బాబాయ్ తొలిప్రేమకు దీనికి సంబంధం లేదు. ఆ చిత్రంలో ఫోన్‌లు లేవు, ప్రేమను లేఖలో రాసి చూపిస్తాడు. అదీ రక్తంతో రాస్తాడు. కథానాయికకు అది నచ్చదు. ఇప్పుడా పరిస్థితి లేదు. సాంకేతికతతో ప్రేమికులు చాలా దగ్గరవుతున్నారు.

- ఈ కథకు ముందు కొత్త నాయికనే తీసుకుందాం అనుకున్నాం. అయితే ఊహలు గుసగుసలాడే సినిమా చూశాక..రాశీ ఖన్నా బాగుంటుంది అని నిర్ణయించాం. తను కూడా ఈ సినిమా కోసం చాలా జాగ్రత్తలు తీసుకుంది. చిత్రంపై ఆసక్తి చూపించింది. బరువు తగ్గి కొత్తగా కనిపించే రాశీ ఖన్నాను తెరపై చూస్తారు.

- ముకుందా లాంటి చిత్రాన్ని నా నట ప్రయాణంలో చాలా త్వరగా చేశానేమో అనిపిస్తుంది. లోఫర్ లాంటి సినిమాలూ నాకు ఇష్టమే. వాటి ఫలితం ఎలా వచ్చిందనేది తర్వాత సంగతి. కంచె చాలా మంచి సినిమా. ఇంకాస్త వసూళ్లు వచ్చి ఉండాల్సింది. ఫిదా విజయం తర్వాత కథల ఎంపికలో నాకూ అభిరుచి ఉంది ఫర్వాలేదు అనే నమ్మకం కలిగింది.

- చిన్నప్పటి నుంచి నాకు సినిమాలు చూడటం అంటే ఇష్టం. హాలీవుడ్ సహా అన్ని చిత్రాలు చూసేవాడిని. అలా నటనపై తెలియని ఆసక్తి ఏర్పడింది. మా నాన్న కూడా బాగా సినిమాలు చూస్తారు. కథల ఎంపిక నాదే. నాన్నకు ఇలా కథ నా దగ్గరికి వచ్చింది నాన్నా అని చెబుతాను. నువ్వు ముందే నిర్ణయించుకుని ఊరికే అడుగుతున్నావు కదరా అంటూ ఆటపట్టిస్తారు.

- ముందు మాస్ సినిమాలు ఇప్పుడు ప్రేమ కథలు చేస్తున్నాననే భేదాన్ని చూడను. మంచి సినిమా చేయాలి అనేది ఒక్కటే ఆలోచన. ఆ ఫలితం మంచి కథలో నుంచే వస్తుంది. నటించడం అంటే బయట చూసేవాళ్లు అనుకునేంత సుఖంగా ఉండదు. ఇక్కడ చాలా కష్టపడాలి. కథానాయకులుగా మాకు శరీరాకృతి చూసుకోవాలి, స్టైల్‌గా ఉండాలి, ఎప్పటికప్పుడు కొత్తగా కనిపించాలి అనే బాధ్యతలు పెరిగాయి.

- స్కూల్‌లో ఉన్నప్పుడు నా తొలిప్రేమ మొదలైంది. ఆమె ఫోన్ నెంబర్ కోసమే రోజులపాటు వేచి చూశా. కొన్నాళ్లు స్నేహితులుగా ఉన్నాం. నా కళాశాల రోజుల్లో మేము నలుగురం స్నేహితులం ఉండేవాళ్లం. మాకెవరికీ గర్ల్ ఫ్రెండ్స్ ఉండేవారు కాదు. ప్రేమికుల దినోత్సవం వస్తే మిగతా ప్రేమికులు ఎలా ఉంటున్నారు అనేది చూసేవాళ్లం.

- ఘాజీ చిత్ర దర్శకుడు సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో నా తదుపరి చిత్రం ఉంటుంది. కంచె నిర్మాతలు ఈ సినిమాను నిర్మిస్తారు. శ్రీహరికోట, అంతరిక్షం నేపథ్యంతో కథ సాగుతుంది. గ్రాఫిక్స్ కు ఎక్కువ ప్రాధాన్యమున్న చిత్రమిది. ఆ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి.

- పవన్ బాబాయ్ కున్న అభిమానులు, స్టార్ డమ్ నాకుంటే నేను రాజకీయాల్లోకి వెళ్లేవాడిని కాదు. ఆయన డబ్బూ, వయసూ, పేరు, సినిమాలు అన్నీ వదిలేసి వెళుతున్నారంటే కారణం కేవలం ఆయనకు ప్రజల మీద ఉన్న ప్రేమ మాత్రమే. పవర్‌స్టార్ సినిమాలు ఆపేయడం మాకు కష్టమే అయితే...ఆయన ప్రజలకు ఉపయోగపడుతున్నారంటే ఆ బాధ మర్చిపోతాం.

ఆడియో మనసుకు నచ్చింది...!



సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం మనసుకు నచ్చింది. మంజుల దర్శకత్వం వహిస్తున్నారు. ఇందిరా ప్రొడక్షన్స్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాడాన్ సంగీతాన్ని అందించిన మనసుకు నచ్చింది ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో జరిగింది. బిగ్ సీడీ ఆవిష్కరణ అనంతరం దర్శకురాలు మంజుల మాట్లాడుతూ...ఎన్నో సినిమాలు, ఎంతోమంది నిర్మాతలు దర్శకులను నేను చూశాను. పరిశ్రమలో స్థిరపడిన కుటుంబంలో పుట్టాను. ఏదో ఒక సినిమా చేయాలనే ఆలోచనతో ఈ చిత్రాన్ని రూపొందించలేదు. కథలో మంచి విషయం ఉండబట్టే దర్శకురాలిగా బాధ్యతలు తీసుకున్నాను. పేరుకు సినిమాలు చేయాల్సిన అవసరం నాకు లేదు. ఇది చాలా చాలా మంచి చిత్రం. తెరపైకి వచ్చాక ఎందుకు ఇలా చెబుతున్నానో అర్థమవుతుంది. హృదయం ఉన్న ప్రతి ఒక్కరికీ నచ్చే సినిమా అవుతుంది. మా ఆయన సంజయ్, పాప జాన్వి ప్రత్యేక పాత్రల్లో నటించారు. నాకు ప్రేమ కథలు అంటే ఇష్టం. నేను దర్శకత్వం చేస్తున్నానంటే మహేష్ నమ్మడు. నా మాట వినడు. అయితే ఈ చిత్ర ట్రైలర్స్ చూసి బాగున్నాయని చెప్పాడు. పవన్ కళ్యాణ్ గారికి సరిపోయే కథ ఒకటి సిద్ధం చేశాను. ఆయన విన్నారంటే తప్పకుండా నటిస్తారు. ఈ సినిమా చేశాక ఆయన రాజకీయాల్లోకి వెళ్లొచ్చు. అన్నారు. కథానాయకుడు సందీప్ కిషన్ మాట్లాడుతూ...ఇది ఏ తరహా చిత్రమని కొంతమంది అడిగారు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. అన్ని అంశాలున్న చిత్రమిది. ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని కలిగిస్తుంది. మంజుల గారి ఈ చిత్రాన్ని స్వీట్ ఫన్నీ సినిమాగా రూపొందించారు. అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు పి. కిరణ్, సంజయ్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

భారత్- పాకిస్తాన్ యుద్ధ నేపథ్యంలో

మెహబూబా



పూరి జగన్నాథ్, ఆకాష్

పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం మెహబూబా. ఇందులో ఆయన కుమారుడు ఆకాష్ పూరి కథానాయకుడిగా నటిస్తున్నారు. 1971 భారత్-పాకిస్తాన్ యుద్ధం నేపథ్యంలో సాగే ఈ సినిమా ఫస్ట్‌లుక్ టీజర్‌ను శుక్రవారం విడుదలచేశారు. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని ఈ టీజర్‌లో చూపించారు. సైనిక పాత్రలో ఉన్న ఆకాష్ ఆ యుద్ధ వాతావరణానికి దూరంగా తన ప్రేమికురాలిని తీసుకొచ్చే సన్నివేశం ఆకట్టుకుంటోంది. కాగా ఈ టీజర్‌ను విడుదలచేస్తూ మెహబూబా సినిమా తనకు చాలా ప్రత్యేకమైందని పూరి జగన్నాథ్ ట్వీట్ చేశారు. టీజర్‌ను చూసిన పూరి గురువు, దర్శకుడు రాంగోపాల్‌వర్మ, ఇంకా వరుణ్‌తేజ్, ప్రియమణి తదితరులు బావుందంటూ అభినందనలు తెలియజేస్తూ ట్వీట్లు చేశారు. పూరి జగన్నాథ్ సినీ కెరీర్‌లోనే ఉత్తమమైన చిత్రంలా ఉందన్న అభిప్రాయాన్ని రాంగోపాల్‌వర్మ వ్యక్తంచేస్తూ...ప్రేమకథలను సమ్మేళనపరిచి రూపొందించినట్లుగా ఉందని చెప్పుకొచ్చారు. ఇందులో ఆకాష్ పూరి సరసన నేహాశెట్టి కథానాయికగా నటిస్తుండగా, పూరి కనెక్ట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సందీప్‌చౌతా స్వరాలు సమకూరుస్తున్నారు. వేసవిలో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకుని రావాలనుకుంటున్నారు.

16న సోడా గోలీసోడా

మానస్, నిత్య నరేష్, కారుణ్య హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం సోడా గోలీసోడా. ఎస్.బి. ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై మల్లూరి హరిబాబు దర్శకత్వంలో భూవనగిరి సింధూజ నిర్మిస్తున్నారు. ఇన్ని కార్యక్రమాలూ పూర్తయ్యాయి. ఈనెల 16న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

నిర్మాత సత్య సింధూజ మాట్లాడుతూ పూర్తి వినోదాత్మక చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి. వాణిజ్య విలువలను కూడా జోడించి చిత్రాన్ని తెరకెక్కించాం. సెన్సార్ నుండి క్లీన్ యూ సర్టిఫికెట్ లభించింది. ఈనెల 16న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నాం అని తెలిపారు.



నిత్య, మానస్

మానస్, నిత్య నరేష్, కారుణ్య, బ్రహ్మానందం, అలీ, కృష్ణభగవాన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం భరత్, ఛాయాగ్రహణం ముజీర్ మాలిక్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం మల్లూరి హరిబాబు.

సూపర్ స్కెచ్ కోసం విదేశీ తారలు

సినిమాలకు హద్దులు చెరిగిపోతున్నాయి. అడపాదడపా విదేశీ నటులు మన సినిమాల్లో నటిస్తున్నారు కూడా. తాజాగా రవికుమార్ చావలి దర్శకత్వంలో తెలుగులో రూపొందుతున్న సూపర్ స్కెచ్ చిత్రంలో విదేశీ తారాగణం సందడి చేయనుంది. మైండ్‌గేమ్ కథాంశంతో తెరకెక్కుతోన్న చిత్రమిది. గతంలో బాలకృష్ణతో శ్రీమన్నారాయణ, జగపతిబాబుతో సామాన్యుడు, ఇంకా ఇతర హీరోలతో కొన్ని సినిమాలు చేసిన రవికుమార్ చావలి కొత్తవాళ్లను ప్రోత్సహిస్తూ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. నర్సింగ్, ఇంద్ర, సమీర్‌దత్, కార్తీక్, చక్రి మాగంటి, అనిక, సుభాంగి తదితరులతో పాటు విదేశీ తారాగణం సోఫియా, గ్యారీటాన్‌టోని (ఇంగ్లాండ్) ఇందులో కీలక పాత్రధారులు. యారో సినిమాస్ సమర్పణలో యు అండ్ ఐ-ఫ్రెండ్స్ ఫిల్మ్ అకాడమీ సహకారంతో శ్రీ శుక్ర క్రియేషన్స్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో, వైవిధ్యమైన కథాంశంతో ఆద్యంతం ఆసక్తికరంగా తెరకెక్కిస్తున్నాం. ఇటీవలే చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో భాగంగా డబ్బింగ్ జరుగుతోంది. మన వాళ్లతో పాటు విదేశీ తారల పాత్రలు కూడా మెప్పిస్తాయి. అందరికీ నచ్చే సినిమా అవుతుంది అని అన్నారు. సురేందర్‌రెడ్డి ఛాయాగ్రహణం అందిస్తుండగా, జునైద్ ఎడిటింగ్, కార్తీక్ కొడకండ్ల సంగీతం అందిస్తున్నారు. సుభాష్, నారాయణ్, ఇంజపూరి, ప్రియాంక సాహిత్యం సమకూర్చారు.



సోఫియా

శీనుగాడి ప్రేమ పాటలు

సుష్మ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై శ్రీనివాసరావు హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం శీనుగాడి ప్రేమ. సిన్సియర్ రా మామా అనేది ఉప శీర్షిక. ఆర్.కె. దర్శకత్వం వహిస్తున్నారు. ప్రణవి, కావేరి, చాందిని హీరోయిన్లు. రమణ సాకే సంగీతం అందించారు. ఈ చిత్రం పాటల విడుదల వేడుక శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. ఆర్.కె.గౌడ్ తొలి సీడీ ఆవిష్కరించారు. పాటలు, టీజర్ బావున్నాయని, కొత్తవారైనా అనుభవం ఉన్న నటీనటుల్లా నటించారని ఆయన ప్రశంసించారు.

సంగీత దర్శకుడు రమణ సాకే మాట్లాడుతూ ఈ సినిమాకు సంగీతం అందించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. పూర్తి స్వేచ్ఛనిచ్చి నాతో మంచి ట్యూన్స్ రాబట్టుకున్నారు. పాటలు బాగా వచ్చాయి అని చెప్పారు.

నిర్మాత, హీరో శ్రీనివాసరావు మాట్లాడుతూ నాకు నటన అంటే చాలా ఇష్టం. నేను చెప్పే డైలాగ్స్ విని నన్ను హీరోగా నటించమని మా దర్శకుడు ప్రోత్సహించారు. కథ నచ్చడంతో నటిస్తూ, నిర్మించాను. వైజాగ్, అరకు, తిరుపతి, కాణిపాకం, చిత్తూరు, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. యూనిట్ పూర్తి సహకారం అందించింది అన్నారు.

శీను అనే పేరు చాలామందికి ఉంటుంది. అలాంటి శీనులందరికీ ఇష్టమయ్యే కథాంశంతో ఈ సినిమా తీయడం జరిగింది అని చిత్ర దర్శకుడు ఆర్.కె. తెలిపారు.

ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి, సాయి వెంకట్, కె.సురేష్‌బూబాబు, బిందు, ప్రణవి, కావేరి, చాందిని, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రణవి, కావేరి

